


# అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం

03.08.2026
సోమవారం | అనంతపురం
సంపుటి : 11 | సంచిక: 82
పేజీలు : 12 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


### దిగజారుడు భాషపై బీజేపీ నేతలకు..
## మోదీ సమాధానం చెప్పాలి

- భారత్‌ను ప్రేమిస్తే దుబాయ్‌లో
- ఎందుకు ఉంటున్నారు?
- హీరోలు వివేక్ ఒబెరాయ్, మాధవన్‌లపై..
- రాజ్ థాక్రే తీవ్ర స్థాయిలో విమర్శలు

2లో..



## 'నశా ముక్త్ యువ'
### డ్రగ్స్‌కు దూరంగా యువత

- వికసిత్ భారత్‌కు అదే కీలకం
- ప్రచారాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీ
- కాశీ నుంచి దేశవ్యాప్త ఉద్యమంగా..

2లో..

**న్యూఢిల్లీ, ఆగస్టు 02, అనంతజనశక్తి న్యూస్**

డ్రగ్స్ రహిత యువతే వికసిత్ భారత్‌కు పునాది అని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. దేశవ్యాప్తంగా యువతను మాదకద్రవ్యాల దుర్వినియోగానికి దూరంగా ఉంచడంతో పాటు, సామాజిక మార్పుకు వారిని భాగస్వాములుగా మార్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 'నశా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్'ను ప్రారంభించింది. శనివారం వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రధాని మోడీ ఈ ప్రచారాన్ని ప్రారంభించారు.



### కర్ణాటక శివమొగ్గ జిల్లాలో విషాదం

- భారీ వర్షా లకు కొండచరియలు విరిగిపడి..
- ఒకే ఫ్యామిలీకి చెందిన ముగ్గురు మృతి



2లో..

**శివమొగ్గ, ఆగస్టు 02, అనంతజనశక్తి న్యూస్**

భారీ వర్షాలకు శివమొగ్గ జిల్లా ఇందిరానగర్‌లో ఘోర విషాద ఘటన చోటుచేసుకుంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు ఆదివారం ఓ కుటుంబం బలైంది. ఈరోజు తెల్లవారుజామున కురిసిన వర్షానికి కొండచరియలు విరిగిపడటంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. బాధితుల్లో మూడేళ్ల చిన్నారి ఉండటం స్థానికులను తీవ్రంగా కలచివేస్తోంది.

### రూ. 50 వేల వరకు వడ్డీ లేని రుణం

- రైతులకు భారీ శుభవార్త
- ఎఫ్‌సీవీ పొగాకు రైతులకు రిలీఫ్
- రెండేళ్ల కాలానికి వడ్డీ లేని రుణం మంజూరు

**అమరావతి, ఆగస్టు 02, అనంతజనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్‌లోని ఎఫ్‌సీవీ పొగాకు రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా భారీ ఉపశమనం ప్రకటించాయి. ఈ ఏడాది అనుమతించిన దానికంటే ఎక్కువ ఉత్పత్తి రావడం, అంతర్జాతీయంగా డిమాండ్ తగ్గడంతో ధరలు పడిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



2లో..

# ఏపీకి కేంద్రం శుభవార్త

- ప్రధాని మోదీ పర్యటన వెంటనే..
- పన్నుల వాటా కింద అదనంగా రూ.4597 కోట్లు
- కేంద్రం, ప్రధాని మోదీకి ధన్యవాదాలు
- సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడి
- రాష్ట్రాభివృద్ధి కోసం కేంద్రం సహకారం భేష్
- కేంద్రం సహకారంతోనే స్పీడ్ డెవలప్‌మెంట్

**అమరావతి, ఆగస్టు 02, అనంతజనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం శుభవార్త వినిపించింది. ఏపీకి అదనపు పన్నుల వాటా కింద రూ.4597 కోట్లు విడుదల చేసింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ధన్యవాదాలు తెలియజేశారు. కేంద్రం రాష్ట్రానికి సకాలంలో పన్నుల వాటా కేటాయిస్తోందన్న చంద్రబాబు.. కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. రాష్ట్రానికి అదనపు పన్నుల వాటా కేటాయింపు నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీకి, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి నెలా పదో తేదీన విడుదల చేసే.. పన్నుల వాటాకు అదనంగా రూ.4,597 కోట్లు కేటాయించారని చంద్రబాబు ట్వీట్ చేశారు.

2లో..





రాష్ట్ర పన్నుల వాటాను కేంద్రం సకాలంలో విడుదల చేయటంతో అభివృద్ధి కార్యక్రమాలకు మరింత బలం చేకూరుతుందని.. ఏపీలో అభివృద్ధి కార్యక్రమాల అమలు మరింత వేగంగా జరుగుతాయని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. కేంద్రం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి నిరంతర సహకారం అందిస్తూ.. రాష్ట్ర పురోగతికి ఎంతగానో దోహదపడుతోందని ధన్యవాదాలు తెలియజేస్తూ చంద్రబాబు ట్వీట్ చేశారు. "ఆగస్టు 10న అందాల్సిన సాధారణ నెలవారీ వాటాతో పాటు, ఆంధ్రప్రదేశ్‌కు అదనంగా ₹4,597 కోట్ల పన్ను వాటాను విడుదల చేసినందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

### ఫ్రెండ్షిప్ డే రోజున విషాదం
## స్నేహితురాలిని కాపాడబోయి..

- యువకుడు గల్లంతు!.. విశాఖపట్నంలోని పెదగంట్యాడలో ఘటన

2లో..

**విశాఖపట్నం, ఆగస్టు 02, అనంత జనశక్తి న్యూస్**

ఫ్రెండ్షిప్ డే సందర్భంగా సరదాగా గడపాలని వెళ్లిన స్నేహితుల బృందంలో విషాదం చోటుచేసుకుంది. విశాఖపట్నంలోని పెదగంట్యాడ మండలం పాత గంగవరం బీచ్‌లో సముద్ర అలలు ఇద్దరిని లోనికి లాక్కెళ్లాయి. యువతి నీతూ (18), యువకుడు దామోదర్ గల్లంతయ్యారు.

## ఫ్యామిలీకి 10 కిలోలు

- రాష్ట్రంలో 650 కేంద్రాల ద్వారా
- తక్కువ ధరకే క్వాలిటీ రైస్
- మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు
- రైతు బజార్లు, అవుట్‌లెట్లలో విక్రయాలు

5లో..




**విజయవాడ, ఆగస్టు 02, అనంజనశక్తి న్యూస్**

విజయవాడ ఆటోనగర్‌లోని ఏపీఐఐసీ రైతు బజార్‌లో వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. వినియోగదారులకు భారీ ఊరటగా రూ.52కే కిలో నాణ్యమైన సన్న బియ్యం అందుబాటులోకి తెచ్చింది ప్రభుత్వం. 150 రైతు బజార్లు, 500 రైస్‌మిల్ అవుట్‌లెట్లలో విక్రయాలు ప్రారంభం అయ్యాయి. ధరల స్థిరీకరణకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. బియ్యం ధరల పెరుగుదల నేపథ్యంలో వినియోగదారులకు ఉపశమనం కల్పించేందుకు కీలక నిర్ణయం తీసుకుంది ప్రభుత్వం.

## ప్రజా ఉద్యమంగా నిర్వహిద్దాం

- ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను..
- మంత్రి సీతక్క కామెంట్
- ఆగస్టు 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు

2లో..



### 2029 తర్వాత దేశంలో
## ఈవీలకు రిజిస్ట్రేషన్స్

- కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి
- 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా..
- ఎలక్ట్రిక్ మొబిలిటీ కీలక పాత్ర పోషిస్తుంది
- 73 శాతం విద్యుత్ బొగ్గు ఆధారితమే..

2లో..

## ఏపీ ఆస్ట్రేలియా మధ్య నాలుగు ఎంవోయూలు

- తిరుపతిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్
- క్లీన్ ఎనర్జీ, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్ రంగాల్లో
- కీలక ఒప్పందాలు చేసుకున్న ఏపీ
- విద్యా, నైపుణ్యాభివృద్ధి రంగాల్లోనూ..
- వెల్లడించిన మంత్రి నారా లోకేశ్
- సీఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పందాలు

2లో..




**అమరావతి, ఆగస్టు 02, అనంతజనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ ఆస్ట్రేలియాల మధ్య నాలుగు ఎంవోయూలు కుదిరాయి. ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ , ఆస్ట్రేలియా మంత్రి జూలియన్ హిల్ సమక్షంలో ఎంవోయూలను కుదుర్చుకున్నారు. క్లీన్ ఎనర్జీ, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్ రంగాల్లో ఈ ఒప్పందాలు చేసుకున్నారు. విద్యా, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో ఏపీ ఆస్ట్రేలియా మధ్య ఈ ఒప్పందాలు జరిగినట్లు లోకేశ్ తెలిపారు.

## ప్రజల సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

- రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ముందుకెళ్తున్నది
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- అమెరికాలో జరిగిన ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ సమావేశంలో..

2లో..



**హైదరాబాద్, ఆగస్టు 02, అనంత జనశక్తి న్యూస్**

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం సంక్షేమాన్ని, అభివృద్ధిని రెండు కళ్లుగా ముందుకు తీసుకెళ్తోందని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. తెలంగాణను ప్రపంచ స్థాయికి తీసుకెళ్తున్నామని తెలిపారు. అమెరికాలో జరిగిన ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని 2047 నాటికి $3 ట్రిలియన్, ఐదేళ్లలో $1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ ప్లాన్ అమలు చేస్తున్నామని వెల్లడించారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు తోడుగా ముచ్చర్లలో నెట్ జీరో ప్రమాణాలతో నాలుగో మహానగరంగా 'భారత్ ఫ్యూచర్ సిటీ' నిర్మిస్తున్నామని తెలిపారు.

## ప్రజల సంక్షేమం,
# అభివృద్ధి రెండు కళ్లు



(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రాన్నిసియుఆర్ఇ , పియుఆర్ఇ , ఆర్ఎఆర్ఇ వర్గాలుగా విభజించి అభివృద్ధితో ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. విద్యా రంగంలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, నియోజకవర్గానికో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, టాటా గ్రూప్ భాగస్వామ్యంతో రూ. 2,100 కోట్లతో ప్రభుత్వ ఐటీఐల ఆధునీకరణ, 27 లక్షల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉదయం బ్రేక్‌ఫాస్ట్, జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం వంటి విప్లవాత్మక మార్పులు తెచ్చినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్‌లో ఆక్రమణలపై 'హైడ్రా' ద్వారా కఠిన చర్యలు తీసుకుంటున్నామని, మూసీ నదిని లండన్ థేమ్స్ తరహాలో రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్థిక విచ్ఛిన్నత వల్ల జీతాలు ఆలస్యమయ్యేవని, తమ ప్రభుత్వం వచ్చాక ఆర్థిక క్రమశిక్షణతో ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు ఇస్తున్నామని, ఉద్యోగులకు రూ. 1.20 కోట్ల ఉచిత ప్రమాద బీమా కల్పిస్తున్నామని తెలిపారు. ఆరు గ్యారెంటీలను వేగంగా అమలు చేస్తున్నామని, రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, విదేశీ పెట్టుబడులతో రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 4.18 లక్షలకు చేరిందని పేర్కొన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంలో ఎన్ఆర్ఐలు, పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఐఓసీ నాయకులు పాల్గొన్నారు.

## దిగజారుడు భాషపై బీజేపీ నేతలకు..
# మోదీ సమాధానం చెప్పాలి



**ముంబై, ఆగస్టు 02, అనంత జనశక్తి న్యూస్**

బాలీవుడ్ హీరోలు వివేక్ ఒబెరాయ్ , ఆర్ మాధవన్‌లపై మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన్ అధ్యక్షుడు రాజ్ థాక్రే తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం భారతదేశంలో ప్రతీది అద్భుతంగా మార్చిందని అంటున్నారని.. మరి మీరెందుకు దుబాయ్‌లో స్థిరపడ్డారని ఆయన ప్రశ్నించారు. శనివారం ముంబయిలో ఎంఎన్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాజ్ థాక్రే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వేలాది మంది పారిశ్రామికవేత్తలు మూటముళ్లు సర్దుకుని దేశం నుంచి వెళ్లిపోతున్నారని ఆయన పేర్కొన్నారు.

''ప్రధాన మంత్రి జీవితం ఆధారంగా 2019లో తెరకెక్కిన బయోపిక్‌లో మోదీ పాత్రను పోషించిన వివేక్ ఒబెరాయ్ దుబాయ్‌కు వెళ్లిపోయారు.. మోదీని తరుచూ పొగిడే నటుడు మాధవన్ ఎక్కడున్నారు.. ఆయన దుబాయ్‌లోనే ఉంటున్నారు.. మీకు భారతదేశంపై అంత ప్రేమే ఉంటే. మోదీపై అంత అభిమానం ఉంటే? కుటుంబాలతో కలిసి విదేశాల్లో ఎందుకు నివాసం ఉంటున్నారు? భారతదేశాన్ని మోదీ అభివృద్ధి చేస్తున్నారని మీరు నమ్మితే... విదేశాల్లో ఎందుకు నివసిస్తున్నారు? మీ కుటుంబాలతో కలిసి దుబాయ్‌లో ఎందుకు ఉంటున్నారు?'' అని రాజ్ థాక్రే నిలదీశారు. ''వాళ్లు ఇక్కడికి వచ్చి, 'ధురందర్' వంటి ప్రభుత్వ ప్రాయోజిత చిత్రంలో నటించి ఆ తర్వాత దుబాయ్‌కి తిరిగి వెళ్ళిపోతారు'' అని ఆయన ఆరోపించారు. మాధవన్ తన కుమారుడి స్విమ్మింగ్ కెరీర్ కోసం కోవిడ్ 19 మహమ్మారి సమయంలో దుబాయ్‌కి వెళ్లినట్టు చెప్పగా.. వివేక్ ఒబెరాయ్ తన వ్యాపారాన్ని ప్రారంభించడానికి దుబాయ్‌కి వెళ్లానని చెప్పారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో జరిగిన నిరసనలలో ప్రధాని మోదీకి వ్యతిరేకంగా ఉపయోగించిన భాష అనుచితంగా ఉందని రాజ్ థాక్రే కూడా అన్నారు. దారితప్పిన పిల్లలను క్షమించి సరైన మార్గంలో నడిపించాలన్న దీ ప్రకటనను ప్రస్తావిస్తూ ''ప్రధాని ప్రకటనతో నేను ఏకీభవిస్తున్నాను. ఎవరూ కూడా అంత దిగజారిన భాషను ఉపయోగించకూడదు. కానీ, ఈ విషయాన్ని ముందుగా తన స్వంత పార్టీ నాయకులకు, మద్దతుదారులకు మోదీ చెప్పాలి అని థాక్రే వ్యాఖ్యానించారు. మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ వంటి మహనీయుల నుంచి థాక్రే కుటుంబం వరకు ప్రతీ ఒక్కరినీ బీజేపీ ట్రోల్స్ లక్ష్యంగా చేసుకుంటున్నాయని ఆయన ఆరోపించారు. సోషల్ మీడియాలో ట్రోలింగ్ భయంతోనే చాలామంది నటులు తమ అభిప్రాయాలను వ్యక్తపరచడానికి వెనకాడుతున్నారని ఆయన తెలిపారు. ''దిగజారుడు భాష ఉపయోగించకుండా తన మద్దతుదారులను బీజేపీ కూడా వారించాలి. ఈ అసభ్యకరమైన ట్రోలింగ్ వ్యవస్థను ప్రారంభించిందే బీజేపీ ట్రోల్ టీమ్‌లు.. మనం చేసిన పనుల ఫలితమే మనకు దక్కుతుంది'' అని రాజ్ థాక్రే స్పష్టం చేశారు. ఇతరులకు కూడా తల్లులు ఉంటారు, వారిని కూడా వేధించకూడదని ఆయన అన్నారు. సీజేపీ నిరసనలకు నీట్ పేపర్ లీక్ ఉదంతం కేవలం ఒక ప్రేరకం మాత్రమే అయినప్పటికీ, ఇన్నేళ్లుగా పేరుకుపోయిన అన్ని ఫిర్యాదుల పరాకాష్ట వల్లే దానికి అపూర్వ స్పందన లభించిందని ఎంఎన్ఎస్ చీఫ్ అన్నారు.

## ఏపీ – ఆస్ట్రేలియా మధ్య
# నాలుగు ఎంవోయూలు



(మొదటిపేజీ తరువాయి)

ఐఐటీ తిరుపతిలో సోలార్ తయారీ రంగంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా లోకేశ్ పోస్టు పెట్టారు. ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్యా, అంతర్జాతీయ అభివృద్ధి, బహుళ సాంస్కృతిక వ్యవహారాల సహాయ మంత్రి జూలియన్ హిల్‌కి స్వాగతం పలకడం చాలా ఆనందంగా ఉందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. గత సంవత్సరం తన ఆస్ట్రేలియా పర్యటన సందర్భంగా జరిగిన ఫలవంతమైన చర్చల ఫలితంగా, స్వచ్ఛ ఇంధనం, అధునాతన తయారీ, సమ్మిళిత విద్య, విద్యార్థుల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో నాలుగు వ్యూహాత్మక అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశామని వెల్లడించారు. ఈ ఎంవోయూల ద్వారా తమ ఉద్దేశాన్ని ఆచరణలోకి తీసుకువచ్చామని చెప్పుకొచ్చారు. ఈ అవగాహన ఒప్పంద ఆవిష్కరణ, ప్రతిభ, ఉమ్మడి శ్రేయస్సుపై నిర్మించిన బలమైన ఆంధ్రప్రదేశ్ ఆస్ట్రేలియా భాగస్వామ్యానికి నాంది పలుకుతుందని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

# ప్రజా ఉద్యమంగా నిర్వహిద్దాం

**హైదరాబాద్, ఆగస్టు 02, అనంతజనశక్తి న్యూస్**

ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ప్రజా ఉద్యమంగా నిర్వహిద్దామని తెలంగాణ మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. ఆగస్టు 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 'తల్లి పాలే శిశువుకు తొలి హక్కు.. తొలి టీకా' అని తెలిపారు. ఆదివారం హైదరాబాద్ వేదికగా మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడారు.

**బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు ఇవ్వాలి..**

బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు ఇవ్వాలని మంత్రి పేర్కొన్నారు. మొదటి 6 నెలలు కేవలం ఈ పాలే ఇవ్వాలని సూచించారు. తల్లిపాలపై అవగాహన పెంచాలని అధికారులను ఆదేశించారు. ఈ పాలపై ఉన్న అపోహలను తొలగిద్దామని తెలిపారు. ఆరోగ్యవంతమైన చిన్నారులే ఆరోగ్య తెలంగాణకు పునాది అని ఉద్ఘాటించారు. ప్రతి ఇంటికి 'తల్లి పాలే తొలి టీకా' సందేశం తీసుకెళ్లాలని సూచించారు. తల్లిపాల ప్రాముఖ్యంపై సమాజమంతా బాధ్యత తీసుకోవాలని మంత్రి సీతక్క సూచించారు.

## 2029 తర్వాత దేశంలో
# ఈవీలకు రిజిస్ట్రేషన్స్

**హైదరాబాద్, ఆగస్టు 02, అనంత జనశక్తి న్యూస్**

2029 తర్వాత దేశంలో కేవలం ఎలక్ట్రిక్ వాహనాలను మాత్రమే రిజిస్ట్రేషన్ చేసే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ బేగంపేటలోని ఐఏఎస్ ఆఫీసర్స్ క్లబ్‌లో కీటో మోటార్స్ ఈవీ బస్సును తెలంగాణ ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా నిలబెట్టే లక్ష్యంలో ఎలక్ట్రిక్ మొబిలిటీ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈవీల వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు 40 దేశాల నుంచి జరిగే పెట్రోలియం దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం 73 శాతం విద్యుత్ బొగ్గు ఆధారితమేనని, భవిష్యత్తులో పునరుత్పాదక ఇంధనాన్ని ప్రోత్సహిస్తామని వెల్లడించారు. ఇందులో భాగంగా ఏపీలో అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్, రూ. లక్ష కోట్లతో సర్ఫేస్ కోల్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులు చేపడతామని, చైనాపై ఆధారాన్ని తగ్గించుకోవడానికి రూ. 3,600 కోట్లతో క్రిటికల్ మినరల్స్ రంగంలో పెట్టుబడులు పెడుతున్నామని చెప్పారు. అదే కార్యక్రమంలో TGSRTC ఎండీ నాగిరెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఆర్టీసీ 1,050 ఈబస్సులు నడుపుతోందని, 'పీఎం ఈడ్రైవ్' కింద మరో 2,200 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో పెట్రోల్, డీజిల్ వాహనాలు భారీగా తగ్గుతాయని, లాస్ట్ మైల్ కనెక్టివిటీ కోసం ఆర్టీసీ ప్రత్యేక ప్రణాళికలు రచిస్తోందని వివరించారు.



## 'నశా ముక్త్ యువ'
# డ్రగ్స్‌కు దూరంగా యువత



(మొదటిపేజీ తరువాయి)

దేశవ్యాప్తంగా 100 వారాల పాటు ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

**డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి**

ప్రచారాన్ని ప్రారంభించిన సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'నశా ముక్త్ యువ' కార్యక్రమం కేవలం వ్యక్తుల కోసం మాత్రమే కాదని, కుటుంబాలు, సమాజం, దేశం కోసం చేపడుతున్న ఉద్యమమని అన్నారు. భారత్‌ను వికసిత్ భారత్‌గా మార్చే లక్ష్యంలో ఆరోగ్యవంతమైన యువత కీలక పాత్ర పోషిస్తుందని మోదీ పేర్కొన్నారు. యువత శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండటంతో పాటు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, డ్రగ్స్ వంటి ప్రమాదకరమైన అలవాట్లకు పూర్తిగా దూరంగా ఉండాలని అన్నారు.

**కాశీ నుంచి దేశవ్యాప్త ఉద్యమంగా..**

ఈ కార్యక్రమాన్ని తొలుత గత ఏడాది కాశీలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించినట్లు ప్రధాని మోదీ తెలిపారు. ప్రస్తుతం ఇది దేశవ్యాప్తంగా విస్తరించిన ఉద్యమంగా మారిందన్నారు. కాశీ ఎంపీగా ఈ కార్యక్రమం తన నియోజకవర్గం నుంచి ప్రారంభం కావడం ఆనందంగా ఉందని మోదీ పేర్కొన్నారు. శాస్త్రీయ అవగాహనతో పాటు ఆధ్యాత్మిక శక్తిని కూడా ఈ కార్యక్రమం కలిగి ఉందని అన్నారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం దేశవ్యాప్తంగా 125కు పైగా ఆధ్యాత్మిక సంస్థలు ఈ ప్రచారంలో భాగస్వాములయ్యాయని ప్రధాని తెలిపారు. కోట్లాది మంది ప్రజల సంక్షేమం కోసం సామాజిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు కూడా కార్యక్రమంలో పాల్గొంటున్నాయని చెప్పారు.

**కలిసికట్టుగా పనిచేస్తేనే డ్రగ్స్‌పై విజయం**

మాదకద్రవ్యాల దుర్వినియోగంపై పోరాటాన్ని వ్యక్తిగత ప్రయత్నాలతో మాత్రమే గెలవలేమని ప్రధాని మోదీ అన్నారు. ప్రజలందరూ కలిసికట్టుగా పనిచేసినప్పుడే పెద్ద మార్పు సాధ్యమవుతుందని చెప్పారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారని, తమ పాఠశాలలు, కళాశాలలు, సమాజాల్లో డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించేందుకు ముందుకు వస్తున్నారని మోదీ తెలిపారు. ఈ యువత తీసుకున్న సంకల్పం రాబోయే 100 వారాల పాటు కొనసాగనున్న దేశవ్యాప్త ప్రచారానికి మార్గదర్శకంగా ఉంటుందని అన్నారు.

# కర్ణాటక శివమొగ్గ జిల్లాలో విషాదం

(మొదటి పేజీ తరువాయి)





కొప్పల్ జిల్లా గంగావతి తాలుకా కొక్కరెగర గ్రామానికి చెందిన మల్లికార్జున్ (35) తన భార్య నాగవేణి (28), కుమారుడు సంతోశ్ (3)తో కలిసి ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్నాడు. అయితే, వారంతా నిద్రిస్తుండగా భారీ వర్షాలకు ఈరోజు తెల్లవారుజామున 2:30 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా కొండచరియలు విరిగిపడ్డాయి. సరిగ్గా వారు నివాసం ఉంటున్న రేకుల షెడ్డుపై పడటంతో నిద్రలోనే వారంతా కన్నుమూశారు. మరోవైపు, పక్కనున్న షెడ్డుపైనా మట్టి, రాళ్లు వచ్చి పడటంతో అందులో ఉన్న మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు.

సమాచారం అందుకున్న పోలీసులు, అత్యవసర సేవల విభాగం, అగ్నిమాపక బృంద సభ్యులు రంగంలోకి దిగారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన బాధితుడిని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం శిథిలాల కింద చిక్కుకున్న మృతదేహాలను వెలికి తీసేందుకు సహాయక చర్యలు చేపట్టారు. కాగా, మల్నాడు ప్రాంతంలో ఎడతెరిపి లేని భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందిన విషయాన్ని పోలీసులు ధ్రువీకరించారు.

# రూ. 50 వేల వరకు వడ్డీ లేని రుణం

(మొదటిపేజీ తరువాయి)



ఈ పరిస్థితిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ న్యూఢిల్లీలో కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ, టొబాకో బోర్డు , ప్రజాప్రతినిధులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించి కీలక నిర్ణయాలు వెల్లడించారు.

రైతులను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రతి బారన్‌కు రూ.50 వేల చొప్పున రెండేళ్ల కాలానికి వడ్డీ లేని రుణాన్ని మంజూరు చేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 45 వేల బారన్‌లకు కలిపి దాదాపు రూ.250 కోట్ల వరకు రుణ సదుపాయం లభిస్తుంది. దీనివల్ల దాదాపు 40 వేల మంది పొగాకు రైతులకు నేరుగా లబ్ధి చేకూరనుంది. మరోవైపు లోగ్రేడ్, ఆఫ్‌స్టైల్ పొగాకు అమ్మకాలపై జరుగుతున్న నష్టాన్ని పూడ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంది. కిలోకు రూ.10 చొప్పున ధర లోటు భర్తీ చెల్లించేందుకు రూ.100 కోట్లను కేటాయించింది. ఈ మొత్తాన్ని వ్యవసాయ శాఖ ద్వారా నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. వ్యాపారులు, ఎగుమతిదారులు కూడా రైతులకు మేలు జరిగేలా ధరలు చెల్లించేందుకు అంగీకరించారు. బ్రైట్ గ్రేడ్‌కు రూ.230, మీడియం గ్రేడ్‌కు రూ.190, లో గ్రేడ్‌కు రూ.110, ఆఫ్‌స్టైల్‌కు రూ.130 చొప్పున కొనుగోళ్లు జరపనున్నారు. వేలం ప్రక్రియను వేగవంతం చేస్తూ రోజుకు 20 లక్షల కిలోల పొగాకును కొనుగోలు చేసి, రాబోయే రెండు నెలల్లో ప్రక్రియ మొత్తాన్ని పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఇతర రాష్ట్రాల పొగాకు మార్కెట్‌లోకి రాకముందే మన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ పెమ్మసాని విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో తీసుకున్న ఈ నిర్ణయాలు పొగాకు రైతులకు కొండంత అండగా నిలుస్తాయని ఆయన స్పష్టం చేశారు.

## ఫ్రెండ్షిప్ డే రోజున విషాదం
# స్నేహితురాలిని కాపాడబోయి..

(మొదటి పేజీ తతరువాయి)

ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. సమాచారం అందుకున్న న్యూ పోర్ట్ పోలీసులు, బీచ్ లైఫ్‌గార్డులు గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

పోలీసుల వివరాల ప్రకారం.. ఫ్రెండ్షిప్ డే సందర్భంగా ఏడుగురు స్నేహితులు పాత గంగవరం బీచ్‌కు వెళ్లారు. వారిలో నలుగురు యువతులు, ముగ్గురు యువకులు ఉన్నారు. బీచ్ సమీపంలో అందరూ కలిసి ఫోటోలు దిగుతుండగా.. జాలరిపేటకు చెందిన నీతూ ప్రమాదవశాత్తు సముద్ర అలల్లో కొట్టుకుపోయింది. ఆమెను గమనించిన పెందుర్తికి చెందిన దామోదర్ వెంటనే సముద్రంలోకి దిగి రక్షించేందుకు ప్రయత్నించాడు. అయితే బలమైన అలల కారణంగా అతడు కూడా గల్లంతయ్యాడు.



# ఏపీకి కేంద్రం శుభవార్త

(మొదటిపేజీ తరువాయి)

అభివృద్ధిని వేగవంతం చేసే మా ప్రయత్నాలను బలోపేతం చేసే ఈ సమయానుకూల మద్దతుకు, ఆంధ్రప్రదేశ్ ప్రజల తరపున నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను." అంటూ చంద్రబాబు ట్వీట్ చేశారు. మరోవైపు లక్ష కోట్లకు పైగా అదనపు పన్నుల వాటా కింద కేంద్రం, రాష్ట్రాలకు విడుదల చేసింది. అత్యధికంగా యూపీకి 19208 కోట్లు కేటాయించారు. బిహార్ రాష్ట్రానికి 10845 కోట్లు కేటాయించారు. ఏపీకి 4597 కోట్లు కేటాయించగా.. తెలంగాణ రాష్ట్రానికి 2370 కోట్లు విడుదల చేశారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అదనపు పన్నుల వాటా కేటాయింపుపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా కేంద్రానికి ధన్యవాదాలు తెలియజేశారు. కేంద్రం తీసుకున్న నిర్ణయం కారణంగా మూలధన వ్యయం పెరగడమే కాకుండా, మౌలిక సదుపాయాల అభివృద్ధి వేగవంతం అవుతుందని పవన్ కళ్యాణ్ అభిప్రాయపడ్డారు. వ్యవసాయం, నీటిపారుదల, విద్య, ఆరోగ్య సంరక్షణ రంగాలతో పాటుగా కీలక అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరాయంగా అమలు చేసేందుకు ఈ నిధులు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.



# క్షమాపణ చెప్పాల్సింది పోయి.. క్షమాభిక్ష మాటలా?



అవినీతికర పరీక్షల వ్యవస్థను నడుపుతున్న ప్రధాని మోదీయే దేశంలోని విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని, ఆయన క్షమాభిక్ష ఎవరికీ అవసరం లేదని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ప్రశ్నపత్రాల లీక్‌ల కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఒక్కరినీ పరామర్శించని ప్రధాని.. 'క్షమించడం' గురించి ఎలా మాట్లాడతారని శనివారం ఎక్స్ వేదికగా ఆయన ప్రశ్నించారు. బిడ్డలను కోల్పోయిన తలిదండ్రుల బాధ కంటే ఏదీ ఎక్కువ కాదని స్పష్టం చేశారు. 'లీకేజీల కారణంగా ప్రాణాలు తీసుకున్న ప్రతి ఒక్కరి వెనుక ఒక కుటుంబం బాధ ఉంటుంది. అది ఎప్పటికీ వారిని వదిలిపెట్టదు. దీంతోపాటు విఫలమైన విద్యా వ్యవస్థపై వారిలో అనేక ప్రశ్నలుంటాయి' అని పేర్కొన్నారు. తమిళనాడులో ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థుల కుటుంబాలను పరామర్శించిన అనంతరం ఆయన ఈ పోస్టు పెట్టారు. 'లీకైన ప్రశ్నపత్రాలు.. రద్దైన పరీక్షలు.. సంవత్సరాల తరబడి కష్టపడి చదివిన చదువు ఒక్క రాత్రిలో కళ్లముందే కుప్పకూలిపోవడం. నిజాయతీగా లేని వ్యవస్థపట్ల నిజాయతీగా పని చేయాలని విద్యార్థులకు చెప్పడం. అంతేకాకుండా మళ్లీ విద్యార్థులను క్షమిస్తున్నానని ప్రధాని మాట్లాడే ధైర్యం చేయడం' వంటివన్నీ దారుణమని రాహుల్ వ్యాఖ్యానించారు.

### మన్నింపు కోరుతారనే అనుకుంటున్నా: దీప్కే

**చలో పార్లమెంటు సందర్భంగా పోలీసుల చేతిలో గాయపడ్డ మహిళా ఆందోళనకారులకు తన తదుపరి వీడియో సందేశంలో ప్రధాని మోదీ క్షమాపణ చెబుతారని ఆశిస్తున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. తనను దూషించిన వారిని క్షమిస్తున్నానని పేర్కొంటూ శుక్రవారం రాత్రి ప్రధాని విడుదల చేసిన వీడియోపై శనివారం దీప్కే స్పందించారు. 'మోదీజీ శనివారం రాత్రి మరో వీడియో విడుదల చేస్తారని ఆశిస్తున్నా. జులై 20వ తేదీ నాటి లాఠీఛార్జిలో గాయపడ్డ వారికి క్షమాపణ చెబుతారని అనుకుంటున్నా' అని పేర్కొన్నారు.**

# ఔను.. మోదీ విఫలమయ్యారు

**"ప్రధాని మోదీ పనితీరు తీవ్ర అసంతృప్తికరంగా ఉంది. ఆయన పూర్తిగా విఫలమయ్యారు. 12 ఏళ్లుగా అధికారంలో ఉంటున్నా... నియంతలా మారలేకపోయారు. ఇది వైఫల్యమే" అని భాజపా నేత షెహజాద్ పూనావాలా వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ విఫలమయ్యారంటూ కాంగ్రెస్, విపక్షాలు చేసిన ఆరోపణలపై శనివారం ఆయన వ్యంగ్యంగా స్పందించారు. "మోదీకి నియంతగా వ్యవహరించటం ఎలాగో తెలియటం లేదు. బదులుగా.. తనను తిట్టిన వారికి క్షమాభిక్ష పెడుతున్నారు. వారిని ఏమీ అనొద్దంటూ సమాజానికి, పోలీసులకు విజ్ఞప్తి చేస్తున్నారు. నియంతగా ఎలా ఉండాలో, ఎమర్జెన్సీ అంటే ఎలా ఉంటుందో రాహుల్ నానమ్మ ఇందిరాగాంధీ, ముత్తాత నెహ్రూల నుంచి నేర్చుకోండి మోదీజీ! మిమ్మల్ని నియంతగా చూడాలనుకుంటున్న వారి ఆశల్ని మీరు అడియాసలు చేశారు. మోదీజీ.. మీరు విఫలమయ్యారు" అని షెహజాద్ వ్యంగ్యం గుప్పించారు. విద్యార్థులపై పెట్టిన కేసులను మోదీ ప్రభుత్వం ఎత్తివేస్తుంటే.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో కేసులు పెడుతున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీని దూషించిన ఇన్‌స్టాగ్రామ్ యూజర్‌పై కేరళలో, ఒక ర్యాప్ కళాకారుడిపై**



**కర్ణాటకలో కేసులు పెట్టారని ఆయన గుర్తుచేశారు.**

# జంతర్‌మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళన.. ఉగ్రకుట్రకు పథక రచన



పాకిస్థాన్‌కు చెందిన జైషే మహ్మద్ ఉగ్రసంస్థతో సంబంధాలు ఉన్న హమీమ్ మోండల్ అనే వ్యక్తిని, అతడికి సహకరించిన యువతిని బెంగాల్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. దర్యాప్తులో భాగంగా స్పెషల్ టాస్క్ ఫోర్స్ అధికారులు కీలక విషయాలను వెల్లడించారు. ఇటీవల దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసనల్లో అల్లర్లు సృష్టించాలని , బెంగాల్ సీఎం సువేందు అధికారిని లక్ష్యంగా చేసుకోవాలని నిందితులు ప్రణాళికలు రచించినట్లు గుర్తించామన్నారు.

పోలీసు యూనిఫామ్‌లో నిరసన ప్రదేశంలోకి ప్రవేశించి.. అల్లర్లు సృష్టించాలని జైషే గ్రూప్ నుంచి హమీమ్‌కు ఆదేశాలు అందాయని అధికారులు వెల్లడించారు. ఇందు కోసం కొంతమంది మహిళలు, పురుషులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించినట్లు తెలిపారు.

అయితే వారు జంతర్‌మంతర్ వద్దకు వెళ్లారా.. లేదా..? అనే విషయాన్ని తెలుసుకోవడానికి ఉగ్ర హ్యాండ్లర్‌లతో వారు చేసిన చాట్‌లను పరిశీలిస్తున్నామన్నారు. సువేందు అధికారి ఏ ప్రదేశంలో పోలీసుల బందోబస్తు లేకుండా ఉంటారో లాంటి వివరాలు సేకరించాలని కూడా వారు నిందితులను ఆదేశించారన్నారు.

ఇన్‌స్టాగ్రామ్ ప్రేమ..

బెంగాల్‌లోని రాజకీయ నేతలకు వలపు వల విసిరేందుకు సహకరించిన ఝార్ఖండ్ యువతి అర్పిత సర్కార్.. హమీమ్‌కు ప్రియురాలని అధికారులు వెల్లడించారు. నాలుగేళ్ల క్రితం వారికి ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. చిన్నస్థాయి నేతలను పరిచయం చేసుకొని.. వారి ద్వారా ప్రముఖ నేతలపై నిఘా పెట్టడం, తమ వారిని రాజకీయ పార్టీల్లో కార్యకర్తలుగా నియమించడం వంటి పనులకు హమీమ్ ఆమెను వినియోగించుకునేవాడు. బెంగాల్ మంత్రి ఉమేష్ రే కుమారుడిని హనీట్రాప్‌తో కిడ్నాప్ చేసి, వారి కుటుంబం నుంచి డబ్బులు వసూలు చేయడానికి వీరిద్దరూ కుట్ర పన్నారు. రాష్ట్రంలోని పలువురు రాజకీయ నేతలతో యువతికి సంబంధాలు ఉన్నాయని.. వారి సమాచారాన్ని ఆమె హమీమ్‌కు చేరవేసిందని అధికారులు పేర్కొన్నారు.

ఎన్‌క్రిప్టెడ్ యాప్‌లతో సంప్రదింపులు..

నిందితులు ఇద్దరు పలు ఎన్‌క్రిప్టెడ్ యాప్‌ల ద్వారా పాక్ హ్యాండ్లర్‌లతో కొన్నేళ్లుగా టచ్‌లో ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. యూకే, మెక్సికోలకు చెందిన అంతర్జాతీయ సిమ్ కార్డ్‌లు వారి వద్ద లభ్యమయ్యాయి. దేశంలో తీవ్రవాద భావజాలాన్ని వ్యాప్తి చేయడం, ఉగ్రవాద నియామకాలు వంటి కార్యకలాపాలకు కూడా హ్యాండ్లర్లు వీరిని ఉపయోగించుకున్నారు.

# ప్రధాని నిర్ణయంతో నా కుమార్తెకు పునర్జన్మ: నోయిడా బాలిక తల్లి



పేపర్‌లీక్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు చేసిన నిరసనల్లో భాగంగా ప్రధాని మోదీ పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినందుకు నోయిడా పోలీసులు ఓ బాలికపై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలోనే ఆమె తన తప్పు తెలుసుకుని ప్రధాని మోదీకి క్షమాపణలు చెప్పిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై బాలిక తల్లి స్పందిస్తూ.. తన కుమార్తెను క్షమించినందుకు ప్రధానికి కృతజ్ఞతలు తెలియజేశారు. "ప్రధాని క్షమించడంతో నా కుమార్తెకు కొత్త జీవితం లభించింది. అభ్యంతరకరమైన పదాలను ఉపయోగించినా.. క్షమించి ఆయన గొప్ప మనసును చాటుకున్నారు. ఇవాళ నా కుమార్తె పుట్టినరోజు. ఆమెకు ప్రధాని అత్యంత గొప్ప కానుకగా కొత్త జీవితాన్ని ఇచ్చారు. ఈరోజు ఆమెకు పునర్జన్మ లభించింది" అని పేర్కొన్నారు.

మైనర్లను సోషల్ మీడియా వాడకుండా.. నిరసనల్లో పాల్గొనకుండా నిషేధం విధించాలని బాలిక తల్లి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తన కుమార్తెపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో పోలీసులు ఆమె వయసు 25ఏళ్లుగా నమోదు చేశారని.. కానీ ఆమె వయసు 15 ఏళ్లే అని పేర్కొన్నారు. తన కుమార్తెపై నమోదు చేసిన కేసును కొట్టివేయించాలని ప్రధానిని కోరారు. తప్పు తెలుసుకొని క్షమాపణ చెప్పినప్పటికీ.. ఆమెకు సోషల్ మీడియాలో బెదిరింపులు వస్తున్నాయన్నారు. ఈ విషయంలో అధికారులు జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాగా బాలిక మరోసారి ప్రధాని మోదీకి క్షమాపణలు తెలియజేసింది. నిరసనల్లో భాగంగా కొందరి ప్రభావానికి లోనైన తాను ప్రధానికి వ్యతిరేకంగా చెడు మాటలు మాట్లాడానని పేర్కొంది.

# అమెరికా చదువులకు దీప్కేకు డబ్బు ఎక్కడిది?: ఆర్టీఐ కార్యకర్త

కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కుటుంబ ఆర్థిక వ్యవహారాలపై దర్యాప్తు చేపట్టాలని సూరత్‌కు చెందిన ఆర్టీఐ కార్యకర్త అమిత్ తివారీ కోరారు. మహారాష్ట్రలో రిటైర్డ్ ఉద్యోగి అయిన దీప్కే తండ్రి భగవాన్‌రావు.. కుమారుడి అమెరికా ఉన్నత విద్యకు అవసరమైన నిధులు ఎలా సమకూర్చారో పరిశీలించాలని ఆదాయపు పన్ను అధికారులకు ఫిర్యాదు చేశారు.

అదే సమయంలో సీజేపీకి సీనియర్ న్యాయవాది, రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ ప్రకటించిన రూ.కోటి న్యాయ సహాయ నిధిపై కూడా విచారణ జరపాలని కోరారు. అలాగే ఈ నిధిపై జీఎస్‌టీ వర్తిస్తుందా అనే విషయాన్ని కూడా సంబంధిత అధికారులు పరిశీలించాలని కోరారు. ఇటీవలి నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులు, నిర్వాహకులకు న్యాయ సహాయం అందించేందుకు ప్రజల విరాళాలతో ఆన్‌లైన్ లీగల్ ఎయిడ్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సీజేపీ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సిబల్ విరాళాన్ని ప్రకటించారు.

సీజేపీ నమోదైన రాజకీయ పార్టీ కాదని, అలాంటప్పుడు నిధులు స్వీకరించడం చట్టబద్ధమేనా అనే అంశాన్ని పరిశీలించాలని ఆర్టీఐ కార్యకర్త ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు.



# వైరల్ వీడియో: మొసలిని భుజాన మోస్తు.. పోలీస్‌స్టేషన్‌కి నడిచిన రైతు!



బిహార్‌లోని సుపౌల్ జిల్లాలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. పొలంలోకి వచ్చిన మొసలిని బంధించి.. ఓ రైతు భుజాన మోసుకుంటూ నేరుగా పోలీస్‌స్టేషన్‌కు నడిచాడు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఇంతకీ ఏం జరిగిందంటే..?

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరి పొలంలో కొందరు రైతులు పనిచేస్తుండగా.. అకస్మాత్తుగా మొసలి కదలికలను గమనించారు. అక్కడ ఒక్కసారిగా భయాందోళన వాతావరణం నెలకొంది. మొసలికి హాని తలపెట్టకుండా సురక్షితంగా బంధించాలని రైతులు అనుకున్నారు. ఇతరుల సాయంతో రైతు అమిత్‌కుమార్ చాకచక్యంగా వ్యవహరించారు. మొసలి ఎవరిపైనా దాడి చేయకుండా ఉండేందుకు ముందుగా దాని నోరుని తాళ్లతో కట్టాడు. దాన్ని తరలించేందుకు తక్షణ ఏర్పాటు లేకపోవడంతో.. అమిత్ స్వయంగా దాదాపు 5 అడుగుల పొడవున్న మొసలిని భుజాన మోసుకుంటూ నేరుగా సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు బయలుదేరాడు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. అధికారులు మొసలిని స్వాధీనం చేసుకొని సమీపంలోని నదిలో వదిలారు.

# సమర్థులైన జడ్జీలకు అన్యాయం



న్యాయమూర్తుల నియామక ప్రక్రియలో అత్యంత పారదర్శకత తప్పనిసరి అని సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ అభిప్రాయపడ్డారు. కొలీజియం సిఫార్సులకు తగిన కారణాలు వెల్లడించకపోవడం వల్ల సమర్థులైన, అద్భుత సేవలు అందించిన జడ్జీలకు అన్యాయం జరుగుతుందన్నారు. రాజ్యాంగ విలువలకు విరుద్ధంగా వ్యవహరించే వ్యక్తులు న్యాయవ్యవస్థలోకి ప్రవేశించే అవకాశం ఏర్పడుతోందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పారదర్శకత పాటించడంలో కొలీజియం విఫలం కావడం వల్లే ప్రజాసమూహాలను చీమలతో పోల్చడంతో పాటు రాజ్యాంగ వ్యతిరేక వ్యాఖ్యలనూ న్యాయమూర్తులు చేయగలుగుతున్నారని దుయ్యబట్టారు. "కొలీజియం చేసిన గత మూడు తీర్మానాలను నేను నిశితంగా గమనించాను. అందులో నియామకాలకు సంబంధించి ఎలాంటి కారణాలూ వెల్లడించలేదు. ఇది పారదర్శకత సూత్రం నుంచి వెనక్కి తగ్గడం కాదా? కొలీజియం తీర్మానాలు చూస్తుంటే కాపీపేస్ట్ చేసినట్లుగా ఉన్నాయి" అని జస్టిస్ భూయాన్ ఆక్షేపించారు. న్యాయ మేధోపరుల వేదిక 'విధి' రూపొందించిన నివేదిక విడుదల కార్యక్రమంలో మాట్లాడుతూ శనివారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పేరు వెల్లడించకుండానే ఓ హైకోర్టు జడ్జి చేసిన విద్వేష ప్రసంగం గురించి ప్రస్తావించారు. "ఇలాంటి వ్యక్తులు న్యాయవ్యవస్థలోకి రాకుండా చేయాలంటే కొంత చర్చ జరగాలి. సహేతుకమైన కారణాలను వెల్లడించాలి" అని జస్టిస్ భూయాన్ అభిప్రాయపడ్డారు.

# ఒజెంపిక్ అతివాడకంతో ఊడుతున్న జుట్టు!



బరువు తగ్గడానికి ఉపయోగిస్తున్న ఒజెంపిక్, వెగోవీ, మౌంజారో వంటి ఔషధాలతో దుష్ప్రభావాలు పెరుగుతున్నాయని పరిశోధకులు చెబుతున్నారు. ముఖంలో వార్ధక్య లక్షణాలతో పోలిన 'ఒజెంపిక్ ఫేస్' అనే సమస్య ఉత్పన్నమవుతుండగా.. ఇప్పుడు మరో రుగ్మత తెరపైకి వచ్చింది. దీన్ని 'ఒజెంపిక్ హెయిర్'గా పేర్కొంటారు. వేగంగా బరువు తగ్గడం వల్ల జుట్టు ఎక్కువగా ఊడుతోందని పరిశోధకులు తెలిపారు. ఈ మందులను దుర్వినియోగం చేయడమే దీనికి ప్రధాన కారణమని చెబుతున్నారు. ఊబకాయాన్ని, మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవాలనుకునేవారిలో ఈ ఔషధాలు బాగా ఆదరణ పొందాయి.

అయితే వాటిని మితిమీరి ఉపయోగించడం, వైద్య పర్యవేక్షణ లేకుండా వాడటం వంటివాటివల్ల అనేక మంది గణనీయ స్థాయిలో జుట్టును కోల్పోతున్నారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వేగంగా బరువు కోల్పోవడం శారీరక ఒత్తిడిని కలిగిస్తోందని, దీనివల్ల వెంట్రుక కుదుళ్లు పెద్ద సంఖ్యలో అర్ధాంతరంగా విశ్రాంత దశకు చేరుకుంటున్నాయని వివరించారు. చికిత్స సమయంలో ఆకలి మందగించడం వల్ల ప్రొటీన్, ఐరన్, జింక్, బయోటిన్ వంటి పోషకాలకు కొరత ఏర్పడుతోందని తెలిపారు. వెంట్రుకలు ఆరోగ్యంగా పెరగడానికి ఇవి చాలా అవసరం.

# 2 నెలల్లోనే శిక్ష.. యాంటీ పేపర్ లీక్ చట్టంపై గెజిట్



కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని అత్యంత వేగంగా నిలబెట్టుకుంది. యాంటీ పేపర్ లీక్ చట్టాన్ని అతి తక్కువ కాలంలోనే అమల్లోకి తెచ్చింది. ఇటీవల పార్లమెంటు ఉభయ సభల్లో ఆమోదం పొందిన బిల్లుపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సంతకం చేశారు. దీంతో అది చట్టమైంది. ఆ వెంటనే కేంద్ర న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో ప్రజా పరీక్షల (అక్రమ కార్యకలాపాల నివారణ) సవరణ చట్టం 2026 అమల్లోకి వచ్చింది. కొత్త చట్టం ప్రకారం.. పేపర్ లీకేజీ కేసులను విచారించడానికి రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తాయి. నేరస్థులకు వెంటనే శిక్ష పడేలా కోర్టులు 2 నెలల్లోనే విచారణను పూర్తి చేస్తాయి.

ఎవరైనా వ్యక్తులు పరీక్ష పత్రాల లీకేజీకి కారణమైతే.. కనిష్ఠంగా ఐదేళ్లు, గరిష్ఠంగా పదేళ్లు శిక్ష విధిస్తారు. రూ.50 లక్షల వరకూ జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.

వ్యవస్థీకృతంగా ఈ నేరానికి పాల్పడితే ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 కోట్ల జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.

ప్రశ్నపత్రాల లీక్, ఓఎంఆర్ షీట్ల ట్యాంపరింగ్, ఫేక్ వెబ్‌సైట్ల ఏర్పాటు, ఫేక్ గుర్తింపు కార్డుల జారీ వంటి 15 నేరాలకు పాల్పడే వారికి ఈ చట్టం వర్తిస్తుంది.

# కేరళలో భారీవర్షాలు.. ఆరుగురి మృతి



భారీ వర్షాలతో కేరళలో శనివారం కొండచరియలు విరిగిపడి వేర్వేరు ఘటనల్లో నాలుగేళ్ల బాలుడు సహా ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. కొండచరియలు విరిగిపడి ఇడుక్కి జిల్లాలో ఇద్దరు, కొట్టాయం జిల్లాలో తల్లీకొడుకులు మరణించారు. పలు జిల్లాల్లో లోతట్టు ప్రాంతాల ఇళ్లలోకి వరద జలాలు ప్రవేశించాయి. నదులు ఉప్పొంగుతున్నాయి. ఆరు జిల్లాల్లో డ్యాముల గేట్లు ఎత్తారు. 183వ జాతీయ రహదారిపైకి నీళ్లొచ్చాయి. పంపానది తీరంలోని పలు ప్రాంతాలకు వరదల కారణంగా బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. పడవల సాయంతో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వాతావరణ శాఖ పలు ప్రాంతాలకు రెడ్‌అలర్ట్ జారీ చేసింది. విద్యాసంస్థలకు సైతం సెలవులు ప్రకటించారు.

జమ్మూకశ్మీర్‌లో కుండపోత

జమ్మూకశ్మీర్‌లోని కిశ్త్‌వాడ్‌లో శనివారం తెల్లవారుజామున మేఘవిస్ఫోటం సంభవించింది. ఆకస్మిక వరదలకు కొండ చరియలు విరిగిపడటంతో అనేక ప్రాంతాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. కిశ్త్‌వాడ్, డోడా, రాంబన్ జిల్లాల్లో నదులు పొంగుతుండటంతో వాహనాలు కొట్టుకుపోయాయి. ఈ మూడు జిల్లాల్లోని పాఠశాలలను మూసివేశారు.



# నవ్యపథంలో రైల్వే... హైడ్రోజన్‌తో లాభాలెన్నో!

భవిష్యత్ ఇంధనంగా హైడ్రోజన్ ఆశలు రేకెత్తిస్తోంది. ఇది కేవలం ఒక ప్రత్యామ్నాయం కాదు, ప్రపంచ ఇంధన వ్యవస్థను సమూలంగా మార్చగల శక్తిమంతమైన వనరు. ముఖ్యంగా హైడ్రోజన్ ఫ్యూయల్‌సెల్ సాంకేతికతతో నడిచే రైళ్లతో కాలుష్యాన్ని తగ్గించవచ్చు. ఈ రంగంలో పలు దేశాలు గణనీయమైన పురోగతి సాధిస్తున్నాయి. భారత్ కూడా ఆ స్ఫూర్తిని అందుకుంది. తాజాగా ప్రధాని మోదీ చేతుల మీదుగా దేశంలో తొలి హైడ్రోజన్ ఫ్యూయల్‌సెల్ రైలు ప్రారంభమవడం కీలక ముందడుగు. పర్యావరణహితమైన హరిత రవాణా వ్యవస్థకు ఇది నాంది పలుకుతుంది.

విశ్వంలో అత్యధికంగా లభించే మూలకం హైడ్రోజన్. కానీ, అది భూమిపై స్వచ్ఛ రూపంలో లభించదు. నీరు, సహజవాయువు, బయోమాస్ లేదా బొగ్గు వంటి వనరుల నుంచి ప్రత్యేక సాంకేతిక పద్ధతుల ద్వారా ఉత్పత్తి చేయాల్సిందే. హైడ్రోజన్‌ను ఇంధనంగా వాడినప్పుడు కార్బన్ డయాక్సైడ్ విడుదల కాకుండా కేవలం నీరు మాత్రమే ఉపఉత్పత్తిగా ఏర్పడుతుంది. అందువల్ల దీన్ని భవిష్యత్తు స్వచ్ఛ ఇంధనంగా ప్రపంచ దేశాలు గుర్తించాయి. హైడ్రోజన్ ఒక ఎనర్జీ క్యారియర్. అంటే ఇది ఇతర వనరుల నుంచి ఉత్పత్తి చేసే శక్తిని నిల్వ చేసి అవసరమైన చోట వినియోగించే మాధ్యమంగా పనిచేస్తుంది. ఒక కిలోగ్రాము హైడ్రోజన్‌లో సుమారు 120 మెగాజౌల్స్(ఎంజే/కేజీ) శక్తి ఉంటుంది. పెట్రోల్‌తో పోలిస్తే ఇది దాదాపు మూడు రెట్లు అధికం. దీన్ని ఎక్కువకాలం నిల్వ చేయడం, అవసరమైనప్పుడు విద్యుత్తుగా మార్చుకోవడమూ సాధ్యమే. అందువల్ల సౌర, పవన విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధనాల నిల్వకు కూడా హైడ్రోజన్ ఉత్తమ ప్రత్యామ్నాయంగా మారుతోంది.

వేగంగా పెరుగుతున్న వినియోగం

హైడ్రోజన్ ఉత్పత్తి రకరకాల పద్ధతుల ద్వారా జరుగుతుంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా ఉపయోగిస్తున్న విధానం స్టీమ్ మీథేన్ రిఫార్మింగ్(ఎస్ఎంఆర్). ఇందులో సహజవాయువు, నీటి ఆవిరిని అధిక ఉష్ణోగ్రత దగ్గర రసాయనిక చర్యకు గురిచేసి హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేస్తారు. ఈ పద్ధతి తక్కువ ఖర్చుతో కూడుకున్నా, అధిక పరిమాణంలో కార్బన్ డయాక్సైడ్ విడుదల అవుతుంది. అందువల్ల దీన్ని 'గ్రే హైడ్రోజన్' అంటారు. దీనికి మెరుగైన రూపం 'బ్లూ హైడ్రోజన్'. ఇందులో ఎస్ఎంఆర్ ద్వారా ఉత్పత్తయ్యే కార్బన్ డయాక్సైడ్‌ను కార్బన్ క్యాప్చర్, యుటిలైజేషన్ స్టోరేజ్ సాంకేతికతల ద్వారా సేకరించి భూగర్భంలో నిల్వ చేయవచ్చు. లేదా పారిశ్రామిక అవసరాలకు వినియోగించ వచ్చు. దీనివల్ల కార్బన్ ఉద్గారాలు గణనీయంగా తగ్గుతాయి. అయితే, ఇది కూడా శిలాజ ఇంధనాలపైనే ఆధారపడి ఉంటుంది. భవిష్యత్తులో అత్యంత కీలకం కానున్న సాంకేతికత 'గ్రీన్ హైడ్రోజన్'. ఇందులో పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా ఉత్పత్తి చేసిన విద్యుత్తుతో నీటిని విద్యుద్విశ్లేషణ (ఎలక్ట్రాలిసిస్) చేసి హైడ్రోజన్, ఆక్సిజన్‌గా విడగొడతారు. ఈ ప్రక్రియలో గ్రీన్‌హౌస్ వాయువులు విడుదల కావు. ప్రస్తుతం దీని ఉత్పత్తి వ్యయం కొంత ఎక్కువగా ఉన్నప్పటికీ, పునరుత్పాదక విద్యుత్ ఖర్చు తగ్గుతున్న కొద్దీ ప్రపంచ ఇంధన రంగంలో గ్రీన్ హైడ్రోజన్ ప్రధాన స్థానాన్ని ఆక్రమించనుంది. ఇవికాకుండా బయోమాస్, బొగ్గు గ్యాసిఫికేషన్, మీథేన్ పైరోలిసిస్, సూక్ష్మజీవుల ఆధారిత జీవసాంకేతిక పద్ధతుల్లోనూ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. వ్యవసాయ వ్యర్థాలు, అటవీ అవశేషాలు వంటి జీవ పదార్థాల ద్వారా తయారుచేసే హైడ్రోజన్ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను కూడా పెంచుతుంది.

హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేసిన తర్వాత భద్రంగా నిల్వ చేయడం పెద్ద సవాలు. వివిధ పద్ధతుల్లో నిల్వచేసి, పైప్‌లైన్లు, ప్రత్యేక ట్యాంకర్లు, అధిక పీడన వాహనాల ద్వారా రవాణా చేయాల్సి ఉంటుంది. నిల్వ, రవాణా వ్యయాలను తగ్గించడానికి ప్రపంచవ్యాప్తంగా విస్తృత పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఉక్కు, ఎరువుల తయారీ, పెట్రోలియం శుద్ధి, రసాయన పరిశ్రమలు, విద్యుత్ ఉత్పత్తి, నౌకాయానం, విమానయానం, బ్యాకప్ విద్యుత్ వ్యవస్థల వంటి అనేక రంగాల్లో హైడ్రోజన్ వినియోగం వేగంగా పెరుగుతోంది. ముఖ్యంగా ఫ్యూయల్ సెల్ వాహనాలు, బస్సులు, ట్రక్కులు, రైళ్లు, నౌకలు భవిష్యత్తులో డీజిల్ వాహనాలకు ప్రత్యామ్నాయాలు కానున్నాయి.

భారత్‌కు ప్రపంచస్థాయి గుర్తింపు

హైడ్రోజన్ రంగంలో ఇండియా కూడా ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందుతోంది. జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ ఇందుకు సాయపడుతోంది. దేశాన్ని గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, తయారీ, ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం భారీగా పెట్టుబడులు పెడుతోంది. దేశంలో విస్తారంగా లభించే సౌర, పవన వనరులు గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి అనుకూలంగా ఉన్నాయి. కల్పాక్కంలోని ఇందిరాగాంధీ అణు పరిశోధన కేంద్రం ప్రపంచంలోనే తొలిసారిగా కాపర్-క్లోరిన్ థర్మోకెమికల్ హైడ్రోజన్ ఉత్పత్తి కేంద్రాన్ని విజయవంతంగా ప్రారంభించింది. ఇందులో విద్యుత్తుతో పాటు ఫాస్ట్ బ్రీడర్ టెస్ట్ రియాక్టర్ నుంచి లభించే అధిక ఉష్ణశక్తిని ఉపయోగించి నీటిని హైడ్రోజన్, ఆక్సిజన్‌గా విడగొడతారు. దీనివల్ల సాధారణ ఎలక్ట్రాలిసిస్‌తో పోలిస్తే విద్యుత్ వినియోగం తగ్గి ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుంది. అనేక దేశాలు ఇంకా ప్రయోగశాల లేదా పైలట్ దశలోనే ఉండగా- అణు రియాక్టర్ ఉష్ణశక్తిని ప్రత్యక్షంగా వినియోగించి సమగ్ర హైడ్రోజన్ ఉత్పత్తి వ్యవస్థను విజయవంతంగా ప్రదర్శించిన దేశంగా ఇండియా నిలిచింది. ఇది భారతదేశాన్ని అణుశక్తి ఆధారిత హైడ్రోజన్ ఉత్పత్తిలో అగ్రగామిగా నిలబెట్టింది. జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్, భారతీయ రైల్వేల హైడ్రోజన్ ప్రాజెక్టు, కాపర్-క్లోరిన్ థర్మోకెమికల్ హైడ్రోజన్ ఉత్పత్తి సాంకేతికతలు ప్రపంచ స్వచ్ఛ ఇంధన రంగంలో ఇండియాను నాయకత్వ స్థాయికి చేర్చే కీలక మైలురాళ్లుగా నిలుస్తాయి. రాబోయే దశాబ్దాల్లో హైడ్రోజన్ ఆధారిత సాంకేతికతలు ఇంధన భద్రత, పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భారతదేశాన్ని ప్రపంచానికి ఆదర్శంగా నిలుపుతాయి.



# అంతరిక్ష ప్రస్థానంలో నవశకం

భారత అంతరిక్ష ప్రస్థానంలో మొన్న కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. ఇప్పటిదాకా దేశీయంగా అంతరిక్ష ప్రయోగాలన్నీ ఇస్రోనే చేపడుతోంది. హైదరాబాద్‌కు చెందిన ప్రైవేట్ సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 'విక్రమ్-1' రాకెట్‌ను రోదసిలోకి పంపి నవ చరిత్రకు నాంది పలికింది. తద్వారా అమెరికా, చైనాల తరవాత ప్రైవేట్ రంగంలో ఇలాంటి ఘనత సాధించిన మూడో దేశంగా ఇండియాను నిలబెట్టింది. 'ఇస్రో' మాజీ శాస్త్రవేత్తలైన పవన్, నాగభరత్‌లు ఎనిమిదేళ్ల కిందట స్థాపించిన స్కైరూట్- 2022లో 'విక్రమ్-ఎస్' పేరిట సబ్‌ఆర్బిటాల్ ప్రయోగంతో తొలి అడుగు వేసింది. ఇప్పుడు ఉపగ్రహాల చేరవేతను పక్కాగా పూర్తిచేసి అందరితో శభాష్ అనిపించుకుంది. బరువు తక్కువగా, బలంగా ఉండేలా కార్బన్ ఫైబర్‌తో నిర్మించడం, ఇంజిన్ భాగాలను త్రీడీలో రూపొందించడం విక్రమ్-1 ప్రత్యేకతలు. దానివల్ల తయారీ సమయం తగ్గడమే కాదు, ఖర్చు కూడా కలిసివచ్చింది. రెండేళ్ల క్రితం చెన్నైకి చెందిన అగ్నికుల్ కాస్మోస్ **కంపెనీ సైతం 3డీ ప్రింట్ ఇంజిన్‌తో తయారైన 'అగ్నిబాణ్' రాకెట్‌ను జయప్రదంగా పరీక్షించింది. ఇలాంటి స్టార్టప్‌ల విజయాలు- అంతరిక్ష రంగ లక్ష్యాల సాధనలో భారతావనికి ఆశాదీపాలుగా నిలుస్తున్నాయి!**

అంతర్జాతీయ అంతరిక్ష విపణిలో ఇండియా వాటా రెండు శాతమే. రాబోయే దశాబ్దకాలంలో దాన్ని పది శాతానికి పెంచాలని కేంద్రం సంకల్పించింది. అలాగే, భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ పరిమాణాన్ని ప్రస్తుతంతో పోలిస్తే 2033 నాటికి అయిదున్నర రెట్లకు ఇనుమడింపజేయాలని నిశ్చయించింది. దేశాన్ని ఆ గమ్యానికి చేర్చడం ఇస్రో ఒక్కదానివల్లే సాధ్యం కాదు. పైగా చిన్న ఉపగ్రహాల ప్రయోగాలకు ప్రపంచవ్యాప్తంగా గిరాకీ పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకోవడంతో పాటు ఇస్రోపై భారం తగ్గిస్తూ, నూతన ఆవిష్కరణలకు ఊతమివ్వడానికి అంతరిక్ష రంగంలో ప్రైవేటు భాగస్వామ్యం పెంపునకు కేంద్రం నిర్ణయించింది. అందుకే ఇన్‌స్పేస్ అనే స్వతంత్ర సంస్థను ఏర్పాటు చేసింది. దీనివల్ల గగన్‌యాన్, చంద్రయాన్ వంటి ప్రతిష్ఠాత్మక మిషన్లు, పరిశోధనలపై ఇస్రో దృష్టిసారిస్తుంటే రాకెట్లు, ఉపగ్రహాల తయారీ, కొత్త సాంకేతికతల అభివృద్ధిలో ప్రైవేటు కంపెనీలు ప్రధాన భూమిక పోషించేందుకు మార్గం ఏర్పడింది. ఇదంతా బాగానే ఉన్నా, ప్రైవేట్‌లో వాణిజ్య ప్రయోగాల పరంగా మన ప్రయాణం ఇంకా ఊపందుకోవాల్సి ఉంది!

ఇప్పుడు మన దేశంలో నాలుగొందలకు పైగా అంతరిక్ష స్టార్టప్‌లు ఉన్నాయి. ఆ రంగంలో ఎఫ్‌డీఐ నిబంధనలను సడలించడంతో ఆయా సంస్థలు గట్టిగా నిలదొక్కుకోగలుగుతున్నాయి. తద్వారా సమర్థులైన ఇంజినీర్లు, శాస్త్రవేత్తలకు ఉపాధి అవకాశాలూ విరివిగా అందివస్తున్నాయి. అయితే, ఒకటి రెండు ప్రైవేట్ సంస్థలే సొంతంగా రాకెట్లను తయారుచేసి, నింగికి తరలించే స్థాయికి ఎదిగాయి. అలాంటి వాటి సంఖ్యను పెంచడానికి ప్రభుత్వం కంకణబద్ధం కావాలి. స్పేస్‌ఎక్స్ తరహాలో పునర్వినియోగ రాకెట్ల వైపు మళ్లడంతో పాటు చిన్న ఉపగ్రహ ప్రయోగాల్లో మన సంస్థలు ప్రపంచ నాయకత్వాన్ని అందుకునేలా ప్రోత్సహించాలి. దీర్ఘకాలిక ఆర్డర్లతో స్టార్టప్‌లకు స్థిరమైన మార్కెట్ కల్పించాలి. అదే సమయంలో వాటివల్ల జాతీయ ప్రయోజనాలకు విఘాతం వాటిల్లకుండా జాగరూకతతో మెలగాలి. ఇటీవలి కాలంలో సీనియర్ శాస్త్రవేత్తల మూకుమ్మడి రాజీనామాలతో ఇస్రో ప్రధాన ప్రాజెక్టుల భవితవ్యం సందిగ్ధంలో పడుతోందన్న కథనాలు కలవరపరుస్తున్నాయి. ఆ ప్రమాదాన్ని నివారించేందుకు జీతభత్యాలు, ఇతర సదుపాయాల పరంగా 'ఇస్రో' సైంటిస్టుల ప్రతిభా సామర్థ్యాలకు తగిన ప్రతిఫలాలను అందజేయాలి!

# పరస్పర విమర్శల కుండపోత ఖాయం!



ప్రస్తుతం దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు అలుముకున్నా- నేటి నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాల్లో మాత్రం అధికార, ప్రతిపక్షాల మధ్య ఆరోపణల కుంభవృష్టి కురిసే అవకాశం కనిపిస్తోంది. పశ్చిమబెంగాల్‌లో తొలిసారి అధికారం చేపట్టడంతోపాటు తృణమూల్ కాంగ్రెస్‌ను బలహీనపరచడం ద్వారా పార్లమెంట్‌లో ప్రతిపక్ష కూటమిని దెబ్బకొట్టాలని భాజపా నాయకత్వం ప్రయత్నిస్తోంది. ప్రభుత్వ వైఫల్యాలుగా తాము భావిస్తున్న వాటిని ఆయుధాలుగా మార్చుకుని కేంద్రాన్ని ఇరుకునపెట్టాలని విపక్షం వ్యూహరచన చేస్తోంది. రామజన్మభూమిలో విరాళాల చోరీ, నీట్ పేపర్ లీక్, చమురు సంక్షోభం, ఆర్‌బీఐ నిర్దేశించిన పరిమితులను దాటిన ద్రవ్యోల్బణం, పెరుగుతున్న నిత్యావసరాల ధరలు, 'సర్' వంటి అంశాలను ప్రస్తావిస్తూ పార్లమెంట్‌లో అధికారపక్షానికి ఊపిరి ఆడకుండా చేయాలని ఇండియా కూటమి భావిస్తోంది. నీట్ ప్రశ్నపత్రం లీక్‌కు బాధ్యత వహిస్తూ విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న వాదన ఇప్పటికీ గట్టిగా వినపడుతోంది. ఇదే డిమాండ్‌తో ఆమరణ దీక్ష చేస్తున్న లద్దాఖ్ నాయకుడు సోనంవాంగ్‌చుక్‌ను దిల్లీ పోలీసులు శనివారం ఆసుపత్రికి తరలించారు. 'నీట్'పై దేశవ్యాప్తంగా నిరసనలు రేగడం, దిల్లీలోని జంతర్‌మంతర్‌లో కాక్రోచ్ జనతాపార్టీ చేపట్టిన ఆందోళన కార్యక్రమం విజయవంతం కావడాన్ని కేంద్రం పట్ల పెరుగుతున్న ప్రజా వ్యతిరేకతగా ప్రతిపక్షాలు భావిస్తున్నాయి. అందుకే పార్లమెంట్ వేదికగా విమర్శల దాడి **చేయడానికి అవి సమాయత్తమవుతున్నాయి.**

రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలాంటి చోట్ల వెలుగుచూస్తున్న అవినీతి, పరిపాలనా వైఫల్యాలు, అణచివేతలను జాతీయస్థాయిలో ఎండగట్టి భాజపా దూకుడును అడ్డుకోవాలని కాంగ్రెస్ వ్యూహాలు పన్నుతోంది. ఇందుకోసం ఈనెల 16న ఆ పార్టీ సీనియర్ నాయకులంతా కలిసి ఓ దఫా మేధోమథనం కూడా చేశారు. తృణమూల్ కాంగ్రెస్, శివసేన(యూబీటీ) ఎంపీలను చీల్చి వారిని అధికార కూటమిలోనో, ఇంకో పార్టీలోనో చేరేలా చేసి రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌కు తూట్లుపొడుస్తున్నారని ప్రతిపక్షాలు గగ్గోలుపెడుతున్నాయి. అదే ఆందోళనను అవి పార్లమెంట్ లోపలికి కూడా తీసుకెళ్లి సభా కార్యకలాపాలను స్తంభింపజేసే అవకాశం ఉంది.

మారిపోయిన బలాబలాలు

ప్రభుత్వ అజెండాలో పాత పెండింగ్ బిల్లులు యథాతథంగా ఉన్నాయి. కొత్తగా అయిదు బిల్లులు వచ్చి చేరాయి. అందులో వరసగా 30 రోజులపాటు జైలు కెళ్లిన ప్రధాని, ముఖ్యమంత్రులు, మంత్రుల ఉద్వాసనకు సంబంధించిన 130వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, జమిలి ఎన్నికలు, ఉన్నత విద్యారంగ సంస్కరణలకు ఉద్దేశించిన బిల్లులు బాగా వివాదాస్పదమయ్యాయి. వీటిలో ముఖ్యంగా నియోజకవర్గాల పునర్విభజన బిల్లును ఎలాగైనా పాస్ చేయించుకోవాలని అధికారపక్షం ప్రయత్నిస్తోంది. అందుకే 130వ రాజ్యాంగ సవరణ బిల్లును కాస్త వెనక్కు నెట్టడానికి సిద్ధమైంది. ఆ బిల్లుపై అధ్యయనం చేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ తుది నివేదికను సిద్ధంచేసినా కమిటీ సభ్యుల్లో ఏకాభిప్రాయం రాలేదంటూ నివేదిక సమర్పణ తేదీని వాయిదా వేసింది. కాబట్టి ఆ బిల్లు ఈ సమావేశాల్లో పార్లమెంట్‌కు వచ్చే అవకాశం లేదు. దానికంటే ముందుగా డీలిమిటేషన్ బిల్లుకు సభామోదం పొందాలన్న వ్యూహాత్మక ఎత్తుగడతోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందంటున్నారు. అయితే, కాంగ్రెస్‌తోపాటు కొన్ని ఇండియా కూటమి పార్టీలు మాత్రం ఈ బిల్లును ఎట్టిపరిస్థితుల్లోనూ అడ్డుకోవాలనుకుంటున్నాయి. లోక్‌సభ సీట్ల పెంపునకు సంబంధించిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు మూడింట రెండొంతుల మంది సభ్యుల మద్దతు కూడగట్టుకోలేక మొన్న ఏప్రిల్ 17న లోక్‌సభలో వీగిపోయింది. దాన్ని పరాభవంగా భావించిన అధికారపక్షం విపక్షాలను బలహీనపరిచి ఈసారి ఆ బిల్లును తప్పక గట్టెక్కించాలనే ఉద్దేశంతో ప్రయత్నాలు మొదలుపెట్టింది. పశ్చిమబెంగాల్‌లో మమతాబెనర్జీ ఓటమిని అందుకు అవకాశంగా మలుచుకుంది. ఆ క్రమంలోనే 'ఇండియా' కూటమిలో సంఖ్యాపరంగా కాంగ్రెస్ తర్వాత బలంగా ఉన్న తృణమూల్ కాంగ్రెస్ చీలిపోయింది. దాంతో లోక్‌సభలో బలాబలాలు మారిపోయాయి. ఉద్ధవ్‌ఠాక్రే శివసేన ఎంపీల్లో మెజార్టీ సభ్యులూ గోడదూకడంతో ఇండియా కూటమి ఇప్పుడు సొంతింటిపైనే బెంగపెట్టుకోవాల్సి వస్తోంది.

డీలిమిటేషన్ బిల్లుకు ప్రతిపక్ష పార్టీలు పద్దతు పలికేలా అధికారపక్షం తెరవెనుక మంత్రాంగాన్నీ నడుపుతోంది. దాని ఫలితంగానే విపక్షాల స్వరంలో మార్పు కనిపిస్తోంది. 50శాతం సీట్లు పెంచుతామని బిల్లులో నిబంధన పెడితే మద్దతు ఇవ్వడానికి తమకు అభ్యంతరం లేదని శరద్‌పవార్ పార్టీ ప్రకటించడమే ఇందుకు ఉదాహరణ. దక్షిణభారతంలో పెద్ద పార్టీ అయిన డీఎంకే కూడా ఈ విషయంలో తన ధోరణిని మార్చుకునేలా కనిపిస్తోంది. తమిళనాడులో టీవీకే సర్కారుకు కాంగ్రెస్ వెన్నుదన్నుగా ఉండటాన్ని జీర్ణించుకోలేని డీఎంకే ఇండియా కూటమి నుంచి బయటికొచ్చి పార్లమెంట్‌లో ప్రత్యేక సీట్ల కోసం స్పీకర్‌కు లేఖరాసింది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ కూడా ఎన్డీయేకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మద్దతునిస్తుందన్న భావన సర్వత్రా వ్యక్తమవుతోంది.

ప్రజలకోసం పనిచేస్తారా?

ఇటీవలి కాలంలో పార్లమెంట్ సమావేశాలు విమర్శలూ ప్రతివిమర్శలకే ఎక్కువగా వేదికలవుతున్నాయి. దానివల్ల సభా కార్యకలాపాలు స్తంభించిపోవడం, సభ్యుల సస్పెన్షన్లు సర్వసాధారణమవుతున్నాయి. ఈసారి కూడా అధికార, ప్రతిపక్షాలు ఒకరిపైఒకరు పైచేయి సాధించడానికే ఈ సమావేశాలను ఉపయోగించుకుంటాయా... ప్రజాప్రయోజనాలకోసం శాసన వ్యవహారాలకు ప్రాధాన్యమిస్తాయా అన్నది చూడాలి. గత సమావేశాల్లో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలను సస్పెండ్ చేశారు. 2023 శీతకాల సమావేశాల్లోనూ లోక్‌సభ, రాజ్యసభల్లో కలిపి మొత్తం 141 మంది ఎంపీలను సస్పెండ్ చేయడం దుమారం రేపింది. వీటిని ఆసరాగా చేసుకుని లోక్‌సభ స్పీకర్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు గత సమావేశాల్లో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాయి. 2024 డిసెంబర్‌లోనూ అప్పటి రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌కు వ్యతిరేకంగా విపక్షాలు అవిశ్వాస నోటీసు ఇచ్చాయి. నెగ్గవని తెలిసినా సభాధ్యక్ష స్థానంలో ఉన్నవారు పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని చాటిచెప్పడానికి ప్రతిపక్షాలు ఈ తీర్మానాలను ప్రవేశపెట్టి, వాటిపై జరిగే చర్చల్లో తమ ఆగ్రహాన్ని ప్రకటిస్తున్నాయి. ప్రజాప్రయోజనాలకంటే వ్యక్తిగత ప్రతిష్ఠలకు పోతున్న సందర్భాలు పెరుగుతుండటంవల్ల సభల్లో సంఘర్షణ వాతావరణం దట్టమవుతోంది. అలాంటి పరిస్థితులు తలెత్తకుండా అన్ని పార్టీలూ పరిమితులు ఎరిగి నడుచుకుంటేనే ప్రజాప్రయోజనాలు నెరవేరతాయి. లేదంటే యథామామూలుగా అవి మరుగునపడిపోతాయి!

# హిమాలయాల్లో ముసలం!




జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్, రాజౌరీ జిల్లాల్లో కుండపోత వానలు, భీకర వరదలు, విరిగిపడిన కొండచరియలు జనజీవితాన్ని అస్తవ్యస్తం చేశాయి. కొద్దిరోజుల కిందట డోడా, కిష్త్వార్ జిల్లాలనూ అవి వణికించాయి. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ వంటిచోట్లా ఇటీవలి కాలంలో ఇలాంటి ఉత్పాతాలు తరచూ సంభవిస్తున్నాయి. వీటిని సాధారణ విపత్తులుగా పరిగణించడానికి వీల్లేదు. నిజానికి హిమాలయ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడం మామూలే. కానీ, గత కొంతకాలంగా వాటి తీవ్రత అధికమవుతోంది. వాతావరణ మార్పులకు మితిమీరిన మానవ కార్యకలాపాలు తోడవడంవల్లే ప్రకృతి ఉత్పాతాల దుష్ఫలితాలు పెరుగుతున్నాయి. ప్రపంచ సగటుతో పోలిస్తే- హిందూకుష్ హిమాలయ ప్రాంత ఉష్ణోగ్రతలు 1950 తర్వాత రెండు డిగ్రీల సెల్సియస్ మేర ఎక్కువయ్యాయి. గడిచిన రెండు దశాబ్దాల్లో జమ్మూకశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లో వేడిమి ఒక డిగ్రీ మేర పెచ్చుమీరింది. దానివల్ల కుంభవృష్టులు, **ఆకస్మిక వరదల ప్రమాదం తీవ్రతరమవుతోంది. వాటి ధాటికి పర్వతాలు విరిగిపడి విధ్వంసం సృష్టిస్తున్నాయి. ఉష్ణప్రకోపంతో కార్చిచ్చులూ పరిపాటిగా మారుతున్నాయి. విచ్చలవిడి తవ్వకాలు, నిర్మాణాల వల్లా హిమవన్నగాల్లో ముసలం పుట్టి ఎంతోమంది జీవితాలు అష్టకష్టాల పాలవుతున్నాయి!**

పదకొండు రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లో విస్తరించిన హిమాలయాలు జీవనదులకు పుట్టిళ్లుగా, భారతదేశానికి సహజ రక్షాకవచాలుగా నిలుస్తున్నాయి. నవీన పర్వతాలైన వీటిలో భూకంప కదలికలు ఇంకా కొనసాగుతున్నాయి. నేల పొరలు బలహీనంగా ఉన్నాయి. ఆ అస్థిరతను పట్టించుకోకుండా అభివృద్ధి పేరిట అసలే వదులుగా ఉన్న కొండవాలులను ఇష్టారీతిగా తవ్వేసి రహదారులు, సొరంగాలు, హైడ్రో ప్రాజెక్టులు నిర్మిస్తున్నారు. పర్యాటక వసతుల కోసం వరద మైదానాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. దానివల్ల భారత భూభాగంలోని హిమాలయాల్లో చెట్ల విస్తీర్ణం రెండేళ్లలోనే 2.27శాతం తగ్గింది. తత్ఫలితంగా వర్షాలు పడినప్పుడు వరదలు పోటెత్తి, కొండచరియలు విరిగిపడి విపరీతమైన ప్రాణ, ఆస్తి నష్టాన్ని కలిగిస్తున్నాయి. నిరుడు జమ్మూకశ్మీర్‌లోనే అవి దాదాపు రెండొందల మందిని బలిగొన్నాయి. ఎనిమిది వేలకుపైగా ఇళ్లను నాశనం చేయడంతో పాటు దాదాపు 78వేల ఎకరాల్లో పంటల్ని నష్టపరిచాయి. 202023 మధ్య ఉత్తరాఖండ్‌లో 213 మంది ఉసురుతీశాయి. ఈ విలయాలు నానాటికీ ఎక్కువవుతున్న పరిస్థితుల్లో ప్రభుత్వాలు ఇప్పటికైనా మేలుకోవాలి!

భూతాపానికి తోడు వాహనాలూ పరిశ్రమల కాలుష్యం, పంట అవశేషాల దహనం వంటివాటి వల్ల హిమాలయాలపై నల్లటి బూడిద పేరుకుపోయి సూర్యకాంతికి మంచు త్వరగా నీరవుతోంది. ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల మంచు కురవడం తగ్గిపోతోంది. దానివల్ల హిమానీనదాలు వేగంగా కరిగి ఊహించని వరదల ముప్పు ముంచుకొస్తోంది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఈ శతాబ్దం చివరి నాటికి హిందూకుష్ హిమాలయ ప్రాంతంలో ప్రస్తుతమున్న హిమానీనద పరిమాణంలో 80శాతం మేర కనుమరుగవుతుందని అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. అదే జరిగితే, గంగాసింధు మైదానంలో సాగు, తాగు నీటి ఎద్దడి ముమ్మరిస్తుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 70కోట్ల మందిపై ప్రభావం పడుతుంది. ఇంతటి పెను నష్టాన్ని నివారించాలంటే హిమాలయాల్లో పర్యావరణ విధ్వంసాన్ని ఆపి తీరాలి. వాటి సంరక్షణకు సంబంధించి మహేశ్ కమిటీ, చోప్రా సంఘం వంటివి చేసిన విలువైన సూచనలను అమలులోకి తేవాలి. ముఖ్యంగా సుప్రీంకోర్టు సూచించినట్లు ప్రగతి పనులుపర్యావరణ పరిరక్షణ మధ్య ప్రభుత్వాలు సమతౌల్యం పాటించాలి!



అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
సోమవారం ⁞ అనంతపురం ⁞ 03.08.2026 ⁞ 01

# రౌడీషీటర్లు చట్ట పరిధిలో జీవించాలి...!

- హద్దులు మీరితే కఠిన చర్యలు తప్పవు.
- వన్ టౌన్ సీఐ రెడ్డప్ప.

ధర్మవరం ఆగస్టు 2, అనంత జనశక్తి న్యూస్:

వన్ టౌన్ పరిధిలో రౌడీషీటర్లు హద్దులు మీరితే కఠిన చర్యలు తప్పవు అని వన్టౌన్ సీఐ రెడ్డప్ప హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కార్యాలయంలో 11 మంది రౌడీ షీటర్లకు గట్టిగా హెచ్చరికలు జారీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.... ఎక్కడైనా నేరాలలో రౌడీషీటర్లు పాల్గొంటే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. తదుపరి పీడీ యాక్ట్, ఎక్స్టర్మెంట్, గొడవలు సృష్టించే మరిన్ని కేసులు నమోదు చేస్తామని, అల్లర్లకు పాల్పడకుండా, కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకొని చట్టపరంగా జీవించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



# యువత వ్యాపారవేత్తలుగా ఎదగడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

- మంత్రి కందుల దుర్గేష్
- రాజమహేంద్రవరంలో వైభవంగా 'గ్లోబల్ బిజినెస్ మీట్ – సమాఖ్య 2026' సన్నాహక సమావేశం.. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్
- అక్టోబర్ 13 నుండి 15 తేదీల్లో హైదరాబాద్ లో నిర్వహించనున్న గ్లోబల్ బిజినెస్ మీట్ పోస్టర్ ఆవిష్కరణ.. వ్యాపార, పర్యాటక రంగాలకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ
- ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ సాంకేతికతను యువత ఒడిసిపట్టుకోవాలని పిలుపు.. ఉద్యోగాలతో పాటు నలుగురికి ఉపాధినిచ్చే వ్యాపారాల వైపు యువత అడుగులు వేయాలి అని సూచన



రాజమహేంద్రవరం ఆగస్టు 02, అనంత జనశక్తి న్యూస్

రాష్ట్రంలో వ్యాపార అభివృద్ధికి, ఆర్థిక ప్రగతికి అత్యంత అనుకూల వాతావరణం ఉందని, నూతనంగా వ్యాపార రంగంలోకి వచ్చే యువతను, పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని మనీష్ ఫంక్షన్ హాల్ లో 'సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్' ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్లోబల్ బిజినెస్ మీట్ – సమాఖ్య 2026'సన్నాహక సమావేశానికి మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేదంలా ఘోషించే గోదావరి తీరాన జరిగిన ఈ కార్యక్రమంలో.. రాబోయే అక్టోబర్ 13 నుండి 15 వరకు హైదరాబాద్ లో నిర్వహించనున్న 'గ్లోబల్ బిజినెస్ మీట్ ' కు సంబంధించిన పోస్టర్‌ను మంత్రి దుర్గేష్ ఇతర అతిథులతో కలిసి ఆవిష్కరించారు. 'గ్లోబల్ బిజినెస్ మీట్ 2026' పారిశ్రామిక చిత్రాన్ని మార్చబోతోందని, ఈ అవకాశాన్ని స్థానిక యువత, వ్యాపారవేత్తలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు..యువత వ్యాపారవేత్తలుగా ఆర్థికంగా పరిపుష్ఠి సాధించినప్పుడే భవిష్యత్తులో రాజకీయ నాయకత్వం వహించే స్థాయికి ఎదుగుతారని మంత్రి దుర్గేష్ అన్నారు. యువత కేవలం ఉద్యోగాలకే పరిమితం కాకుండా నలుగురికి ఉపాధి కల్పించే ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ వైపు దృష్టి సారించాలని సూచించారు. పదుల సంఖ్యలో యువతను ప్రోత్సహించేందుకు ముందుకొచ్చిన 'సమాఖ్య' ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రయత్నాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఇది ఒక సువర్ణ అవకాశం.. ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకోవాలన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... పర్యాటక రంగంలో కొత్తగా పెట్టుబడులు పెట్టే వారికి కూటమి ప్రభుత్వం నూతన పర్యాటక పాలసీ 202429 ద్వారా ఇప్పటికే పలు ఆర్థిక, వ్యాపార ప్రోత్సాహకాలను అందిస్తోందని స్పష్టం చేశారు. మంచి నెట్ వర్త్, బ్రాండ్ కంపెనీలతో టైఅప్ అయి వచ్చే రిసార్ట్స్, హోటల్స్ , అమ్యూజ్‌మెంట్ పార్క్స్, అడ్వెంచర్ టూరిజం ప్రాజెక్టులకు సంబంధించిన ఇన్వెస్టర్లకు పర్యాటక శాఖ తరపున పూర్తి అండగా ఉంటామని భరోసానిచ్చారు. పెట్టుబడిదారుల కోసం 'ల్యాండ్ అలాట్‌మెంట్ పాలసీ' ద్వారా భూములు కేటాయిస్తున్నామని, ఎక్కడెక్కడ ల్యాండ్ అందుబాటులో ఉందో ఆ వివరాలను పర్యాటక శాఖ వెబ్‌సైట్ లో పారదర్శకంగా అందుబాటులో ఉంచామని చెప్పారు.కేంద్ర ప్రభుత్వ సహకారంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ లు రాష్ట్రాన్ని వేగవంతంగా అభివృద్ధి చేయాలనే తలంపుతో ఉన్నారని తెలుపుతూ..ఎంఎస్ఎంఈ, స్టార్టప్‌లు, మెగా లేదా అల్ట్రా మెగా ప్రాజెక్టులు ఏదైనా సరే.. ఆలోచనను ఆచరణలో పెడితే విజయం సాధించవచ్చన్నారు. ఈ సందర్భంగా పర్యాటక రంగంలో మంత్రి దుర్గేష్ పెట్టుబడులు ఆహ్వానిస్తూ ముందుకు వచ్చేవారికి కూటమి ప్రభుత్వ పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి సాంకేతిక విప్లవాన్ని యువత వినియోగించుకోవాలని సూచించారు. టెక్నాలజీ అడ్వాన్స్‌మెంట్‌ను అందిపుచ్చుకోవడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముందంజలో ఉందని గుర్తుచేశారు."మన గోదావరి జిల్లాల యువత పారిశ్రామిక, సాంకేతిక రంగాలలోకి అడుగుపెట్టాలి. మీ ఆలోచనలకు ఊపిరిపోసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఏకాగ్రత, పట్టుదల, శ్రమించే తత్వం ఉన్న యువత, యువ పారిశ్రామికవేత్తలు నిరంతరం తమ ఆలోచనలను పంచుకోవడానికి సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, పర్యాటక మంత్రిగా నేను ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం" అని మంత్రి దుర్గేష్ భరోసానిచ్చారు.వ్యవసాయ, ఆక్వా, సెరి, హార్టికల్చర్ రంగాల్లో ఇప్పటికే మంచి వృద్ధి సాధించిన తూర్పుగోదావరి జిల్లాను పారిశ్రామికంగా మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని మంత్రి కందుల దుర్గేష్ అభిప్రాయపడ్డారు.

# నెల్లూరు సిటీలో పార్కుల జాతర..

- 39 లక్షలతో బంగ్లాతోట పార్క్, ఏసీ హాల్ ప్రారంభం
- ప్రోటోకాల్ పక్కనపెట్టి తోపుడు బండి వద్ద టిఫిన్ చేసిన మంత్రి నారాయణ
- వైసీపీ నేతలకు మంత్రి నారాయణ మాస్ కౌంటర్.. ఎన్ని కుతంత్రాలు చేసినా నెల్లూరు అభివృద్ధి ఆగదు
- దోమల రహిత నెల్లూరుగా మారుద్దాం..మంత్రి నారాయణ
- ఫ్రెండ్‌షిప్ డే వేడుకల్లో పిల్లలతో సరదాగా గడిపిన మంత్రి నారాయణ..
- 47 పార్కుల అభివృద్ధికి శ్రీకారం.. ఇప్పటికే 40 పార్కులు ప్రారంభించామన్న మంత్రి నారాయణ

నెల్లూరు ఆగస్ట్ 02, అనంత జనశక్తి న్యూస్

నెల్లూరు సిటీ నియోజకవర్గంలో పార్కుల జాతర ఘనంగా కొనసాగుతోంది..ఇందులో భాగంగా 39 లక్షలతో ఆధునీకరించిన బంగ్లాతోట పార్క్, ఏసీ కమ్యూనిటీ హాల్‌ను రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ప్రారంభించారు. ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా కేక్ కట్ చేసి, పిల్లలతో ఆడుకుంటూ సరదాగా గడిపిన మంత్రికి స్థానికులు, టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలకగా, ఆయన పర్యటనలో ప్రోటోకాల్ పక్కనపెట్టి ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకోవడమే కాకుండా, సామాన్యుడిలా తోపుడు బండి వద్ద ఆగి టిఫిన్ చేసి, టీ తాగారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత పాలకులు పార్కులను నిర్వీర్యం చేస్తే, తమ ప్రభుత్వంలో సిటీలో 47 పార్కుల అభివృద్ధికి శ్రీకారం చుట్టి ఇప్పటికే 40 పార్కులను ప్రారంభించామని, తక్కువ ఖర్చుతో పిల్లల పుట్టినరోజు వేడుకలు చేసుకునేందుకు ఏసీ కమ్యూనిటీ హాల్స్ ఉపయోగపడతాయని, అభివృద్ధిసంక్షేమానికి సమప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. వేగవంతం చేసిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులపై స్పందిస్తూ 1,000 లోపు ఆస్తిపన్ను కట్టేవారికి ఉచితంగా, 1,000 నుండి 2,000 లోపు ఉన్నవారికి 50% రాయితీతో డ్రైనేజీ కనెక్షన్లు ఇస్తామని, 2,000 మించితే పూర్తి నగదు చెల్లించాలని, ప్రతి ఒక్కరూ కనెక్షన్ తీసుకొని దోమలు లేని నగరంగా మార్చేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. ముంపు ముప్పు తప్పించేందుకు చేపట్టిన కాలువల ఆధునీకరణకు సహకరిస్తున్న ప్రజలకు ధన్యవాదాలు తెలిపిన మంత్రి, నగరాన్ని అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేని వైసీపీ నేతలు ఈర్ష్యతో అసత్య ఆరోపణలు చేస్తూ బురద చల్లుతున్నారని, వాళ్ళు ఎన్ని కుతంత్రాలు చేసినా అభివృద్ధి ఆగదని స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్,డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్,మాజీ జెడ్పీటీసీ విజేతా రెడ్డి,డివిజన్ నాయకులు కువ్వారపు బాలాజీ,పాకాల పెంచలయ్య,గోవర్ధన్,శ్రీధర్ రావు,బాబూరావు,సురేష్,నాగేశ్వరరావు,సుబ్రహ్మణ్యం,చంద్రమౌళి,స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# వర్షం కోసం ప్రత్యేక పూజలు

పుట్లూరు, ఆగష్టు, 02, అనంత జనశక్తి : న్యూస్:

ఈ ఏడాది సకాలంలో వర్షా లు కురువకపోవడంతో మండలంలోని గోపురాజు పల్లి గ్రామంలో ఆదివారం రైతులు, గ్రామస్తులు కాటమయ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
గ్రామ సమీపంలోని స్థానిక బస్సు సెంటర్ వద్ద ఉన్న కాటమయ్య స్వామి విగ్రహానికి జాలాబిశేఖం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంటలను సాగు చేసేందుకు వర్షా లు కురవక పోవడంతో వ్యవసాయ పొలాలు బీడులుగా ఉన్నాయని, ఊరు సుభిక్షంగా ఉండాలన్న ఉద్దేశంతో పూజలను నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు. అనంతరం సాంప్రదాయ బద్దంగా రెండు కప్పలకు పెళ్లి జరిపించి, వాటిని పల్లకిలో ఉంచి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రవికుమార్ రెడ్డి, వెంకట్రాంరెడ్డి, కృష్ణారెడ్డి, కులశేఖర్ రెడ్డి, తీర్థమయ్య, ప్రతాప్ రెడ్డి, రమాకాంత్ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి



- ఆగస్టు 03వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహణ
- సోమవారం ఉదయం 9:00 నుండి పిజిఆర్ఎస్ నిర్వహణ..
- రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాలలో "మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100" అనే బ్యానర్‌ను ఏర్పాటు చేయాలి
- జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..

అనంతపురం, ఆగస్టు 02 :అనంత జనశక్తి న్యూస్

మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాలలో "మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100" అనే బ్యానర్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

**ఆగస్టు 03వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహణ :**

ఆగస్టు 03వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9:00 నుండి నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. సోమవారం ఉదయం 9:00 నుండి పిజిఆర్ఎస్ గ్రీవెన్స్ డేను నిర్వహించడం జరుగుతుందన్నారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోమవారం ఉదయం 9:00 నుండి పూర్తి అయ్యే వరకు డివిజన్, మండల మరియు ఎస్.జి.ఎస్.డబ్ల్యూ స్థాయిలలో పి.జి.ఆర్.ఎస్. గ్రీవెన్స్ డేను నిర్వహించాలని ఆర్.డి.ఓలు, తహసీల్దార్లు మరియు పి.డి.ఓలకు సూచించడమైనది.

# జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య సేవలు అమూల్యం..

- మంత్రి కందుల దుర్గేష్
- త్రివర్ణ పతాక రూపకర్త శ్రీ పింగళి వెంకయ్య 150వ జయంతిని పురస్కరించుకుని రాజమహేంద్రవరం మంగళవారపు పేటలోని 'పీఎం శ్రీ ప్రభుత్వ హైస్కూల్'లో పూర్వ విద్యార్థుల సహకారంతో విగ్రహం ఏర్పాటు
- తను చదివిన బడిలోనే జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య విగ్రహావిష్కరణ చేసిన మంత్రి కందుల దుర్గేష్
- అదే పాఠశాల.. అవే జ్ఞాపకాలు.. విద్యార్థిగా చదివిన బడిలోనే పింగళి వెంకయ్య విగ్రహాన్ని ఆవిష్కరించడం గర్వంగా ఉందని నాటి పూర్వ విద్యార్థి, నేటి రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ భావోద్వేగం

## ఆయన ప్రాతఃస్మరణీయులు:

రాజమహేంద్రవరం
ఆగస్టు 02,అనంత జనశక్తి న్యూస్

ఎన్ని తరాలు మారినా దేశ ప్రజల గుండెల్లో నిలిచిపోయేలా.. జాతి ఆత్మగౌరవానికి చిహ్నంగా, భారతీయులంతా సగర్వంగా తలెత్తుకునేలా జాతీయ జెండాను రూపొందించి అందించిన చిరస్మరణీయుడు పింగళి వెంకయ్య అని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. త్రివర్ణ పతాక రూపకర్త శ్రీ పింగళి వెంకయ్య 150వ జయంతిని పురస్కరించుకుని రాజమహేంద్రవరం మంగళవారపు పేటలోని 'పీఎం శ్రీ ప్రభుత్వ హైస్కూల్' (నాటి గవర్నమెంట్ ట్రైనింగ్ కాలేజ్ / గవర్నమెంట్ మోడల్ బాయ్స్ హైస్కూల్) ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన పింగళి వెంకయ్య విగ్రహాన్ని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు.పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం సహకారంతో ఏర్పాటు చేసిన ఈ విగ్రహానికి మంత్రి దుర్గేష్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. "జోహార్ పింగళి వెంకయ్య" అంటూ నినదించి, ఆయన సేవలను స్మరించుకున్నారు.

**దేశ గౌరవానికి ప్రతీక మువ్వన్నెల జెండా:మంత్రి దుర్గేష్**

ఏ దేశానికైనా గుర్తింపు, గౌరవం ఆ దేశ నిటారుగా రెపరెపలాడే జాతీయ జెండానే అని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. ఎర్రకోట పైనైనా, దేశ సరిహద్దుల్లోనైనా భారత్ సాధించే విజయాలకు గుర్తింపుగా ఎగిరే మువ్వన్నెల జెండాను రూపొందించి దేశానికి అందించిన వ్యక్తి పింగళి వెంకయ్య మన తెలుగువాడు, ఆంధ్రాకు చెందిన వ్యక్తి కావడం మనందరికీ గర్వకారణమని చెప్పారు. మహాత్మా గాంధీ సూచన మేరకు పింగళి వెంకయ్య జెండాను రూపొందించారని.. విజయవాడ బాపూ మ్యూజియంలో గాంధీజీకి పింగళి వెంకయ్య జెండాను అందిస్తున్న అరుదైన చిత్రం అందుబాటులో ఉందన్నారు.విద్యార్థులు మన చరిత్రను, పింగళి వెంకయ్య దార్శనికతను అర్థం చేసుకోవడానికి తప్పనిసరిగా బాపూ మ్యూజియాన్ని సందర్శించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు.కేవలం స్వాతంత్ర్య సమరయోధుడిగానే కాక, స్వదేశీ వస్త్రాల వినియోగం, వ్యవసాయ రంగంలో ఆయన చూపిన చొరవ తరతరాలకు స్ఫూర్తిదాయకమని కీర్తించారు. పింగళి వెంకయ్య జయంతిని పురస్కరించుకుని పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు మంత్రి కందుల దుర్గేష్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల నుంచి వందనం స్వీకరించి, వారిని అభినందించారు. ప్రతి ఏటా పింగళి వెంకయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తూ ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్దామని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చింతపేట ప్రభాకర్, చక్కా త్రినాథ్, ఇన్నమూరి రాంబాబు, విటోవా మహరాజ్, రెడ్డి ఫణి నాగేశ్వరరావు, శ్యామ్ సింగ్, రవి కిషోర్, వై.జగన్నాథ్ రావులతో పాటు పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



**తను చదివిన బడిలోనే పింగళి వెంకయ్య విగ్రహావిష్కరణ – మంత్రి దుర్గేష్ భావోద్వేగం**

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. తాను విద్యనభ్యసించిన ఈ పాఠశాలలోనే పింగళి వెంకయ్య విగ్రహాన్ని ఆవిష్కరించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. "నేను చదువుకునే రోజుల్లో దీనిని 'గవర్నమెంట్ మోడల్ బాయ్స్ హైస్కూల్' అని పిలిచేవారు. నాటి పూర్వ విద్యార్థిగా ఈ పాఠశా ల అభివృద్ధి కార్యక్రమాల పట్ల నాకు ప్రత్యేక బాధ్యత ఉంది..నిజంగా ఈరోజు మహోన్నత వ్యక్తి పింగ ళి వెంకయ్య విగ్రహం ఆవిష్కరించడం అత్యంత ఆదర్శనీయం" అని భావోద్వేగానికి లోనయ్యారు. తన పాఠశాల రోజుల్లో ఆగస్టు 15 వేడుకలను గుర్తుచేసుకుంటూ "విజయీ విశ్వ తిరంగా ప్యారా.. ఝుండా ఊంచా రహే హమారా" అని గేయం పాడి నాటి రోజులను గుర్తుచేసుకున్నారు.

## అభివృద్ధి పనుల్లో ప్రజల భాగస్వామ్యమే ప్రభుత్వ లక్ష్యం



మంత్రి పొంగూరు నారాయణ
ప్రతి నెలా స్థానిక సమస్యల పరిశీలనకు అధికారుల బృందం
శ్రీనివాస నగర్ సమస్యల పరిష్కారానికి మంత్రి పొంగూరు నారాయణ హామీ
నెల్లూరు కార్పొరేషన్‌లో నెలకు ఒక రోజు అధికారుల నేరుగా పరిశీలన.. మంత్రి నారాయణ

నెల్లూరు ఆగస్ట్ 02 అనంత జనశక్తి న్యూస్

నగర ప్రజలను అభివృద్ధి పనుల్లో భాగస్వాములను చేయడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. నెల్లూరు నగరం 4వ డివిజన్, శ్రీనివాస నగర్ 3వ వీధిలో శ్రీనివాస నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం. శ్రీనివాసులు రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న మంత్రి, నగర కార్పొరేషన్ పరిధిలోని 42 రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ల పరిధిలోకి ప్రతి నెలా ఒక ప్రత్యేక రోజున శానిటేషన్, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ విభాగాల అధికారుల బృందం నేరుగా వచ్చి స్థానిక సమస్యలను పరిశీలిస్తుందని ప్రకటించడమే కాకుండా, శ్రీనివాస నగర్ పరిధిలోని డ్రైనేజీ పునర్నిర్మాణం..సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు..అసోసియేషన్ సెక్రటరీ ఎం. రాజగోపాల్ రెడ్డి, కమిటీ సభ్యులు ఉమా మహేశ్వరరావు, ఎస్. రమణారెడ్డి, కే. కేశవరెడ్డి, మాధవరావు తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమం స్థానిక ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా నిలిచింది.ఈ కార్యక్రమంలో కమిషన్ నందన్,మేయర్ సుజాత,డిప్యూటి మేయర్ రూప్ కుమార్ యాదవ్,నగర అధ్యక్షుడు మామిడాల మధు, 4వ డివిజన్ అధ్యక్షులు నారాయణ రెడ్డి,రంగనాథస్వామి ఆలయ చైర్మన్ లెక్కల వెంకారెడ్డిలతో పాటు, మునగాల శ్రీనివాసులు రెడ్డి, హబీబ్ మరియు వావిళ్ల బాబు, టిడిపి ముఖ్య నేతలు నాయకులు పాల్గొన్నారు.

## మత్తు రహిత యువతే వికసిత్ భారతానికి బలం



- నషా ముక్త్ యువ్ ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సవిత

గోరంట్ల ఆగస్టు 2:అనంత జనశక్తి న్యూస్

బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో గోరంట్ల వాసవీ కళ్యాణ మండపంలో నిర్వహించిన "నషా ముక్త్ యువ్ ఫర్ వికసిత్ భారత్" మాదక ద్రవ్యాల నిర్మూలన అవగాహన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి శ్రీమతి సవితమ్మ గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి సవితమ్మ మాట్లాడుతూ, దేశాన్ని మత్తు పదార్థాల రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన ఈ జాతీయ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ అనే సామాజిక మహమ్మారి నుంచి యువతను కాపాడటం కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ యంత్రాంగం అందరి ఉమ్మడి బాధ్యత అని పేర్కొన్నారు.డ్రగ్స్ నిర్మూలన కోసం దేశవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. యువత భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు, క్రీడా కార్యక్రమాలు, వాకథాన్‌లు నిర్వహించడం ద్వారా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రోత్సహించనున్నట్లు చెప్పారు. విద్యాసంస్థల్లో డ్రగ్స్ దుష్పరిణామాలపై అవగాహన ర్యాలీలు, చర్చా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.అనంతరం మంత్రి సవితమ్మ విద్యార్థులతో కలిసి మాదక ద్రవ్యాల నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండడంతో పాటు, వాటి వినియోగాన్ని అరికట్టేందుకు తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమాన్ని బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో నిర్వహించగా, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు,, విద్యార్థులు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడుగా రాజా యాదవ్.

- యాదవుల ఐక్యతకు కృషిచేయాలని యాదవ పెద్దల సూచన..

అనంతపురం ఆగస్టు 2, అనంత జనశక్తి న్యూస్



అనంతపురం జిల్లా యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడుగా రాజా యాదవ్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం అనంతపురంలోని నక్కా రామారావు యాదవ భవన్ నందు ఏర్పాటు చేసిన జిల్లా యాదవ సంఘం సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ యాదవ్, రాష్ట్ర నాయకులు రాజశేఖర్ యాదవ్, నారాయణ స్వామి యాదవ్ తదితరులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నూతనంగా జిల్లా, మండల కమిటీలను ఎన్నుకున్నారు. అనంతరం యాదవ సంఘం నేతలు మాట్లాడుతూ రాజా యాదవ్ గత కొన్ని సంవత్సరాలుగా జర్నలిస్టు గా కొనసాగుతూ, అనంతపురంలో అందరికీ సుపరిచితుడని, ఇప్పుడు యాదవుల ఐ క్య త కు కృషి చేస్తూ సేవా కార్యక్రమాలలో పాల్గొనాలని సూచించారు. అనంతరం రాజా యాదవ్ మాట్లాడుతూ తనకు యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు యాదవ పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, యాదవ సోదరుల ఐక్యతకు కృషి చేస్తూ, వారి సమస్యలపై పోరాడడానికి నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు. అందులో భాగంగానే త్వరలో జిల్లాలోని అన్ని మండలాలలో అన్ని రకాల కమిటీలు వేయడంతో పాటు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికల్లో యాదవులు ఏ పార్టీలో ఉన్నా వారి బలోపేతానికి కృషి చేస్తామని యాదవ పెద్దలు తెలిపారు. యాదవులకు ఏ పార్టీ ప్రాధాన్యత ఇస్తుందో ఆ పార్టీకే యాదవుల మద్దతు ఉంటుందని తెలిపారు. అనంతరం యాదవ సంఘం నూతన కమిటీని పలువురు అభినందించారు.



# నెల్లూరులో ఘనంగా చండీ హోమం..

- పాల్గొన్న మంత్రి నారాయణ
- జగదీశ్ నగర్‌లో ఆధ్యాత్మిక శోభ..
- సనాతన ధర్మం, భారతీయ సంస్కృతి ప్రపంచానికే ఆదర్శం: మంత్రి నారాయణ
- ఒకే వేదికపై 1108 మంది మహిళల పారాయణం..అరుదైన ఆధ్యాత్మిక ఘట్టంపై మంత్రి నారాయణ ప్రశంసలు
- భక్తి ఉన్న చోట శాంతి.. ధర్మం ఉన్న చోట అభివృద్ధి.. మంత్రి నారాయణ కీలక వ్యాఖ్యలు
- చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి.. మంత్రి నారాయణ ఆకాంక్ష



నెల్లూరు ఆగస్ట్ 02,అనంత జనశక్తి న్యూస్

నెల్లూరు నగరంలోని జగదీశ్ నగర్‌లో అత్యంత వైభవంగా నిర్వహించిన మహా రుద్రాభిషేకం, చండీ హోమం, లలితా సహస్రనామ పారాయణంలో రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. యాగ స్థలానికి విచ్చేసిన మంత్రికి యాగ నిర్వాహక కమిటీతో పాటు టీడీపీ, జనసేన నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ ఆధ్యాత్మిక ఘట్టంలో పాల్గొనడం తన పూర్వజన్మ అదృష్టంగా భావిస్తున్నానని, వరుసగా 18వ సంవత్సరం ఈ మహాయాగాన్ని నిర్వహిస్తున్న భువనగిరి సుబ్బయ్య స్వామికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఏకకాలంలో 1108 మంది మహిళలు లలితా సహస్రనామ పారాయణం చేయడం అత్యంత అరుదైన ఆధ్యాత్మిక ఘట్టమని, లోక కళ్యాణం మరియు కుటుంబ సౌఖ్యం కోసం చేసే ఈ యాగాలు సమాజంలో సానుకూల శక్తిని, యువతలో నైతిక విలువలను పెంపొందిస్తాయని చెప్పారు. భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం ప్రపంచానికే ఆదర్శమన్న మంత్రి.. భక్తి ఉన్న చోట శాంతి, ధర్మం ఉన్న చోట అభివృద్ధి ఉంటాయని పేర్కొంటూ, సీఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో సుభిక్షంగా వర్ధిల్లాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మేయర్ దేవరకొండ సుజాత,డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్,స్థానిక టీడీపీ నేతలు సాయిరాం,యశ్వంత్ రెడ్డి,జనసేన నేతలు గుణుకుల కిషోర్,విజయలక్ష్మి,కార్యక్రమ కమిటీ సభ్యులు రవికుమార్,నరసింహులు పాల్గొన్నారు.

## టెంకాయ కొట్టింది మేమే... గుమ్మడి కాయ కొట్టిందే మేమే

# 'భోగాపురం' క్రెడిట్ మాదే..

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- జగనవన్నీ దౌర్భాగ్యపు క్రెడిట్ లే...
- హంతకులను పరామర్శించే క్రెడిట్ ఆయనదే...
- రప్పా రప్పా నరకడం క్రెడిట్ వైసీపీదే...
- మాది అభివృద్ధి క్రెడిట్...
- క్రెడిట్ చోరీలకు కేరాఫ్ అడ్రాస్ జగన్
- బీసీల విద్యకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం : మంత్రి సవిత
- పెనుకొండలో ఎంజేపీ గురుకుల పాఠశాల ప్రారంభం

పెనుకొండ ఆగస్టు 02 అనంత జనశక్తి న్యూస్

'హంతకులను పరామర్శించడం జగన్ క్రెడిట్... రప్పా రప్పా నరకడం వైసీపీ క్రెడిట్... విధ్వంసం వాళ్ల క్రెడిట్... ఆ క్రెడిట్ మాకు అవసరం లేదు... మా క్రెడిట్ అభివృద్ధి... అదే మాకు చాలు' రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. పేదోడి కడుపు నింపే అన్న క్యాంటీన్లను మూసేసిన దౌర్భాగ్యపు క్రెడిట్ ఎవరికీ అక్కర్లేదన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణానికి టెంకాయ కొట్టింది తామే... ప్రారంభోత్సవ గుమ్మడి కొట్టింది తామేనని స్పష్టంచేశారు. విద్యతోనే బీసీలకు అందలమని నమ్మిన ప్రభుత్వం తమదని, అందుకే రాష్ట్ర వ్యాప్తంగా బీసీ గురుకులాలను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ గురుకులాల్లో నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, రక్షణ కల్పిస్తూ బీసీలు ఉన్నత విద్య చదివే ప్రోత్సహిస్తున్నామన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలో ఆదివారం మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలను మంత్రి సవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నామన్నారు. విద్యకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. తల్లికి వందనం పథకం పేరుతో ఇంట్లో ఎందరు బిడ్డలు ఉంటే, అందరికీ రూ.13 వేల చొప్పున అందజేశామన్నారు. విద్యా మిత్ర కిట్లు అందజేస్తున్నామన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో కొత్తగా పది మహాత్మాజ్యోతిరావు బీసీ గురుకుల పాఠశాలలను ప్రారంభించామన్నారు. ఇందులో భాగంగా పెనుకొండ పట్టణంలో బీసీ గురుకుల బాలుర పాఠశాలను ప్రారంభించామన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 5 నుంచి 8వ తరగతి వరకూ 250 సీట్లు భర్తీచేసేలా అడ్మిషన్లు చేపట్టామన్నారు. ఈ ఏడాది ఆరు బీసీ గురుకులాలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేశామని మంత్రి సవిత తెలిపారు.





**త్వరలో ఎస్సీ గురుకులం ఏర్పాటు**

పెనుకొండ నియోజక వర్గంలో పలు గురుకులాలు, బీసీ హాస్టళ్ల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించామని మంత్రి సవిత తెలిపారు. రూ.3 కోట్లతో కేజీవీబీ పాఠశాలను, రొద్దం, గోరంట్ల, సోమందేపల్లిలో బీసీ హాస్టళ్లను ప్రారంభించామన్నారు. త్వరలో పెనుకొండలో ఎస్సీ గురుకుల పాఠశాలలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బీసీ గురుకులాల్లో విద్యార్థులకు విద్యతో క్రీడల్లోనూ ప్రోత్సహించేలా స్పోర్ట్స్ ట్రాక్ షూట్లు, బూట్లు అందజేశామన్నారు. త్వరలో స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందజేసే సౌకర్యాలను వినియోగించుకుంటూ, తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టేలా కష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. ఎంజేపీ గురుకుల పాఠశాలల సీట్ల కోసం విపరీతమైన డిమాండ్ ఉందని, ఫలితాల్లో కూడా ఈ పాఠశాలలు అగ్రస్థానంలో నిలుస్తున్నాయని మంత్రి సవిత కొనియాడారు.

**క్రెడిట్ చోరీలకు కేరాఫ్ అడ్రాస్ జగన్...**

అనంతరం మంత్రి సవిత విలేకరులతో మాట్లాడుతూ, ప్రాణాలు కోల్పోయిన బాధితులను కాకుండా, వారిని పొట్టనపెట్టుకున్న హంతకులను పరామర్శించే క్రెడిట్ జగన్ సొంతమని విరుచుకుపడ్డారు. పేదల కడుపునింపే అన్న క్యాంటీన్లను మూసివేసిన క్రెడిట్ కూడా ఆయన సొంతేమనన్నారు. రప్పా రప్పా నరకడం వైసీపీ క్రెడిట్ అని, అమరావతిని పక్కనపెట్టేసి, రాజధానిని మూడు ముక్కల చేసిన క్రెడిట్ కూడా వారిదేనన్నారు. అయిదేళ్లలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి సంచితో సిమెంట్ కూడా వేయని జగన్ క్రెడిట్ తమకు అవసరమా..? అని ప్రశ్నించారు. జగన్ దౌర్భాగ్యపు క్రెడిట్లు తమకు వద్దని, కూటమి ప్రభుత్వానికి అభివృద్ధి క్రెడిట్ అని మంత్రి స్పష్టంచేశారు. క్రెడిట్ చోరీలకు కేరాఫ్ అడ్రాస్ జగన్ అని మండిపడ్డారు. భోగాపురం ఎయిర్ నిర్మాణానికి టెంకాయ కొట్టింది తామేనని, ఎయిర్ పోర్ట్ ప్రారంభోత్సవ సందర్భంగా గుమ్మడి కొట్టింది కూడా తామేనని తెలిపారు. భోగాపురం ఎయిర్ పోర్టు క్రెడిట్ ముమ్మాటికీ తమదేనని మంత్రి సవిత స్పష్టంచేశారు. ఉత్తరాంధ్ర వాసుల ఆకాంక్షను సీఎం చంద్రబాబు నెరవేర్చారన్నారు. ఈ కార్యక్రమంలో పలు కార్పొరేషన్ చైర్మన్లు వెంకటరమణ, స్వప్న, ఆర్డీవో ఆనందరావు కార్పొరేషన్ డైరెక్టర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఆరునెలల పాటు కచ్చితంగా తల్లిపాలు ఇవ్వాలి

- తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన
- కిమ్స్ సవీర ఆధ్వర్యంలో వాక్ థాన్

అనంతపురం, ఆగస్టు 02 అనంత జనశక్తి న్యూస్





తల్లిపాలతోనే శిశువుకు నాణ్యమైన భవిష్యత్తు అందుతుందని అన్నారు కిమ్స్ సవీర హాస్పిటల్ పీడియాట్రిషన్ డాక్టర్. ఏ. మహేష్. అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని కిమ్స్ సవీర హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రజల్లో అవగాహన తీసుకరావడానికి వాక్ థాన్ నిర్వహించారు. ఈ వాక్ థాన్ టవర్ సర్కిల్ నుండి సప్తగిరి సర్కిల్ వరకు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాలపై అవగాహన పెంచడంతో పాటు తల్లులకు కుటుంబ సభ్యులు, వైద్యులు, సమాజం నుంచి అవసరమైన సహకారం అందేలా చైతన్యం కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. తల్లిపాల విజయవంతమైన అమలుకు ఇప్పటికే ఫలితాలిచ్చిన విధానాలను మరింత బలోపేతం చేయడంతో పాటు వైద్యులు, కుటుంబ సభ్యులు, కార్యాలయాలు, సమాజం కలిసి తల్లులకు అండగా నిలవాల్సిన అవసరాన్ని ఉందన్నారు. తల్లిపాల అవగాహన వాక్‌థాన్‌లో ప్రసూతి వైద్యులు, నియోనటాలజిస్టులు, చిన్నపిల్లల వైద్యులు, నర్సులు, లాక్టేషన్ కన్సల్టెంట్లు, ఆస్పత్రి సిబ్బంది, గర్భిణులు, చిన్నారుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తల్లిపాలు ఇవ్వడం తల్లి ఒక్కరి బాధ్యత మాత్రమే కాదని, కుటుంబం మరియు సమాజం కూడా అందుకు సహకరించాలని ఈ సందర్భంగా సందేశం ఇచ్చారు.

వారం రోజుల పాటు గర్భిణులు, బాలింతలు, కుటుంబ సభ్యులకు తల్లిపాలపై శాస్త్రీయ అవగాహన కల్పించే పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కన్సల్టెంట్ పీడియాట్రీషన్ డా. శ్వేత మాట్లాడుతూ గర్భధారణ సమయంలో తల్లిపాలపై కౌన్సెలింగ్, శిశువుకు సరైన విధంగా పాలు పట్టించే పద్ధతులపై ప్రత్యక్ష ప్రదర్శనలు ఇస్తున్నామన్నారు. పుట్టిన తర్వాత తొలి ఆరు నెలలు శిశువుకు పూర్తిగా తల్లి పాలు మాత్రమే ఇవ్వాలని, అనంతరం అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలు కొనసాగించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

గైనకాలజిస్టులు డా. సురేఖ, డా. శృతిలు మాట్లాడుతూ "శిశువు ఆరోగ్యానికి తల్లిపాలు తొలి పెట్టుబడి. ఇవి శిశువుకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించడమే కాకుండా రోగనిరోధక శక్తిని పెంచి, మెదడు ఎదుగుదలకు దోహదపడతాయి. అలాగే తల్లి-బిడ్డల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తాయి. చాలామంది తల్లులు తల్లిపాలు ఇవ్వాలని కోరుకున్నప్పటికీ సరైన మార్గదర్శకత్వం, ప్రోత్సాహం అవసరం అవుతుంది. ప్రతి తల్లి ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో తన బిడ్డకు తల్లిపాలు అందించేలా సమాజంలో సహాయక వాతావరణాన్ని ఏర్పరచడమే ఈ కార్యక్రమం లక్ష్యం" అని అన్నారు.

# కౌమార మాతృత్వంతో ఆరోగ్య సమస్యలు

**– హెచ్. ప్రతాప్**

భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక యువజనాభా కలిగిన దేశం. ఈ యువశక్తే దేశ అభివృద్ధికి మూలధనం. అయితే, అదే యువతలోని బాలికలు కౌమార దశలోనే గర్భం దాల్చడం దేశ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇది ఒక కుటుంబానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు; దేశ ఆరోగ్యం, విద్య, ఆర్థికాభివృద్ధి, మహిళా సాధికారతలను దెబ్బతీసే జాతీయ సవాలు. పుస్తకాలు పట్టాల్సిన చేతుల్లో పసిబిడ్డలు కనిపించడం ఏ అభివృద్ధి చెందిన సమాజానికీ శుభసూచకం కాదు.

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (NFHS5) గణాంకాలు ఈ సమస్య తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తున్నాయి. దేశంలో 15-19 ఏళ్ల వయస్సు గల బాలికల్లో సుమారు 7 శాతం మంది ఇప్పటికే తల్లులుగా మారారు లేదా గర్భవతులుగా ఉన్నారు. 2005-06లో ఈ శాతం 16 ఉండగా, 2019-21 నాటికి 8.1 శాతానికి తగ్గింది. తగ్గుదల కనిపించినప్పటికీ, ఇంకా లక్షలాది మంది బాలికలు కౌమార మాతృత్వాన్ని అనుభవించడం ఆందోళన కలిగించే విషయమే. త్రిపురలో ప్రతి వెయ్యి మంది 15-19 ఏళ్ల యువతుల్లో 91 ప్రసవాలు నమోదవగా, మేఘాలయ, పశ్చిమ బెంగాల్, అస్సాం, బిహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు జాతీయ సగటును మించిపోయాయి. ఆంధ్రప్రదేశ్‌లో కౌమార గర్భధారణల శాతం 12.6, దేశంలోనే అత్యధికంగా నమోదైన రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచింది. రాష్ట్రంలోని పల్నాడు జిల్లాలో 14.9 శాతం నమోదుకావడం మరింత ఆందోళనకరం. భారత జనాభాలో 27.3 శాతం మంది 15-29 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతే. ఈ వయస్సులోనే బాలికలు తల్లులుగా మారడం వల్ల విద్య మధ్యలోనే ఆగిపోవడం, ఉపాధి అవకాశాలు కోల్పోవడం, ఆర్థికంగా ఇతరులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఫలితంగా దేశానికి అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులు తగ్గిపోతున్నాయి. ఇది కేవలం కుటుంబ ఆదాయాన్ని కాదు, దేశ ఆర్థికాభివృద్ధినీ ప్రభావితం చేస్తుంది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిక ప్రకారం, 15-19 ఏళ్ల వయస్సులో గర్భం దాల్చిన బాలికలకు ప్రసవ సమయంలో ప్రాణాపాయం ఎక్కువ. రక్తహీనత, పోషకాహార లోపం, అధిక రక్తపోటు, అకాల ప్రసవం, తక్కువ బరువుతో శిశువు జననం వంటి సమస్యలు అధికంగా కనిపిస్తాయి. అంతేకాదు, మానసిక ఒత్తిడి, నిరాశ, ఆత్మవిశ్వాస లోపం, ఆత్మహత్యా ప్రయత్నాల ప్రమాదం కూడా పెరుగుతోంది. ఒక బలహీన తల్లి నుంచి ఆరోగ్యవంతమైన తరాన్ని ఆశించడం కష్టమే.

ఈ పరిస్థితికి ప్రధాన కారణాలు బాల్య వివాహాలు, పేదరికం, విద్యా లేమి, లైంగిక ఆరోగ్యంపై సరైన అవగాహన లేకపోవడం, సామాజిక మాధ్యమాల ప్రభావం, గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగుతున్న సంప్రదాయ దృక్పథాలు. గతంలో భారతదేశంలో దాదాపు 47 శాతం వివాహాలు 18 సంవత్సరాల లోపే జరిగేవని అధ్యయనాలు వెల్లడించాయి. చట్టాలు కఠినంగా ఉన్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో అవి ఇంకా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. పరిష్కారం కోసం బాలికల విద్యను ఉన్నత మాధ్యమిక స్థాయి వరకు తప్పనిసరిగా కొనసాగించే వాతావరణం కల్పించాలి. పాఠశాల స్థాయి నుంచే శాస్త్రీయ లైంగిక ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేయడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక చైతన్య కార్యక్రమాలు చేపట్టాలి. యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థిక స్వావలంబన పెంచాలి. సామాజిక మాధ్యమాలను కూడా అవగాహన వేదికలుగా వినియోగించాలి. "యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః" అని మనుస్మృతి చెబుతోంది.

బాలిక ఆరోగ్యంగా, విద్యావంతురాలిగా, ఆత్మవిశ్వాసంతో ఎదిగితేనే కుటుంబం బలపడుతుంది; కుటుంబం బలపడితేనే దేశం బలపడుతుంది. కౌమార గర్భధారణను అరికట్టడం అంటే ఒక బాలిక జీవితాన్ని మాత్రమే కాదు, భారత భవిష్యత్తును కూడా కాపాడటమే. ప్రభుత్వం లక్ష్యాలు ప్రకటించడం సరిపోదు. ప్రతి కుటుంబం, ప్రతి పాఠశాల, ప్రతి గ్రామం, ప్రతి పౌరుడు ఈ బాధ్యతను తనదిగా భావించినప్పుడే ఈ సామాజిక రుగ్మతకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

# "నేతన్న సేవ పథకం " పై ఆందోళన చెందుతున్న చేనేత కార్మికులు



- అర్హులైన చేనేత కార్మికులకు " నేతన్న సేవ" పథకం అందేనా.....?
- ఆగష్టు 7 "నేతన్న సేవ" పథకం అమలు
- మరణించిన చేనేత కార్మికుల కుటుంబంలో మరొకరికి అందేనా...?
- 200 యూనిట్లు విద్యుత్ బిల్లు ఆధారంగా తీసుకోంటున్నారా.......?
- గత ప్రభుత్వం 90వేల మంది చేనేత కార్మికులకు మంజూరు చేశారు
- ప్రస్తుత ప్రభుత్వం 51,952 మందిని అర్హులు గా ప్రకటించారు
- ఇంత వరకు నేతన్న సేవ పథకం పై స్పష్టత ఇవ్వలేదు
- అధికారుల నోటి నుండి సమాధానం "మాకు తెలియదు" అని వస్తున్నది....
- గందరగోళంలో చేనేత కార్మికులు

**యాడికి, ఆగష్టు 2, అనంత జనశక్తి న్యూస్ :**

భారతదేశ చేనేత రంగం చాలా గొప్పదని, వ్యవసాయం రంగం తర్వాత అతి పెద్ద రంగం చేనేత అని, భారతీయ చేనేత రంగం మన ప్రాచీన సాంస్కృతిక వారసత్వానికి,అద్భుతమైన హస్తకళా నైపుణ్యానికి, గ్రామీణ ఉపాధికి ప్రతీకగా నిలుస్తోందని, ఇది కేవలం వస్త్రాల తయారీ మాత్రమే కాదు అని, మన దేశ జీవన విధానం , ఆత్మ గౌరవానికి మూలం అని,సాంస్కృతిక వారసత్వం సింధు లోయ నాగరికత కాలం నాటికే మన దేశంలో పత్తిని పండించి బట్టలు నేసే అద్భుతమైన చరిత్ర ఉందని చేనేత పెద్దలు ,పండితులు , చరిత్రకారులు తెలిపారు. చేనేత రంగంపై ఆధారపడిన చేనేత కార్మికులను ఆదుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం విశిష్టాత్మకంగా ఆగష్టు 7 జాతీయ చేనేత దినోత్సవం న చేనేత కార్మికులకు నేతన్న సేవ పథకం ను అమలు చేస్తామని సి ఎం చంద్రబాబు నాయుడు, బీసీ సంక్షేమ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం ,చేనేత జౌళి శాఖల మంత్రి ఎస్. సవిత లు ప్రకటించారు. జాతీయ చేనేత దినోత్సవమైన ఆగష్ట 7 న రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న " నేతన్న సేవ పథకం" పై చేనేత కార్మికులు ఆందోళన చెందుతున్నారు. నేతన్న సేవ పథకం అమలు చేయడానికి గడువు 5 రోజులు మాత్రమే ఉందని,కానీ ఇంత వరకు "నేతన్న సేవ" పథకం పై స్పష్టత లేదని , చేనేత కార్మికులలో ఉన్న సమస్యలను ఎలా పరిష్కారం చేస్తారని చేనేత కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.అర్హులైన చేనేత కార్మికులకు నేతన్న సేవ పథకం అందుతుందా.....? లేదా తప్పు దారి పడుతుందా...... ? అని , "నేతన్న సేవ" పథకం అమలు పై రకరకాల వార్తలు వస్తున్నాయని , ఏది వాస్తవం.....,ఏది అవాస్తవం అనే నిర్ధారణ ఇంత వరకు తెలియదని చేనేత కార్మికులు తెలిపారు.200 యూనిట్లు విద్యుత్ బిల్లు ఆధారంగా తీసుకోంటున్నారు.......? , అనే విషయం బాగా ప్రచారంలో ఉందని, 200 యూనిట్లు విద్యుత్ బిల్లు ఆధారంగా తీసుకోన్న ..... ఇందులో కూడా చాలా సమస్యలు ఉన్నాయని, గత ప్రభుత్వం జాబితా ను తీసుకోన్న .... అందులో కూడా సమస్యలు ఉన్నాయని చేనేత కార్మికులు తెలిపారు. చేనేత కుటుంబంలో ఒకరికి "నేతన్న సేవ" పథకం అందుతుందని రాష్ట్ర ప్రభుత్వం తెలిపారని , గత ప్రభుత్వంలో నేతన్న నేస్తం పథకం కింద రూ.24 వేలు తీసుకోన్న లబ్ధిదారుడు , కొన్ని అనివార్య కారణాల వల్ల ఆ లబ్ధిదారుడు మరణిస్తే..... ఆ కుటుంబం పరిస్థితి ఏమిటి అని చేనేత కార్మికులు ప్రశ్నిస్తున్నారు. భర్త మరణించిన స్థానంలో భార్య కు, భార్య మరణించిన స్థానంలో భర్త కు నేతన్న సేవ పథకం ను అమలు చేయాలని తెలిపారు. గత ప్రభుత్వం 90వేల మంది చేనేత కార్మికులకు మంజూరు చేశారని, ప్రస్తుత ప్రభుత్వం 51,952 మందిని అర్హులు గా ప్రకటించిందని , చేనేత రంగం పై చేనేత అనుబంధ కార్మికులు, ఉప వృత్తుల వారికి కూడా "నేతన్న సేవ" పథకాన్ని అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, అనుబంధ కార్మికులు, ఉప వృత్తులైన కండేలు చుట్టేవారు, రంగులు అద్దేవారు, అచ్చు అతికేవారు, డోలు చుట్టేవారు, జరీ రాట్నం చుట్టేవారు, వార్పు అంటు పెట్టేవారు ఉన్నారని , వీరందరికి కూడా "నేతన్న సేవ" పథకం ద్వారా రూ.25 వేలను అందచేయాలని చేనేత కార్మికులు తెలిపారు. ఇంత వరకు నేతన్న సేవ పథకం పై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదని, నేతన్న సేవ పథకం పై ఉన్న సమస్యలను అధికారులకు తెలియచేస్తుంటే, అధికారులు నుండి "మాకు తెలియదు" అనే సమాధానం వస్తున్నదని, అధికారులకే సమాధానం తెలియకపోతే మేము ఎవరితో సమస్యలను విన్నవించాలని చేనేత కార్మికులు మొరపెట్టుకోంటున్నారు. దీంతో గందరగోళ పరిస్థితి ఏర్పడిందని చేనేత కార్మికులు వాపోయారు. మగ్గం ఉన్న చేనేత కార్మికులకు న్యాయం చేయాలని, నేతన్న సేవ పథకం కింద సచివాలయాలలో మార్పు , చేర్పులకు అవకాశం కల్పించాలని , అనంతరం దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన చేనేత కార్మికులకు "నేతన్న సేవ" పథకం అందేలా చూడాలని చేనేత కార్మికులు కోరారు.



## ఒక రోజు సర్వేతో చేనేత కార్మికులకు అన్యాయం



- చేనేత రాష్ట్ర ఉపాధ్యక్షులు నీల్లూరు లక్ష్మయ్య

**యాడికి, ఆగష్టు 2, అనంత జనశక్తి న్యూస్ :**

ఒక రోజు సర్వేతో చేనేత కార్మికులకు అన్యాయం జరుగుతుందని, నేతన్న సేవ సర్వే గడువును పొడిగించాలని ఆదివారం మండల కేంద్రంలో చేనేత రాష్ట్ర ఉపాధ్యక్షులు నీలూరు లక్ష్మయ్య, సిపిఐ సీనియర్ నాయకులు శ్రీరాములు, ఓబిరెడ్డి డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా నీల్లూరు లక్ష్మయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు నేతన్న సేవ పేరుతో రూ.25 వేలు ఆర్థిక సహాయం అందించేందుకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టిందని తెలిపారు. అయితే జులై 31వ తేదీ ఒక్కరోజు మాత్రమే సర్వే నిర్వహించి లబ్ధిదారులను ఎంపికచేయాలని అధికారులకు ఆదేశించడం చాలా బాధాకరమన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన నేతన్నలకు గుర్తించి నేతన్న సేవ లబ్ధి చేకూర్చాలన్నారు అదే విధంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం కూడా అనేక మంది చేనేత కార్మికులకు వర్తించలేదని, ప్రభుత్వం ఇప్పుడు చేపట్టే సర్వే వల్ల మరికొంత మంది కార్మికులు నష్టపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సర్వేకు మరికొంత సమయం కేటాయించి అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి నేతన్న సేవ పథకం ద్వారా రూ.25 వేలు అందేలా చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరం ప్రకటించిన నేతన్న సేవ పథకం రెండేళ్ల లబ్ధి 50,వేలు లబ్ది చేకూర్చాలన్నారు .చేనేతపై ఆధారపడిన ఇతర చేనేత వృత్తుల వారికి కూడా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నేతన్న సేవ పథకం వర్తించేలా చూడాలని,చేనేత కార్మికులకు నష్టం కలిగించే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తే చేనేత కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లా కృష్ణమూర్తి, చారుగుండ్ల ఆంజనేయులు పాల్గొన్నారు.

## బళ్లారి రాఘవ జీవితం యువతకు స్ఫూర్తి: డీఆర్ఓ మాలోల



**అనంతపురం, ఆగస్టు 2:అనంత జనశక్తి న్యూస్**

నాటకరంగ మహనీయుడు బళ్లారి రాఘవ జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయమని జిల్లా రెవెన్యూ అధికారి మాలోల అన్నారు. బళ్లారి రాఘవ 146వ జయంతి సందర్భంగా ఆదివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాలోల మాట్లాడుతూ, బళ్లారి రాఘవ తెలుగు నాటకరంగంలో గొప్ప నటుడిగానే కాకుండా సమాజ సంస్కరణకు కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. మేధావిగా, వక్తగా, రచయితగా, దాతగా ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.1880 ఆగస్టు 2న తాడిపత్రిలో జన్మించిన బళ్లారి రాఘవ చిన్న వయస్సులోనే నాటకరంగంలో ప్రవేశించి తన అభినయంతో విశేష గుర్తింపు పొందారని తెలిపారు. హరిశ్చంద్ర, పాదుకా పట్టాభిషేకం, సావిత్రి, బృహన్నల, రామరాజు చరిత్ర, రామదాసు తదితర నాటకాల ద్వారా ఆయన విశేష ఖ్యాతి గడించారని, ఆయన నటనను మహాత్మా గాంధీ సైతం ప్రశంసించారని గుర్తు చేశారు.నాటకరంగం ద్వారా సంపాదించిన ధనాన్ని ప్రజా శ్రేయస్సుకు వినియోగించిన బళ్లారి రాఘవ సమాజ సేవ, మహిళా విద్య ప్రోత్సాహం, తెలుగు సాహిత్యాభివృద్ధికి విశేష కృషి చేశారని తెలిపారు. ప్రతి విద్యార్థి ఆయన జీవితం నుంచి స్ఫూర్తి పొందాలని, కళను దేశభక్తి, నైతిక విలువలకు వేదికగా మలిచిన ఆయన ఆశయాలు యువతకు మార్గదర్శకంగా నిలవాలని మాలోల ఆకాంక్షించారు.కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి రమణ రెడ్డి, లలిత కళా పరిషత్ కార్యదర్శి పద్మజ, ఆన్‌సెట్ మేనేజర్ శ్రీనివాసులు, యువజన సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ అన్వర్ బాష, కలెక్టరేట్ సిబ్బంది, కళాకారులు పాల్గొన్నారు.

## శ్రీ గురజాల అక్కమ్మ తల్లి జాతర మహోత్సవాల్లో పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్

- రాష్ట్ర ప్రగతి, ప్రజల సంక్షేమం కోసం అమ్మవారిని ప్రార్థించిన మంత్రి దుర్గేష్

**రాజమహేంద్రవరం ఆగస్టు 02 అనంత జనశక్తి న్యూస్**

రాజమహేంద్రవరం సాటిలైట్ సిటీలో అత్యంత వైభవంగా జరుగుతున్న శ్రీ గురజాల అక్కమ్మ తల్లి జాతర మహోత్సవాలలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, నిర్వాహకులు మంత్రి దుర్గేష్ కు ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి మంత్రి దుర్గేష్ ప్రత్యేక పూజలు నిర్వహించి, శేషవస్త్రంతో పాటు తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... గురజాల అక్కమ్మ తల్లి ఆశీస్సులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి, ప్రగతి పథంలో నిరంతరం ముందుకు సాగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకున్నారు. సంస్కృతీ సంప్రదాయాలను, గ్రామీణ జాతరలను కాపాడుకోవడం మనందరి అందరి బాధ్యత అని పేర్కొన్నారు.



## కరువుగా ప్రకటించి, తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలి



**రాప్తాడు ఆగస్టు 2 అనంత జనశక్తి న్యూస్**

రాప్తాడు మండలాన్ని, వాటి పరిధిలో ఉన్నటువంటి గ్రామాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలంటూ, రైతు సంఘం నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి జిల్లాలో కరువు పరిస్థితులను వివరిస్తూ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కె. ప్రభాకర రెడ్డి డిమాండ్ చేస్తూ అనంతపురం జిల్లా రాప్తాడు మండలం లింగనపల్లి గ్రామంలో ఎండిపోతున్న వేరుశనగ పంటలను రైతుసంఘం ప్రతినిధి బృందం పరిశీలించింది.

ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే .ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు అవుతున్న ఎల్ నినో ప్రభావం వల్ల సకాలంలో వర్షాలు పడక జూన్ లో సాగు చేసిన వేరుశనగ, కంది, ఆముదం, పత్తి పంటలు ఎండిపోతున్నాయి.

జిల్లాలో ఖరీఫ్ లో 3 లక్షల 43 వేల హెక్టార్లలో పంటలు సాగు కావలసి ఉండగా 86 వేల హెక్టార్లలో మాత్రమే పంటలు సాగు చేశారు ప్రధాన పంటలు కంది 40 వేల హెక్టార్లు, వేరుశనగ 14 వేల హెక్టార్లు, పత్తి 19వేల హెక్టార్లు సాగు అయ్యాయి. రెండు నెలలుగా ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు పడక వేసిన పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. కావున ప్రభుత్వం ప్రత్యామ్నాయ ప్రణాళిక ప్రకటించి కరువు సహాయక చర్యలు చేపట్టాలి, పంట రుణాలు మాఫీ చేయాలి. ఎండిపోతున్న పంటలు కాపాడాలి, ప్రత్యామ్నాయ విత్తనాలు కొర్ర, పెసలు అలసందలు, ఉలవలు, ఉచితంగా ఇవ్వాలి అన్ని గ్రామాలలో గడ్డి కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్. చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు వి.శివా రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు పోతలయ్య, వెంకట కొండ, సంజీవరెడ్డి , రైతులు మధుసూదన్, సుబ్బి రెడ్డి, హనుమంత్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కొండారెడ్డి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## అక్కమ్మ దేవత ఆశీస్సులతో రాష్ట్రానికి సుభిక్షం కలగాలి

- మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి

**పుట్టపర్తి, ఆగస్టు 02, అనంత జనశక్తి న్యూస్**

రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉండాలని, కూటమి ప్రభుత్వం పై అక్కమ్మ దేవత ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రార్థించారు. పుట్టపర్తి మండలం సుబ్బరాయనిపల్లి అటవీ ప్రాంతంలోని ప్రసిద్ధ అక్కమ్మ దేవత ఆలయంలో ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరో 20 సంవత్సరాలు ప్రజలకు సేవలందించాలని, రాష్ట్ర అభివృద్ధి మరింత వేగంగా కొనసాగాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. అలాగే ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి నాయకత్వంలో పుట్టపర్తి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలవాలని ఆకాంక్షించారు.ఆలయానికి చేరుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డికి అక్కమ్మ దేవత ఆలయ పూజారులు, భక్తులు ఉరుములు, మేళతాళాల నడుమ ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎద్దుల బండిపై ఆలయ ప్రాంగణం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.కార్యక్రమంలో ఆలయ పూజారులు, టీడీపీ ప్రజాప్రతినిధులు, మండల కన్వీనర్ విజయ్ కుమార్, మాజీ జెడ్పీటీసీ శ్రీరామ్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ బొమ్మయ్య, నాగరాజు, పుల్లప్ప, మహేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పవు....

-పూలు, పండ్ల వ్యాపారులకు వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప హెచ్చరిక.

**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 2, అనంత జనశక్తి న్యూస్:**

ధర్మవరం పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా రహదారులు, కూడళ్లు, ఫుట్‌పాత్‌లపై పూలు, పండ్ల దుకాణాలు నిర్వహిస్తున్న వ్యాపారులు వెంటనే తమ దుకాణాలను నిర్ణీత ప్రదేశాలకు తరలించాలని వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప సూచించారు. పట్టణంలో వాహనాల రాకపోకలు సజావుగా సాగేందుకు వ్యాపారులు పోలీసు శాఖకు సహకరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా సిఐ రెడ్డప్ప మాట్లాడుతూ..... రహదారులను ఆక్రమించి వ్యాపారం నిర్వహించడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తడంతో పాటు ప్రమాదాలకు కూడా అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.పోలీసుల సూచనలను పాటించకుండా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా దుకాణాలు నిర్వహిస్తే సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి కోర్టు ద్వారా జరిమానాలు విధించబడతాయని సీఐ రెడ్డప్ప హెచ్చరించారు.ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ దృష్ట్యా ప్రతి వ్యాపారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, రహదారులను ఆక్రమించకుండా వ్యాపారం నిర్వహించడం ద్వారా పట్టణంలో ట్రాఫిక్ సమస్యల నివారణకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ తో పాటు ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.



# భార్యాభర్తలను రాజీ చేయడమే పోలీస్ ఫ్యామిలీ కౌన్సిలింగ్.




- సమస్యలను పరిష్కరించి వారిని రాజీ చేయడమే పోలీస్ ఫ్యామిలీ కౌన్సిలింగ్ లక్ష్యం..
- వన్టౌన్ సీఐ రెడ్డప్ప.

**ధర్మవరం ఆగస్టు 2, అనంత జనశక్తి న్యూస్:**

భార్యాభర్తల సమస్యలను పరిష్కరించి వారిని రాజీ చేయడమే పోలీస్ ఫ్యామిలీ కౌన్సిలింగ్ లక్ష్యము అని వన్టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లోని ఫ్యామిలీ కౌన్సిలింగ్ కార్యాలయంలో పాల్గొని, ఫ్యామిలీ కౌన్సిలింగ్ చేయు విధానాన్ని వారు వివరించారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఈ ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్లు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు 38 భార్యాభర్తల కేసులపై కౌన్సిలింగ్ నిర్వహించి ఆ జంటలను రాజీ చేసి కొత్త జీవితాన్ని ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఇషాక్, పోలీస్ ఫ్యామిలీ కౌన్సిలింగ్ సభ్యులు రిటైర్డ్ హెడ్మాస్టర్ చలపతి, లాయర్ బాలసుందరి, పాత్రికేయులు రాఘవ పాల్గొన్నారు.

# వాహనం దొంగ అరెస్ట్...

- ఆర్టీజీఎస్-365 సీసీ కెమెరాల సహకారంతో రెండు గంటల్లోనే వాహన దొంగ అరెస్ట్.
- దొంగిలించిన టీవీఎస్ ఎక్సెల్ స్వాధీనం.. వన్ టౌన్ సీఐ రెడ్డప్ప.

**ధర్మవరం ఆగస్టు 2, అనంత జనశక్తి న్యూస్:**




ఆగస్టు 1వ తేదీన ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో పార్క్ చేసి ఉంచిన టీవీఎస్ ఎక్సెల్ మోటారు వాహనం ను గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించుకుని వెళ్లినట్లు బాధితుడు వెంకట చలపతి వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సి ఐ రెడ్డప్ప తెలిపారు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ఫిర్యాదు అందుకున్న వెంటనే వన్ టౌన్ పోలీసులు అత్యంత వేగంగా స్పందించి, ఆర్టీజీఎస్365 సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టి, సీసీ కెమెరాల దృశ్యాలను క్షుణ్ణంగా పరిశీలించి నిందితుడిని గుర్తించి, సుమారు రెండు గంటల వ్యవధిలోనే అతడిని అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. నిందితుడి వద్ద నుంచి దొంగిలించబడిన టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. ఈ సందర్భంగా వన్ టౌన్ సీఐ రెడ్డప్ప మాట్లాడుతూ, ప్రజలు తమ వాహనాలను ఎల్లప్పుడూ సురక్షితమైన ప్రదేశాల్లో పార్క్ చేయాలని, వాహనాలకు లాక్‌లు తప్పనిసరిగా వేయాలని సూచించారు. అలాగే, అనుమానాస్పద వ్యక్తులు లేదా అనుమానాస్పద కదలికలు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రజల కంటి వెలుగే లక్ష్యంగా ఉచిత నేత్ర వైద్య శిబిరం



**ధర్మవరం ఆగష్టు 2 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం ప్రజలకు మెరుగైన నేత్ర వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ధర్మవరంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. బెంగళూరుకు చెందిన ప్రముఖ కంటి ఆసుపత్రి వైద్యుల బృందం శిబిరంలో పాల్గొని మొత్తం 75 మందికి కంటి పరీక్షలు నిర్వహించింది. పరీక్షల అనంతరం 39 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించి ఆపరేషన్ కోసం ఎంపిక చేశారు. అలాగే అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసి, కంటి సంరక్షణపై వైద్యులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని, ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వారికి నాణ్యమైన నేత్ర వైద్య సేవలు అందేలా నిరంతరం కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారావు, రాధాకృష్ణ, చాంద్ భాషా, జయరాం, వైకే శ్రీనివాస్, శీలా నాగేంద్ర, కేతా లోకేష్ తదితరులు పాల్గొని శిబిరం విజయవంతానికి సహకరించారు.

# భక్తి శ్రద్ధలతో దుర్గమ్మ తల్లికి బోనాల వేడుకలు

- శివరాం నగర్‌లో మహిళల ఘన పాల్గొనడం...
- ఆలయంలో ప్రత్యేక పూజలు...

**ధర్మవరం ఆగస్టు 2 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరంలోని శివరాం నగర్‌లో గ్రామదేవత శ్రీ దుర్గమ్మ తల్లికి ఆదివారం భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో కళకళలాడింది. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో అలంకరించుకుని తలపై బోనాలు మోసుకుంటూ భక్తి గీతాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని దుర్గమ్మ తల్లికి బోనాలను సమర్పించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బోనాల ఉత్సవాల్లో అధిక సంఖ్యలో మహిళలు, యువత, స్థానికులు పాల్గొని భక్తిపారవశ్యంలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోగా, కార్యక్రమం భక్తుల ఉత్సాహంతో విజయవంతంగా ముగిసింది.



# నెల్లూరులో ఘనంగా టిడిపి ప్రజల నమ్మకం ప్రచారం

- హాజరైన డాక్టర్ రెడ్డివారి గురవారెడ్డి
- 4వ డివిజన్‌లో ముమ్మరంగా ప్రజల నమ్మకం ఇంటింటి ప్రచారం
- సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేష్,నారాయణ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో.. డాక్టర్ రెడ్డివారి గురవారెడ్డి
- నెల్లూరులో ఘనంగా టిడిపి ప్రజల నమ్మకం ప్రచారం.
- సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే టిడిపి లక్ష్యం
- నెల్లూరు సమగ్ర అభివృద్ధికి మంత్రి నారాయణ కృషి ప్రశంసనీయం

**నెల్లూరు ఆగస్ట్ 02 అనంత జనశక్తి న్యూస్**



నెల్లూరు నగరంలోని 4వ డివిజన్ పరిధిలో తెలుగు దేశం పార్టీ...ప్రజల నమ్మకం పేరిట నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో అర్బన్ నియోజకవర్గ పరిశీలకులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రెడ్డివారి గురవారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆయన మంత్రి నారాయణను కలిసి పలు అభివృద్ధి, పార్టీ వ్యవహారాలపై చర్చించారు. అనంతరం ఈ డోర్‌టుడోర్ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ... గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ల సమర్థవంతమైన నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో దూసుకుపోతోందని స్పష్టం చేశారు. ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా అందరికీ వర్తించే తల్లికి వందనం, పెంచిన పింఛన్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ మరియు నిరుద్యోగ యువత కోసం జాబ్ క్యాలెండర్ ద్వారా డిఎస్సీ, కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ వంటి విప్లవాత్మక సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు వివరించి కరపత్రాలు అందజేశారు. ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని ప్రభుత్వం ద్వారా పరిష్కరించే బాధ్యతను టిడిపి తీసుకుంటుందని, స్థానిక మంత్రి నారాయణ ఆధ్వర్యంలో జరుగుతున్న నెల్లూరు సమగ్ర అభివృద్ధిని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు మామిడాల మధు, నాగూర్ డివిజన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి, డివిజన్ నాయకులు షఫీ, సుబ్బరత్నమ్మ, తాబీరా, ప్రదీప్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రజల మన్నలు పొందుతున్న... ఎల్.ఆర్.ఎఫ్

- ప్రభుత్వం గుర్తించకపోయినా... పేద కార్మికులకు వారి వంతుగా ఆర్థిక సహాయలు
- కార్మికుల హక్కుల కోసం పోరాడుదాం
- వ్యవస్థాపక అధ్యక్షులు పావగడ శ్రీరామ్ పూజారి ఎర్రి స్వామి కమిటీ సభ్యులు

**కళ్యాణదుర్గం ఆగస్టు 02 అనంత జనశక్తి న్యూస్**



ప్రభుత్వ ప్రైవేటు వ్యవస్థ ఏదైనా కార్మికులు లేనిదే అభివృద్ధి పథం లో సంస్థ నడవదు అలాంటి కార్మికులు వయస్సు వృద్ధాప్యం అయ్యి అనారోగ్య కారణాలతో మంచానికే పరిమితమైన పెయింటర్ భవన నిర్మాణ హోటల్ సప్లై ఆటో స్టీల్ ప్లాట్ వివిధ రంగాల కంపెనీలు పనిచేసే కార్మికులు మంచానికే పరిమితమైన వృద్ధాప్య పెన్షన్‌కే పరిమితం అయ్యారు. కొందరికి పెన్షన్ కూడా అందడం లేదు అనేకమైన కార్మికుల సమస్యల చూసి వారికి న్యాయం చేయాలని. కర్ణాటక రాష్ట్రం హైకోర్టు న్యాయవాది పావగడ శ్రీరామ్ లేబర్ రైట్స్ పోరం కార్మికుల సంఘం స్థాపించి కార్మికుల పక్షాన నిలబడి పారదర్శకమైన సేవలు అందిస్తూ నిరంతరం కార్మికుల సమస్యలపై పోరాడుతున్నారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గం లో ఎల్.ఆర్.ఎస్ నాయకులు పూజారి ఎర్రస్వామి ఆధ్వర్యంలో విరుపాపల్లి రమేష్ చంద్ర చారి సాకే తిప్పేస్వామి కనేకల్ ప్రకాష్ రాజశేఖర్ రవి సుగేపల్లి నారాయణ నారాయణపురం సతీష్ లక్ష్మీనారాయణ కమిటీ నాయకులు కార్మికుల సమస్యలు తెలుసుకుని న్యాయం జరిగే వరకు ఉద్యమాలు చేపడుతున్నారు.

**మంచానికే పరిమితమైన కార్మికులకు ఆర్థిక సహాయం**

నియోజకవర్గం లో కమిటీ ఏర్పడిన అతి తక్కువ కాలంలోనే కార్మికుల సమస్యలు పరిష్కార దిశగా పయనిస్తూ ప్రజల మందులు పొందుతూ నిరంతరం కార్మికులకు అండగా ఎల్.ఆర్.ఎఫ్ నాయకులు వారికి తోచిన ఆర్థిక సహాయం నిత్యవసర సరుకులు అందజేస్తూ మంచానికి పరిమితమైన పేద కార్మికులను ప్రభుత్వం గుర్తించి వారికి సముచితమైన న్యాయం చేయాలని వారు తెలిపారు. ప్రభుత్వం నుండి ఎలాంటి పథకాలు పొందని నిరుపేద కార్మికులను గుర్తించి త్వరలో ఒక కార్యక్రమం ఏర్పాటు చేస్తామని ఎల్.ఆర్.ఎఫ్ నాయకులు తెలిపారు. ఫోటో రైట్ అప్ 1.దుర్గం కమిటీ నాయకులు 2. కార్మికుడికి నిత్యావసర సరుకులు ఆర్థిక సహాయం అందజేత

# ఘనంగా టెట్ శిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమం




**కళ్యాణదుర్గం ఆగస్టు 02, అనంత జనశక్తి న్యూస్**

స్థానిక నార్త్ ప్రైమరి పాఠశాల నందు టెట్ ముగింపు శిక్షణ తరగతులు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. దాదాపుగా 33 రోజులు శిక్షణా తరగతులు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతిరోజు నార్త్ స్కూల్ ఆవరణములో శిక్షణ తరగతులు నిర్వహించబడినాయి కార్యక్రమానికి అధ్యక్షులుగా జిల్లా జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కె చిత్తప్ప అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయా నంద్ ముఖ్య అతిథిగా హాజరైనారు ఆయన మాట్లాడుతూ శిక్షణా తరగతులు ఈ విధంగా నిర్వహించడం చాలా ఆనందంగా ఉన్నదని ఇలాంటి కార్యక్రమాలు జన విజ్ఞాన వేదిక ద్వారా
ఏర్పాటు చేయడం సంతోషం ఇలాంటి అనేక సామాజిక కార్యక్రమాలు జరపడం అందుకు మా జిల్లా అధ్యక్షుడు కె చితప్పను అభినందిస్తున్నానని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం గేయానంద్,జిల్లా విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కె చిత్తప్ప, జన విజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షులు మల్లికార్జున, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి పాతిరెడ్డి, సిపిఎస్ సంఘ జిల్లా అధ్యక్షులు జగదీష్,టి ఎన్ యు ఎస్ నాయకులు మరియు స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షులు నరసింహులు, ఆర్ డి టి సెట్ కన్వీనర్ అశోక్ బాబు, యుటిఎఫ్ కళ్యాణదుర్గం మండల అధ్యక్షులు యు గోవిందరాజులు, యుటిఎఫ్ శెట్టూరు మండల అధ్యక్షులు తిప్పేస్వామి, బ్రహ్మసముద్రం యుటిఎఫ్ మండల అధ్యక్షులు జే రామాంజనేయులు,స్థానిక విశ్రాంత ఉద్యోగుల ప్రధాన కార్యదర్శి ఎం తిప్పేస్వామి, రాష్ట్ర వినియోగదారుల సంఘం అధ్యక్షులు చల్లా కిషోర్, జన విజ్ఞాన వేదిక తాలూకా కార్యదర్శి డి శ్రీనివాసులు, జన విజ్ఞాన వేదిక ఆస్థాన గాయకులు భగవాన్ దాస్ లక్ష్మీనారాయణ బాలు
నయోమి వందన సంగీత అశ్విని సుధా తిమ్మన్న గోవిందప్ప రాజన్న రోజిలి రాజేష్ గణేష్, తదితరులు పాల్గొన్నారు. ఫోటో రైట్ అప్ 1. కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉద్యోగులు

# సమగ్ర శిక్ష ఉద్యోగులకు... జీతాలు అందక శిక్ష...!!

- సమగ్ర శిక్ష ఉద్యోగులకు జీతాలు లేక ఇక్కట్లు..
- 28 జిల్లాల్లో సుమారు 23 వేల మంది సమగ్ర శిక్ష ఉద్యోగులకు రెండు నెలలుగా జీతాలు లేక ఆకలి కేకలు.
- కుటుంబాలు ఆర్థిక సంక్షోభంలో, ప్రభుత్వాన్ని వేడుకుంటున్న ఉద్యోగులు

**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి,**
**ఆగస్టు 2, అనంత జనశక్తి న్యూస్:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో 28 జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న సుమారు 23 వేల మంది సమగ్ర శిక్ష ఉద్యోగులు గత రెండు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అసెంబ్లీ సాక్షిగా విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ప్రతి ఉద్యోగికి మొదటి తేదీన జీతాలు వేస్తున్నామని ఉపన్యాసాలు ఇస్తున్న,దానికి విరుద్ధంగా వాస్తవ పరిస్థితి ఉంది.ప్రభుత్వ విద్యా వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న ఈ ఉద్యోగులు నేడు తమ కుటుంబాల జీవనోపాధి కోసం అప్పులు చేయాల్సిన దుస్థితిలో ఉన్నారు.
వేతనాల కోసం ఎదురుచూస్తున్న వారిలో కేజీబీవీ టెక్నికల్ స్టాఫ్, కేజీబీవీ నాన్ టెక్నికల్ స్టాఫ్, క్లస్టర్ రిసోర్స్, మొబైల్ టీచర్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, తదితర విభాగాల ఉద్యోగులు ఉన్నారు. వీరంతా ప్రభుత్వ విద్యా వ్యవస్థలో అత్యంత కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ, వేతనాలు అందక తీవ్ర అవస్థలు పడుతున్నారు.
ప్రతి నెల జీతంపైనే ఆధారపడి జీవిస్తున్న వేలాది కుటుంబాలు నేడు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. ఇంటి అద్దెలు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నారు. బ్యాంకు రుణాలు, వ్యక్తిగత రుణాల ఈఎంఐలు నిలిచిపోతున్నాయి. పిల్లల స్కూల్, కాలేజీ ఫీజులు చెల్లించలేక తల్లిదండ్రులు తీవ్ర




మనోవేదనకు గురవుతున్నారు. ఇంట్లో వృద్ధుల వైద్య ఖర్చులు, గర్భిణీల చికిత్సలు, చిన్నారుల అవసరాలు కూడా తీర్చలేని పరిస్థితి ఏర్పడింది.
చాలామంది ఉద్యోగులు బంధువులు, స్నేహితుల వద్ద అప్పులు తీసుకొని జీవనం సాగిస్తున్నారు. కొందరు ఇంటిలో వస్తువులు తాకట్టు పెట్టగా, మరికొందరు వడ్డీకి అప్పులు తెచ్చుకొని కుటుంబాలను పోషిస్తున్నారు. నిత్యావసర సరుకులు కొనుగోలు చేయడానికి కూడా డబ్బు లేక అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.
అనేక మంది సమగ్ర శిక్ష ఉద్యోగుల కుటుంబాల్లో వృద్ధ తల్లిదండ్రులు ఉన్నారు. వారికి వయోభారం కారణంగా నిరంతర వైద్య సేవలు, మందులు,అవసరమవుతున్నాయి. అయితే రెండు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఆ వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితి ఏర్పడింది. మరోవైపు, సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఈ చిరు ఉద్యోగుల్లో చాలామంది వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల పరిధిలోకి కూడా రారు. ఫలితంగా జీతమే వారి కుటుంబాలకు ఏకైక జీవనాధారంగా మారింది. ఆ జీతాలు కూడా నెలల తరబడి అందకపోవడంతో వృద్ధుల వైద్యం, పిల్లల చదువులు, కుటుంబ పోషణ, ఇంటి అద్దెలు, రుణాల చెల్లింపులు అన్నీ సంక్షోభంలోకి నెట్టబడ్డాయి. ప్రభుత్వ విద్యాభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తున్న ఈ ఉద్యోగుల కుటుంబాలు నేడు తీవ్రమైన ఆర్థిక, మానసిక వేదనను అనుభవిస్తున్నాయి.ఇంతటి క్లిష్ట పరిస్థితిలో కూడా సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ విధులను నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా కార్యక్రమాలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల నిర్వహణ, ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు సేవలు, విద్యా సర్వేలు, డేటా నిర్వహణ, శిక్షణా కార్యక్రమాలు, ప్రభుత్వ ఆదేశాల అమలు వంటి బాధ్యతలను నిరంతరం నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వ విద్యకు సేవలందిస్తున్న ఉద్యోగులకు సమయానికి జీతాలు అందకపోవడం అత్యంత బాధాకరమైన విషయం.
ఉద్యోగ సంఘాలు పలుమార్లు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ, సమస్యకు స్పష్టమైన పరిష్కారం లభించలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజులు గడుస్తున్న కొద్దీ ఉద్యోగుల్లో ఆందోళన పెరుగుతోంది. ఈ పరిస్థితి కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందని వారు చెబుతున్నారు.
ప్రభుత్వం ఈ అంశాన్ని కేవలం పరిపాలనా సమస్యగా కాకుండా 23 వేల కుటుంబాల జీవనాధారానికి సంబంధించిన అత్యవసర మానవతా సమస్యగా గుర్తించాలని ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలను విడుదల చేయడంతో పాటు, ఇకపై ప్రతి నెలా నిర్దిష్ట తేదీన జీతాలు చెల్లించే శాశ్వత వ్యవస్థను అమలు చేయాలని వారు కోరుతున్నారు.
రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను ముందుకు నడిపిస్తున్న వేలాది మంది ఉద్యోగుల జీవితాలు ఇలాంటి అనిశ్చితిలో ఉండటం సమాజానికి ఆందోళన కలిగించే విషయం. ఈ ప్రజా ప్రయోజన అంశాన్ని మీడియా వారు విస్తృతంగా ప్రచారం చేసి, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకునేలా చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### రియాక్ట్ ఎయిర్ అంబులెన్స్ తో
# ప్రపంచవ్యాప్త సేవలు




**- 'ఆటా' తెలుగు సభల్లో ప్రముఖుల ప్రశంసలు**

**మేరీ ల్యాండ్ ఆగస్టు 02 అనంత జనశక్తి న్యూస్**

తెలుగు రాష్ట్రాలకే పరిమితమైన మొట్టమొదటి ఎయిర్ అంబులెన్స్ సేవలను 'రియాక్ట్' సంస్థ ఆధ్వర్యంలో ఇకపై ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి రానుండడం అభినందనీయమని పలువురు ప్రముఖులు కొనియాడారు. అమెరికా తెలుగు సంఘం (ఏటీఏ) 19వ వార్షిక మహాసభల ముగింపు వేడుకలు యూఎస్‌లోని మేరీల్యాండ్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిర్ అంబులెన్స్ ప్రత్యేక అత్యాధునిక వైద్య సేవల గురించి అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరానికి స్థానిక ప్రముఖులు, ప్రవాస భారతీయుల నుంచి విశేష ఆదరణ లభించింది. రియాక్ట్ ఎయిర్ అంబులెన్స్ వినూత్న సేవల గురించి తెలుసుకుని వారు ఆశ్చర్యానందాలు వ్యక్తం చేశారు. ఈ ప్రత్యేక వైద్య వేదికను పలువురు సీనియర్ నేతలు, వైద్య నిపుణులు, సినీ ప్రముఖులు సందర్శించి.. .. 'రియాక్ట్' సేవలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. అమెరికా నుంచి తెలుగు రాష్ట్రాలకు, ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు 24x7 అందుబాటులో ఉండే ఈ వైద్య సర్వీసు పనితీరు గురించి రియాక్ట్ సంస్థ అధినేత డాక్టర్ నీల్ రోహిత్ రెడ్డి లైవ్ డెమో ద్వారా వివరించారు. ఒక్క క్షణం ఆలస్యమైనా... ప్రాణాలకు ప్రమాదం... అందుకే అమూల్యమైన క్షణాల్లో ప్రాణాలు కాపాడటమే తమ లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో 'రియాక్ట్' సంస్థ అంతర్జాతీయ ప్రతినిధులు యన్నంరెడ్డి వినీలారెడ్డి, ఉత్తర అమెరికా ప్రధాన కార్యదర్శి సుకుమార్ రెడ్డి ఎయిర్ అంబులెన్స్ ఏ విధంగా ప్రాణాలను గగనమార్గంలో రక్షిస్తుందో... అందులోని అత్యాధునిక టెక్నాలజీ, ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయు) ఏర్పాట్లను సవివరంగా వెల్లడించారు. తెలుగు ప్రజలు మాత్రమే కాకుండా.. అక్కడి అమెరికన్ ప్రతినిధులు కూడా ఈ వ్యవస్థ పట్ల ప్రత్యేక ఆసక్తిని కనబరిచారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రముఖ శతావధాని, సాహితీవేత్త నరాల రామారెడ్డి రియాక్ట్ సేవలను అద్భుతమైన ఉపమానాలతో కొనియాడారు. ఆయన మాట్లాడుతూ.. "రోగికి సమయమే అమృతం. ఈ సంస్థ ఆ అమృతాన్ని అందించే దివ్యౌషధం" అంటూ 'రియాక్ట్' సంస్థ అధినేతపై ప్రశంసల వర్షం కురిపించారు. అంతర్జాతీయ స్థాయిలో తెలుగు వారి ఔన్నత్యాన్ని చాటుతూ, రియాక్ట్ ఎయిర్ అంబులెన్స్ ప్రాణాధారమైన అవసరంలో భరోసానిచ్చే 'గగన సైన్యం'గా అవతరిస్తోందని సందర్శకులు అభిప్రాయపడ్డారు. ఈ ఎయిర్ అంబులెన్స్ సేవల ప్రత్యేక కార్యక్రమానికి 'ఆటా' మహాసభల్లోనే కాక, సోషల్ మీడియాలోనూ ప్రశంసలు అందుకుంటోంది. ఇక ముందు తెలుగువారి ఆరోగ్య రక్షణ కోసం ఇది ఎంతో కీలకమైన మైలురాయి అని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ , ఆమని, అసోసియేట్ డైరెక్టర్లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, రియాక్ట్ ఎయిర్ అంబులెన్స్ అమెరికా సంయుక్త రాష్ట్రాలు ప్రతినిధులు డాక్టర్ యెన్నంరెడ్డి లావణ్యరెడ్డి (ఆపరేషన్స్) తదితరులు పాల్గొన్నారు.




# ఫ్యామిలీకి 10 కిలోలు

(మొదటిపేజీ తరువాయి)

బహిరంగ మార్కెట్ లో కిలోకు సుమారు రూ.10 వరకు ధరలు పెరిగినట్లు గుర్తించారు. దీంతో ఆంధ్రప్రదేశ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌తో కలిసి తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం సరఫరా నిర్ణయం తీసుకుంది సర్కార్. బీపీటీ స్టీమ్ రైస్‌ను రూ.64-65 నుంచి తగ్గించి రూ.52కే అందుబాటులోకి తీసుకువచ్చింది. ఒక్క కుటుంబానికి 10 కిలోల వరకు ఈ ధరకు బియ్యం కొనుగోలు అవకాశం ఉంటుంది. బీపీటీ పచ్చి బియ్యం రూ.58-60 నుంచి తగ్గించి రూ.50కే విక్రయిస్తున్నారు. సబ్సిడీ ధరల విక్రయాలు రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 2 నుంచే ప్రారంభం అయ్యాయి. రాష్ట్రంలోని రైతు బజార్లు, రైస్‌మిల్ అవుట్‌లెట్ల ద్వారా విస్తృతంగా సరఫరా జరుగుతుంది. బహిరంగ మార్కెట్ ధరలపై నియంత్రణ సాధించడమే లక్ష్యమని ఏపీ ప్రభుత్వం పేర్కొంది. దేశంలోనే తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం అందించే ప్రత్యేక కార్యక్రమంపై జనాలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం కావాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. కందిపప్పు, పామాయిల్ ధరల నియంత్రణపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టింది. వినియోగదారుల ప్రయోజనాలే లక్ష్యంగా నిరంతర చర్యలు కొనసాగుతాయని మంత్రి నాదెండ్ల అన్నారు. 'ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 650 కేంద్రాల ద్వారా తక్కువ ధరకే బియ్యం విక్రయాల కార్యక్రమాన్ని విజయవాడ APIIC రైతు బజార్‌లో ప్రారంభించాం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మార్గదర్శకత్వంలో ప్రజలపై ధరల భారాన్ని తగ్గించి, నాణ్యమైన బియ్యాన్ని అందుబాటు ధరల్లో అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. దేశంలోని అనేక ప్రాంతాల్లో ఇదే రకం బియ్యం కిలో రూ.60-62కు విక్రయమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కేవలం రూ.50-52కే నాణ్యమైన బియ్యాన్ని అందుబాటులోకి తీసుకురావచ్చాం.' అని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.



# తల్లికి వందనం...





**ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం తల్లికి వందనం నుండి రూ. 2వేలు కోత విధిస్తే....ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల నుండి కూడా అదే మొత్తాన్ని వసూలు చేస్తున్నారు. మరి ఆ నిధుల వినియోగం ఎక్కడ అన్నదే నేటి మన "అనంత జనశక్తి" వార్తా కథనం**

**- పాఠశాలల్లో వేధిస్తున్న మౌలిక సమస్యలు...**
**- మౌలిక వసతుల నిధులు రూ. 2వేలు ఎక్కడ...?**
**- ఆగిన నాడు -నేడు పనులు**
**- దర్శనమిస్తున్న మొండి గోడలు**
**- నిధులు లేవంటున్న అధికారులు....**

**అనంతపురం/ సత్యసాయి జిల్లా,**

**ఆగష్టు 02, అనంత జనశక్తి న్యూస్ ;**

నాడు అమ్మ ఒడి నేడు తల్లికి వందనం పథకం పేర్లు ఏవైనా ఉద్దేశం మాత్రం ఒకటే చదువు పిల్లల హక్కు. బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలన్న ఉద్దేశంతో ఈ పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టాయి. ఇందుకోసం ప్రతి ఏటా ప్రతి విద్యార్థికి రూ. 15వేలు చొప్పున ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తుంది. ఇందులో రూ. 2వేలు పాఠశాలల అభివృద్ధి కోసం కేటాయిస్తారు. ప్రభుత్వం చెప్పిన లెక్క ప్రకారం ఈ కోత విధించిన రూ. 2వేలు జిల్లా కలెక్టర్ ప్రత్యేక ఖాతాకు బదలాయించి జిల్లాలోని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు వినియోగించాలి.

**కానీ వాస్తవ పరిస్థితి ఏంటి?**

గత వైసిపి ప్రభుత్వంలోనూ, ప్రస్తుత టిడిపి ప్రభుత్వంలోనూ విద్యార్థుల నుండి రూ.కోట్ల రూపాయలు కోత విధించారు. మరి ఆ నిధుల ఖర్చు ఎక్కడ..? ఏ పాఠశాలలో చూసినా మౌలిక వసతుల సమస్యలు రాజ్యమేలుతున్నాయి. బెంచీలు లేవు, వ్యక్తిగత మరుగుదొడ్ల కొరత, గదులు అసంపూర్తి నిర్మానాలు. విద్యార్థులు నేలపై కూర్చుని చదువుకునే దుస్థితి ఇలా అనేక సమస్యలకు ప్రభుత్వ పాఠశాలలు దర్పణం పడుతున్నాయి.

**కోత నిధుల వ్యయంపై అనేక ప్రశ్నలు**

ప్రభుత్వం ప్రతి విద్యార్థి నుండి పాఠశాలల మౌలిక వసతుల కోసం తీసుకుంటున్న రూ. 2వేల పై అనేక ప్రశ్నలు, అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉదాహరణకు ఓ ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో 110 మంది విద్యార్థులు ఉన్నారు.ఈ విద్యార్థులను మొత్తం మీద రూ. 2లక్షల20 వేలు ప్రభుత్వం కోత వేధించడం జరుగుతుంది . ఈ నిధులలో పాఠశాలలో కేవలం కసువు నూకెందుకు (స్వీపర్) కు నెలకు రూ. 6వేలు చొప్పున చెల్లిస్తారు. అంతే రూ. 72వేలు, అదనంగా స్వీపర్ కు అవసరమైన యాసిడ్, ఫినాయిల్ మిగిలిన సామాగ్రిని అందజేయడం జరుగుతుంది. వీటికే రూ. 2లక్షల 20వేలు ఖర్చు అవుతుందా అన్నదే ప్రశ్న...?

**ప్రైవేటు పాఠశాలల పరిస్థితి ఏమిటి**

ఇదంతా ఇలా ఉంటే ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థుల నుండి తీసుకుంటున్న రూ. 2వేలు నిధులపై మరిన్ని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు సొమ్మును ఆయా పాఠశాలల మౌలిక వసతులకు వినియోగిస్తే మరి ప్రైవేటు పాఠశాలల చెందిన విద్యార్థుల సొమ్ము ఎక్కడ....? ఎందుకు, దేని కోసం వినియోగిస్తున్నారు అన్నదే శతకోటి ప్రశ్న. అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాలలతో పోలిస్తే ప్రైవేటు పాఠశాలల్లోనే అధిక మొత్తంలో విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండం మరో విశేషం.



**ఆగిన నాడు నేడు పనులు**

గత వైసీపీ ప్రభుత్వంలో నాడు నేడు పేరుతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కంకణం కట్టుకుంది. ఇందులో మొదటి విడతలో మంజూరైన పనులు పూర్తవగా, రెండో విడతలో మంజూరైన పనులు మాత్రం ఎక్కడికి అక్కడ ఆగిపోయాయి. దీంతో అసంపూర్తిగా జరిగిన నిర్మాణాలు మొండి గోడలను దర్శనమిస్తున్నాయి. గదుల కొరత, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు ఆగిపోవడంతో చాలా పాఠశాలల్లో మౌలిక వసతులు కొరతతో విద్యార్థులు, అటు ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

**సత్యసాయి జిల్లాలో**

జిల్లా వ్యాప్తంగా 32 మండలాలు, 6 మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇందులో మొత్తం 2,56,956 మంది విద్యార్థులు ఉండగా వీరిలో 1,41,173 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలోనూ, 1,15,783 మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు.

**అనంతరం జిల్లాలో**

జిల్లాలో ఒక మున్సిపల్ కార్పొరేషన్, 5 మున్సిపాలిటీలు, 31 మండలాలు ఉండగా ఇందులో దాదాపు 4లక్షలకు పైగా విద్యార్థులు వివిధ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారు.



**సింగనమల నియోజకవర్గం లో**

**నియోజకవర్గంలో వ్యాప్తంగా నాడు-నేడు పనులు ఎక్కడికక్కడ ఆగిపోవడంతో విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం యల్లనూరు మండలంలో యల్లనూరు, వెన్నపూస పల్లి, కేజీబీవీ పాఠశాల, గొడ్డుమర్రి, నీర్జంపల్లి పాఠశాలలో మంజూరైన ఆదనపు గదుల నిర్మాణాలు ఆగిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. యల్లనూరులోని పేట పాఠశాలలో గదుల కొరతతో ఒకే పాఠశాలలో రెండు తరగతులను నిర్వహిస్తుండగా, ఇందులో కొందరు విద్యార్థులు బల్లల మీద, మరికొందరు నేల మీద కూర్చుని విద్యను అభ్యసించాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే ఇదే పాఠశాలలో వ్యక్తిగత మరుగుదొడ్లు నిధుల కొరతతో అర్ధాంతరంగా ఆగిపోవడంతో విద్యార్థులు మలవిసర్జనకు ఆరు బయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే కూచివారి పల్లి పాఠశాలకు ప్రహరీ నిర్మాణం లేకపోవడంతో పాటు పాఠశాల మౌలిక వసతులలో భాగంగా వ్యక్తిగత మరుగుదొడ్లు పాఠశాలకు రంగులు వేసే పనులు ఆగిపోయాయి. పుట్లూరు మండలంలో చాలా పాఠశాలలో పరిస్థితి తీవ్ర ఇబ్బందికరంగా ఉంది. కేజీబీవీ కడవకల్లు, ఎల్లుట్ల జిల్లా పరిషత్ పాఠశాలలో అదనపు గదులు నిర్మాణాలు ఆగిపోయాయి. కొండాపురం, సూరే పల్లి, గొల్లపల్లి, కడవకల్లు పాఠశాలల్లో మౌలిక వసతులలో భాగంగా సగం పనులు పూర్తయి, మిగిలిన పగులు పనులు నిధులు లేక ఆగిపోవడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు.**

# ఘనంగా పల్లె సింధూర రెడ్డి,జన్మదిన వేడుకలు

**- భారీగా తరలివచ్చిన టిడిపి అభిమానులు.**

**అమడగూరు ఆగస్టు 02,అనంత జనశక్తి న్యూస్ )**

మండల పరిధిలోని స్థానిక బస్టాండ్ కూడలి స్వర్గీయ నందమూరి ఎన్టీఆర్ విగ్రహం దగ్గర,పుట్టపర్తి శాసన సభ్యురాలు శ్రీమతి పల్లె సింధూర రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా, కార్యకర్తలు అభిమానులు నాయకులు మధ్యలో నిర్వహించారు అనంతరం కేక్ కట్ చేసి అభిమానులకు కార్యకర్తలకు గ్రామస్తులకు పంచిపెట్టారు ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు కార్యకర్తలు మాట్లాడతూ రాష్ట్ర చరిత్రలో అతి చిన్న వయసులో శాసనసభ్యురాలుగా గెలుపొంది అసెంబ్లీలో పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తూ పుట్టపర్తిని అన్ని విధాలుగా ముందంజలో నడిపిస్తున్న పుట్టపర్తి శాసన సభ్యురాలు శ్రీమతి పలె సింధూర రెడ్డి జన్మదిన వేడుకలను మనం అందరం జరుపుకోవడం మన అదృష్టమని అలాగే మాజీ మంత్రివర్యులు పుట్టపర్తి నియోజకవర్గం ఇంచార్జ్ పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో మనమందరం రాబోవు రోజుల్లో కలిసిమెలిసి ఒక తాటిపై నడవాలని కేవలం పుట్టపర్తి నియోజకవర్గం అభివృద్ధి చేసే నాయకుడు పల్లె రఘునాథ్ రెడ్డి అని వారి కుటుంబం నుండి వచ్చిన పల్లె సింధూర రెడ్డికి మనమందరం రుణపడి ఉండాలని రాబోవు రోజుల్లో శాసనసభ్యులు పల్లె సింధూర రెడ్డి మనందరికీ మరెన్నో సంక్షేమ పథకాలు సోలార్ మరియు ఇతర కంపెనీలను తెస్తున్నందుకు ప్రతి ఒక్క కుటుంబం పల్లె కుటుంబ సభ్యులకు రుణపడి ఉండాలని వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో కన్వీనర్ గోపాల్ రెడ్డి,రాష్ట్ర డైరెక్టర్ కాలే నాయక్ మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి మాజీ కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి సీనియర్ నాయకులు రఘువీరారెడ్డి ఇందుకూరి కుమార్,రెడ్డి,ఏ రామాంజులు, మాజీ సర్పంచ్ షబ్బీర్ మురళి స్వామి మాజీ సర్పంచ్ కాసుల వెంకటరమణ డీలర్లు గాయత్రి ఓ బాలకృష్ణ డి, రమణప్ప, కృష్ణారెడ్డి రామచంద్ర వలిపి కృష్ణప్ప విశ్వనాథ్ రెడ్డి తదితర పార్టీ కార్యకర్తలు నాయకులు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు



# గంగమ్మకు పూజలు....

**యల్లనూరు, ఆగస్టు 2, అనంత జనశక్తి న్యూస్;**

మండలంలోని నీర్జాంపల్లె గ్రామంలో ఆదివారం గ్రామంలో వెలిసిన గంగమ్మ తల్లికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులంతా కలిసి అమ్మవారికి చీర, సారే, బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయితే సకాలంలో వర్షాలు పడక పంటలు ఇబ్బందికరంగా మారడంతో పాటు వర్షాభావం వలన పొలాల్లో పంటలను సాగు చేయలేకపోయామని, వర్షం కోసమే ఈ పూజలు నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు.



# మత్తు రహిత సమాజమే లక్ష్యం




- నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్
- మంత్రి నారా లోకేశ్ వెల్లడి
- జాతీయ ఉద్యమంగా నిర్వహించాలని ప్రధాని పిలుపు

అనంతపురం, ఆగస్టు 02 : అనంత జనశక్తి న్యూస్

మత్తు రహిత సమాజమే లక్ష్యంగా నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. డ్రగ్స్ నిర్మూలనపై దేశవ్యాప్తంగా వంద వారాల కార్యక్రమాన్ని జాతీయ ఉద్యమంగా నిర్వహించాలని ప్రధాని పిలుపు ఇచ్చారని చెప్పుకొచ్చారు. ఈ జాతీయ ఉద్యమంలో అందరం భాగమవుదామని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 'డ్రగ్స్ వద్దు బ్రో' పేరుతో ఎన్నో చైతన్య కార్యక్రమాలు నిర్వహించామని ప్రస్తావించారు. ఈగల్ అనే ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సమాజ భాగస్వామ్యంతో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కోసం అలుపెరుగని కృషి చేస్తున్నామని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

# దుర్గగుడిలో ఇన్‌స్టా రీల్ కలకలం



- యువతిపై పోలీసులకు ఫిర్యాదు
- ఆచారాలు, సంప్రదాయాలకు విరుద్ధంగా..
- వ్యవహరించిందని ఆరోపిస్తూ యువతిపై
- విజయవాడ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు

అనంతపురం, ఆగస్టు 02 : అనంత జనశక్తి న్యూస్

ఇంద్రకీలాద్రిపై ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చేసిన యువతిపై ఆలయ అధికారులు సీరియస్ అయ్యారు. దేవస్థానం ఆచారాలు, సంప్రదాయాలకు విరుద్ధంగా వ్యవహరించిందని ఆరోపిస్తూ యువతిపై విజయవాడ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల దుర్గామాత ఆలయంలోని మహామండపం ఏడో అంతస్తు రాజగోపురం వద్ద ఓ అపరిచిత యువతి డ్యాన్స్ చేస్తూ ఇన్‌స్టాగ్రామ్ రీల్ చిత్రీకరించింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో భక్తులు, ప్రజల నుంచి పెద్దఎత్తున అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. మరోవైపు, ఈ విషయం ఆలయ అధికారుల దృష్టికి వెళ్లింది.
దేవస్థానం ఈవో వి.కె.శీనా నాయక్ ఆదేశాల మేరకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆదివారం ఉదయం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోకు అధికారికంగా ఫిర్యాదు చేశారు. సదరు యువతి జులై 30న మధ్యాహ్నం 1:45 గంటల నుంచి 1:47 గంటల మధ్య వీడియో చిత్రీకరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సుమారు రెండు నిమిషాల పాటు ఆమె వీడియో చిత్రీకరించి తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్టు చేసినట్లు తెలిపారు. దేవదాయ శాఖ నిబంధనలు, ఆలయ పవిత్రతకు ఇది పూర్తిగా విరుద్ధమని దేవస్థానం అధికారులు స్పష్టం చేశారు. ఈ మేరకు యువతిని గుర్తించి, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను అధికారులు కోరారు. ఆలయ పవిత్రతను దెబ్బతీసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని తేల్చిచెప్పారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు చేపడతామని ఆలయ అధికారులు పేర్కొన్నారు.

# సీజేపీ భవిష్యత్ కార్యాచరణ ఆగస్టు 5న కీలక సమావేశం



అనంతపురం, ఆగస్టు 02 : అనంత జనశక్తి న్యూస్

కాక్రోచ్ జనతా పార్టీ తదుపరి కార్యాచరణపై దృష్టి సారించింది. పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే నివాసంలో (మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్) ఈ నెల 5న కోర్ కమిటీ సమావేశం జరగనుంది. వాలంటీర్లు, విద్యార్థుల అభిప్రాయాలను సేకరించి సమావేశానికి రావాలని సభ్యులు నిర్ణయించుకున్నారు. ఈ ఉద్యమాన్ని క్షేత్రస్థాయికి ఎలా తీసుకెళ్లాలి, విద్యార్థులపై నమోదైన కేసుల ఉపసంహరణ విషయమై కేంద్రంపై ఎలా ఒత్తిడి తీసుకురావాలనే అంశాలపై ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది. అనంతరం విలేకరుల సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నారు. ఇదిలా ఉండగా స్నేహితుల దినోత్సవం సందర్భంగా చిన్నారులతో కలిసి దీప్కే ఆదివారం వేడుకలు నిర్వహించారు

### నీట్ ఎఫెక్ట్.. రూ.7.5 కోట్లతో భద్రతకు టెండర్ల ఆహ్వానం

**నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ వివాదం నేపథ్యంలో ఎన్‌టీఏ పరీక్షల భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తోంది. ప్రధాన కార్యాలయం, ప్రాంతీయ కార్యాలయాలు, సర్వర్ గదులు, స్ట్రాంగ్‌రూమ్‌లు, ప్రశ్నపత్రాల నిల్వ కేంద్రాలకు 24 గంటల భద్రత కల్పించేందుకు సుమారు రూ.7.5 కోట్లతో టెండర్‌ను ఆహ్వానించింది. రెండేళ్ల పాటు అమలయ్యే ఈ ఒప్పందానికి ఆగస్టు 17 వరకు బిడ్లు స్వీకరించనుంది. భద్రతతో పాటు హౌస్‌కీపింగ్, సెక్యూర్ ప్రింటింగ్ (అత్యంత సురక్షితంగా ప్రశ్నపత్రాల ముద్రణ) కోసం టెండర్లను ఆహ్వానిస్తోంది.**

# వైభంగా జరిగిన అక్క దేవతల పరస

- గ్రామీణ సంస్కృతి, సంప్రదాయలను ఇలాగే కనసాగించాలి......
- మాజీ మంత్రి పల్లె...

పుట్టపర్తి రూరల్ ఆగష్టు 02 అనంత జన శక్తి న్యూస్.



గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఎడ్లబండ పోటీలు, ఉత్సవాలు, ఊరేగింపులు, జాతరలను, కళావృత్యాలు నాటకాలు, నాటి సంస్కృతిని సాటి చెప్పే చిహ్నాలని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన ఆదివారం పుట్టపర్తి మండల పరిధిలోని సుబ్బరాయునిపల్లి గ్రామంలో నిర్వహించిన అక్కమ్మ గార్ల పరస మహోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. రాష్ట్రంలో వర్షాలు సంవృద్ధిగా కురిసి ప్రజలు సుఖ శాంతులతో జీవించాలని కోరుకున్నారు. సుబ్బరాయనిపల్లి గ్రామ అటవీ ప్రాంతంలోని ప్రసిద్ధ అక్కమ్మ దేవత ఆలయంలో నియోజవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి జన్మదినం సందర్భంగా అక్కమ్మ దేవాలయాల్లో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు నిర్వహించిన ఆయన, రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు.
పుట్టపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి నాయకత్వంలో అన్ని విధాలుగా అభివృద్ధి చెంది అన్ని రంగాల్లో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలవాలని ప్రత్యేకంగా మొక్కుకున్నట్లు తెలిపారు.
ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డికి అక్కమ్మ దేవత ఆలయ పూజారులు, భక్తులు ఉరుములు, మేళతాళాల నడుమ ఘన స్వాగతం పలికారు. అనంతరం సంప్రదాయబద్ధంగా ఎద్దుల బండిపై ఆలయ ప్రాంగణం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు, టీడీపీ ప్రజాప్రతినిధులు మండల కన్వీనర్ సహకార సొసైటీ అధ్యక్షులు విజయ కుమార్ ,మాజీ జెడ్పీటీసీ శ్రీరామ్ నాయక్ , ఆకుల కుల్లాయప్ప శివప్ప, డాక్టర్ రాఘవేంద్ర, భాస్కర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బొమ్మయ్య, నాగరాజు,పుల్లప్ప ,మహేష్ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామస్థాయిలో విశ్వబ్రాహ్మణుల సమస్యలు పరిష్కరిస్తాం

- విశ్వబ్రాహ్మణ సంఘం సీనియర్ నాయకులు
- ప్రభుత్వంతో మాట్లాడి వృత్తిదారులకు రుణ సదుపాయం ఏర్పాటు చేస్తాం
- ఉమ్మడి జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా కన్వీనర్ గా విబి భాస్కర్ బాబు

అనంతపురం, ఆగస్టు 02 : అనంత జనశక్తి న్యూస్



గ్రామస్థాయిలో అన్యాయం అవుతున్న పేద విశ్వబ్రాహ్మణులని వారి సమస్యలను ఎలుగెత్తి చాటాలన్న ఆలోచనతో ఉమ్మడి జిల్లా మొత్తం అన్ని నియోజకవర్గాలకు బలమైన జిల్లా నాయకత్వాలు కావలసిన అవసరం ఉందని విశ్వబ్రాహ్మణ సంఘం సీనియర్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా సీనియర్ విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, అనంతపురం శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం ధర్మకర్తలు బ్రహ్మశ్రీ పేరుసోమల గురు ప్రసాద్ ఆదేశాల మేరకు ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించిన విశ్వబ్రాహ్మణలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు కార్యక్రమం ఆలయ గౌరవాధ్యక్షులు ఎస్ఆర్ నాగభూషణం అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర స్వర్ణకార సంఘం ఉపాధ్యక్షులు ధనలకోట వాసు, రాష్ట్ర కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు తాటికొండ రంగబాబు, జిల్లా పరిశ్రమల కేంద్రం ప్రమోషన్ ఆఫీసర్ యశ్వంత్, ఉమ్మడి జిల్లాలోని వివిధ నియోజకవర్గాల మండలాల మాజీ అధ్యక్ష కార్యదర్శులు, సీనియర్ నాయకులు, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాన్ని తన భుజస్కందాలపై వేసుకుని జిల్లాలోని విశ్వబ్రాహ్మణ పంచ వృత్తిదారులు, వడ్రంగి, స్వర్ణకారులు, కంచర వృత్తిదారులు, శిల్పకారులు, కమ్మరి వృత్తిదారులు, ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు, ప్రభుత్వంలో ఉన్న అధికారులు పౌరోహిత్యం చేస్తున్నటువంటి అందరిని సమన్వయపరచుకునేలా ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు కమిటీలు ఏర్పాటు చేయడానికి కృషి చేసిన ఉమ్మడి అనంతపురం జిల్లా కన్వీనర్ గా ఎన్నికైన వీబి భాస్కర్ బాబు విశ్వ బ్రాహ్మణ సంఘం సీనియర్ నాయకులు పేరుసోముల గురు ప్రసాద్, ఎస్ ఆర్ నాగభూషణం సమక్షంలో కన్వీనర్ గా ఎందుకు చేయడం జరిగిందని తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ గా ఎన్నికైన విబి భాస్కర బాబు మాట్లాడుతూ.. తనకు ఈ అవకాశం ఇచ్చిన పెద్దలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పారిశ్రామిక పాలసీ విధానంలో వడ్రంగి వృత్తిలో, బంగారపు గుర్తులు అవకాశం ఉన్న ప్రతి ఒక్కరికి జిల్లా పరిశ్రమల అధికారితో, రాష్ట్ర ప్రభుత్వాధికారంతో మాట్లాడి రుణ సదుపాయం రాబోయే రెండేళ్లలో కల్పించాలని ఈరోజు జరిగిన కార్యక్రమంలో తీర్మానించడం జరిగిందని తెలియజేశారు.

# దింసా నృత్యానికి గిన్నిస్ ముద్ర... గిరిజన విద్యార్థులు, ఉపాధ్యాయుల కృషికి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రశంసలు
- రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠను ప్రపంచ వేదికపై నిలబెట్టారు

నిమ్మాడ, ఆగస్టు 2 అనంత జనశక్తి న్యూస్



భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి శనివారం విచ్చేసిన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారికి స్వాగతం పలికేందుకు 13 వేల మంది గిరిజన విద్యార్థినులు ప్రదర్శించిన అద్భుతమైన దింసా నృత్యం ప్రపంచ దృష్టిని ఆకర్షించి, గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించడం ప్రతి తెలుగువారికీ, ముఖ్యంగా గిరిజన సమాజానికీ గర్వకారణమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. గిన్నిస్ రికార్డు సాధించిన సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులు నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో ఆదివారం మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గారిని సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి వారిని హృదయపూర్వకంగా అభినందిస్తూ, ఈ అరుదైన విజయాన్ని సాధించిన ప్రతి గిరిజన విద్యార్థికి, ఉపాధ్యాయులకు, నిర్వాహకులకు ప్రత్యేక శుభాకాంక్షలుతెలిపారు. గిరిజనుల గొప్ప సాంస్కృతిక వారసత్వమైన దింసా నృత్యాన్ని ప్రపంచ వేదికపై నిలబెట్టి, గిరిజన సంస్కృతి వైభవాన్ని అంతర్జాతీయ స్థాయిలో చాటిన ఈ ఘనత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని మంత్రి పేర్కొన్నారు. గిరిజన విద్యార్థులు గిన్నిస్ రికార్డు సాధించి రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్రానికి గొప్ప పేరు తీసుకొచ్చారని, రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠను ప్రపంచ వేదికపై నిలబెట్టారని వారందరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.క్రమశిక్షణ, ఐకమత్యం, పట్టుదలతో వేలాది మంది విద్యార్థులు ఒకే వేదికపై అద్భుత ప్రదర్శన ఇవ్వడం అసాధారణ విజయమని కొనియాడారు. ఈ గిన్నిస్ రికార్డు భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. గిరిజన విద్యార్థుల ప్రతిభకు, వారిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయుల అంకితభావానికి మంత్రి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులు మాట్లాడుతూ, ఈ బృహత్తర కార్యక్రమం విజయవంతం కావడంలో రాష్ట్ర ప్రభుత్వం అందించిన సహకారం, ప్రోత్సాహం మరువలేనిదని కొనియాడారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సి. జయరాం, గా. నారాయణరావు, పి. తిరుపతిరావు, ధర్మారావు, ఎ. పద్మారావు, ప్రతినిధి టి. కామేశ్వరరావు, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం వై. సుజాత పాల్గొన్నారు.

# జంతర్ మంతర్ వద్ద ఘర్షణలకు పాకిస్థాన్ టెర్రరిస్ట్ ప్లాన్

- పోలీసు యూనిఫామ్‌లతో విధ్వంసానికి స్కెచ్

అనంతపురం, ఆగస్టు 02 : అనంత జనశక్తి న్యూస్




**పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థల నెట్‌వర్క్‌తో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలతో పశ్చిమ బెంగాల్ పోలీస్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ ఇటీవల బర్ధమాన్ వద్ద హమీమ్ మోండల్ అనే యువకుడిని, ఆ తర్వాత జార్ఖండ్‌లోని సాహిబ్‌గంజ్ వద్ద అతని ప్రియురాలు అర్పితా సర్కార్‌ను అరెస్ట్ చేసింది. విచారణలో వారిద్దరి తీవ్రవాద కుట్రలకు సంబంధించిన సంచలనాత్మక విషయాలు వెలుగులోకి వచ్చాయి. పాకిస్థాన్‌కు చెందిన హ్యాండ్లర్ల ఆదేశాల మేరకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఇటీవల జరిగిన విద్యార్థుల నిరసన ప్రదర్శనలో ఘర్షణలు, గందరగోళం సృష్టించేందుకు వీరు ప్రయత్నించినట్లు అధికారులు తేల్చారు. దీనికోసం రక్షక భట దుస్తులు (పోలీస్ యూనిఫారాలు) కొనుగోలు చేసి, మహిళలు, పురుషులతో కూడిన ఒక బృందంతో ఢిల్లీకి వెళ్లాల్సిందిగా హమీమ్‌కు ఆదేశాలు అందాయి. హమీమ్ గత 4-5 నెలల క్రితం పాక్ ఆధారిత నెట్‌వర్క్ ఉచ్చులో పడ్డాడు. వీఐపీలు, రాజకీయ నాయకులు, పోలీస్ అధికారుల సమాచారాన్ని సేకరించడంతో పాటు కొత్తవారిని ఈ జాలంలోకి లాగడం అతని పనిగా మారింది. ఈ క్రమంలోనే నాలుగేళ్లుగా ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమున్న అర్పితను కూడా ఇందులో భాగస్వామిని చేశాడు. ఈ జంట ముఖ్యంగా రాజకీయంగా ప్రభావం ఉన్న వ్యక్తులు, అధికారులను 'హనీ ట్రాప్' చేసే ముఠాను నడుపుతున్నట్లు STF స్పష్టం చేసింది. అర్పిత ద్వారా బెంగాల్‌కు చెందిన ఒక సీనియర్ మంత్రి కుమారుడిని కూడా వీరు హనీ ట్రాప్ చేసినట్లు అధికారులు నిర్ధారించారు. అలాగే ప్రముఖ నాయకుల వ్యక్తిగత వివరాలు, కదలికలను ట్రాక్ చేయడానికి అర్పిత హమీమ్‌కు సాయపడేది. హమీమ్, అతని పాకిస్థాన్ హ్యాండ్లర్లు నిరంతరం వాట్సాప్, టెలిగ్రామ్, ఎలిమెంట్ ఎక్స్ , సెషన్ వంటి ఎన్‌క్రిప్టెడ్ యాప్‌ల ద్వారా సంప్రదింపులు జరిపేవారని అధికారులు తెలిపారు. ఇందులో పాకిస్థాన్‌లోని షెహజాద్ భట్టీ గ్యాంగ్‌కు చెందిన నాలుగు ముఖ్యమైన హ్యాండ్లర్లను (అబీర్ జాట్333, ఉజైర్, రాణా, హమద్) పోలీసులు గుర్తించారు. వీరు బ్రిటన్, మెక్సికో దేశాల సిమ్ కార్డ్‌లను ఉపయోగిస్తూ యువతను తీవ్రవాదం వైపు బ్రెయిన్‌వాష్ చేసేవారని STF ఐజీ గౌరవ్ శర్మ తెలిపారు. ప్రస్తుతం కోర్టు అర్పితా సర్కార్‌ను 13 రోజుల ఎస్టీఎఫ్ కస్టడీకి ఇచ్చింది. కేసు విచారణ ప్రారంభ దశలోనే ఉందని, మున్ముందు ఈ నెట్ వర్క్‌తో సంబంధమున్న మరికొందరిని అరెస్ట్ చేసే అవకాశం ఉందని పోలీసులు స్పష్టం చేశారు.**



# నడుము సైజ్ పెరిగి బట్టలు టైట్‌గా మారాయా, కోచ్ చెప్పిన ఫుడ్స్ తింటే చాలా వరకూ ఫ్యాట్ తగ్గుతుంది

నడుము భాగం లావుగా మారితే చూడ్డానికి ఎదుటివారి చూపు మొత్తం నడుముపైనే ఉంటుంది. అప్పర్ బాడీ మొత్తం సన్నగానే ఉంటుంది. లోయర్ బాడీ మాత్రమే లావుగా మారి బట్టలు సరిగ్గా సెట్ కావు. వీరిని సాధారణంగా పియర్ షేప్ బాడీ అంటారు. ఇది కూడా ఒక్కొక్కరికి ఒక్కోలా ఉంటుంది. కొంతమందికి నడుము మాత్రమే లావుగా ఉంటే, మరికొంతమందికి నడుము, తొడలు కూడా లావుగా మారతాయి. దీంతో లోయర్ బాడీ మొత్తం కూడా ఫ్యాట్ పెరిగినట్లుగా మారి లావుగా మారుతుంది. ఈ ప్రాబ్లమ్ తగ్గేందుకు ఎక్సర్‌సైజెస్, ఇతర వర్కౌట్స్ వంటివి చేస్తారు. వీటితో పాటు డైట్ కూడా ముఖ్యమే. అలాంటి డైట్ గురించి ఫిట్‌నెస్‌కోచ్ మంకిరత్ ఎక్స్‌ప్లెయిన్ చేస్తున్నారు. అవేంటో చూద్దాం.



**ప్రోటీన్ తీసుకోవడం**

ప్రోటీన్ తీసుకోవడానికి కొంతమంది ప్రోటీన్ పౌడర్స్‌పై డిపెండ్ అవుతారు. అలా కాకుండా, నేచురల్‌గా ప్రోటీన్‌ని తీసుకోవాలి. దీనికోసం నాన్‌వెజ్‌లో అయితే గుడ్లు, చికెన్, చేపల వంటివాటిని తీసుకోవాలి. నడుము తగ్గకపోతే ఇన్సులిన్ స్థిరంగా ఉండదు. మీరు మీ నడుము సైజ్‌ని తగ్గించుకోవాలనుకుంటే ప్రోటీన్ కచ్చితంగా తీసుకోవాలి. అందుకే, మీ డైట్‌లో గుడ్లు, పనీర్, పెరుగు, పప్పుల్ని తీసుకోవాలి. వీటిలో ఎక్కువగా ప్రోటీన్ ఉంటుంది.

**రోజూ గిన్నె పచ్చికూరగాయలు**

రోజూ బౌల్ వెజిటేబుల్స్ తీసుకోవాలి. దీని వల్ల కడుపు ఉబ్బరం ఉండదు. కొలెస్ట్రాల్ కూడా కరుగుతుంది. కూరగాయల్లో ఎక్కువగా దోసకాయ, క్యారెట్, బీట్‌రూట్, క్యాబేజీ వంటివాటిని తీసుకోవచ్చు. దీని వల్ల నీటి నిలుపుదలని తగ్గించి వాపుని



తగ్గిస్తుంది. ఆకుకూరల వంటివాటిని తీసుకోవచ్చు. వీటిని మనం ప్రోటీన్ కాంబినేషన్‌తో కూడా తినొచ్చు.

**ఉదయమే నానబెట్టిన సీడ్స్**

సీడ్స్ కూడా తీసుకోవడం మంచిది. ఇందులో గుమ్మడిగింజలు, అవిసెలు, చియా సీడ్స్ తీసుకోవాలి. వీటి వల్ల హార్మోన్స్‌కి హెల్ప్ అవుతుంది. ఆకలి తగ్గుతుంది. క్రేవింగ్స్ ఉండవు. హ్యాపీగా వీటిని చక్కగా తీసుకోవచ్చు.

**పండ్లు తినడం**

పండ్లు ఎంతో ఆరోగ్యకరం. కానీ, వీటిని



సరైన టైమ్‌లో సరైన విధంగా తీసుకుంటేనే మంచిది. పండ్లని అలానే తీసుకుంటే బాడీలో ఎక్కువగా షుగర్ పెరుగుతుంది. దీంతో బెల్లీ ఫ్యాట్ పెరుగుతుంది. అలా కాకుండా సీడ్స్, ప్రోటీన్‌తో కలిపి తీసుకోండి. దీంతో చాలా వరకూ మంచి రిజల్ట్ ఉంటుంది.

**డ్రింక్స్ ఏం తాగాలంటే**

పంచదార కలిపిన జ్యూస్‌లు, ఫ్యాన్సీ కాఫీ, హెల్దీ డ్రింక్స్ అంటూ తీసుకుంటారు. కానీ, వీటిలో కలిపిన పంచదార వల్ల నడుములో ఫ్యాట్ పెరుగుతుంది. అందుకే, అవి కాకుండా నీరు తాగండి. దీంతో బాడీ హైడ్రేట్ అవుతుంది. బాడీలో పేరుకుపోయిన ట్యాక్సిన్స్ అన్నీ కూడా బయటికి వెళ్లిపోతాయి.

**డిన్నర్ చేయడం**

అదే విధంగా, రాత్రి డిన్నర్ కూడా సరైన విధంగా తీసుకోవాలి. లేట్‌గా తినొద్దు. దీంతో కార్టిసాల్ పెరిగి బెల్లీ ఫ్యాట్ పెరుగుతుంది. అయితే, రాత్రి డిన్నర్ తర్వాత 10 నుంచి 15 నిమిషాల తర్వాత కొద్దిపాటి వాకింగ్ చేయడం మంచిది.

కొంతమంది నడుము లావుగా ఉందంటే అది జెనెటిక్ అంటారు. కానీ, మనం సరైన విధంగా డైట్ మెంటెయిన్ చేసి లైఫ్‌స్టైల్ ఫాలో అయితే హార్మోన్స్ సరిగ్గా మారితే నడుము సైజ్ తగ్గుతుంది. ఇప్పుడు చెప్పిన డైట్‌ని సరిగ్గా 28 రోజుల పాటు తీసుకుంటే చాలా వరకూ బాడీలోని కొలెస్ట్రాల్ తగ్గుతుంది. దీంతో నడుము సైజ్ కూడా తగ్గుతుంది.

# జుట్టు రాలడాన్ని తగ్గించి లివర్ బ్లడ్‌కి హెల్ప్ చేసే సూప్



ఆయుర్వేదంలో మనకం ఎన్నో అద్భుత పదార్థాలు ఉంటాయి. వీటిని వాడడం వల్ల చాలా వరకూ మనకి ఉన్న సమస్యల్ని దూరం చేసుకోవచ్చు. అలాంటి వాటిలో జుట్టు సమస్యల్ని దూరం చేయడం కూడా ఒకటి. ప్రజెంట్ చాలా మంది అందంపై ఫోకస్ చేయడంతో జుట్టు అందంగా, ఆరోగ్యంగా కనిపించాలని చాలా ప్రయత్నాలు చేస్తున్నారు. అలాంటి రిజల్ట్స్ కోసం మనం బయట దొరికే పదార్థాలని కాకుండా కొన్ని ఆయుర్వేద మార్గాలను ఎంచుకోవచ్చు. అలాంటి ఓ టానిక్ గురించి తెలుసుకోండి. నోటిద్వారా తీసుకునే ఈ సూప్‌ని నల్లనువ్వులతో తయారుచేస్తాం. ఇది జుట్టు సమస్యల్నే కాకుండా ఇతర సమస్యల్ని కూడా దూరం చేస్తాయి.









**జుట్టు పెరుగుదలని పెంచే సూప్**

సాధారణంగా ఈ సూప్‌ని ఆయుర్వేద ఎక్స్‌పర్ట్ అనిసెంట్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా షేర్ చేసుకున్నారు. చైనీస్ వైద్యం నుండి ఇన్‌స్పైర్ అయిన ఈ సూప్‌ని జుట్టు పెరుగుదలకి హెల్ప్ చేసే టానిక్‌గా చూడొచ్చు. దీనిని తీసుకోవడం వల్ల తల, జుట్టు మూలాలకి అవసరమైన ఖనిజాలు అందుతాయి.

**సూప్‌తో కలిగే లాభాలు**

ఇప్పుడు నల్లనువ్వులతో తయారుచేసిన ఈ సూప్ కిడ్నీకి మేలు చేసి లివర్ బ్లడ్‌ని ప్యూరిఫై చేస్తుంది. చైనీస్ వైద్యంలో బలమైన, నల్లని హెల్దీ జుట్టు మీ సొంతమవుతుంది. నేచురల్‌గానే జుట్టుని బలంగా చేయడంలో ఈ టానిక్ హెల్ప్ చేస్తుంది.

**టానిక్ తయారీకి కావాల్సిన పదార్థాలు**

- 2 టేబుల్ స్పూన్ల నల్లనువ్వులు
- 2, 3 టేబుల్ స్పూన్ల నీరు
- 2 కప్పుల ఫిల్టర్ నీరు
- 1 టేబుల్ స్పూన్ బియ్యం పిండి
- 1 టీస్పూన్ అన్‌రిఫైండ్ పంచదార

**ఎలా తయారుచేయాలి?**

- నల్లనువ్వుల్ని ముందుగా 10 నిమిషాల పాటు తక్కువ మంటపై పొడిగా వేయించాలి. ఎక్కువగా ఫ్రై చేయొద్దు.
- ఈ గింజల్ని కొద్దిగా నీరు పోసి పేస్టులా చేయండి.
- ఓ పాన్‌లో 2 కప్పుల నీరు నువ్వుల పేస్ట్, బియ్యం పిండి, పంచదార వేయండి.
- వీటన్నింటిని బాగా మరిగించండి. 10 నిమిషాల పాటు మరిగాక సిమ్‌లో ఉంచండి.
- అంతే పోషకాలతో నిండిన సూప్ తయారి.

**ఎప్పుడు, ఎంత పరిమాణంలో తాగాలి.**

- ఈ సూప్‌ని వారానికి రెండు సార్లు తాగాలి. చలికాలంలో తాగితేనే మంచిది.
- సాయంత్రం లైట్‌ఫుడ్‌తో కలిపి తీసుకోవాలి. 4 నుంచి 6 వారాల పాటు రెగ్యులర్‌గా తీసుకుంటే మంచి రిజల్ట్స్ కనిపిస్తాయి.

**ఎలా పనిచేస్తుంది?**

- సూప్‌లో ఐరన్, జింక్‌లు ఉంటాయి. ఇవి తలపై చర్మ రక్తప్రసరణని మెరుగు పరిచి జుట్టు, కుదుళ్ళ బలాన్ని మెరుగ్గా చేస్తుంది.
- కాల్షియం, మెగ్నీషియంలు కెరాటిన్ ఉత్పత్తి, కుదుళ్ళ ఆరోగ్యాన్ని పెంచుతుంది.
- ఒమేగా 6 కొవ్వులు, విటమిన్ ఈ పొడి, డ్రై హెయిర్‌ని మృదువుగా చేస్తుంది.
- సెసామిన్ అనే యాంటీ ఆక్సిడెంట్స్ ఫోలికల్స్‌ని ఒత్తిడి నుండి కాపాడతాయి.

**చైనిస్ వైద్యంలో ఎలా వాడతారు?**

- చైనీస్ వైద్యంలో ఈ టానిక్‌ని జుట్టుని కిడ్నీ ఎసెన్స్, లివర్ బ్లడ్ పొడిగింపుగా వాడతారు.
- నల్లనువ్వులు జుట్టుకి టానిక్‌లా పనిచేసేందుకు హెల్ప్ చేస్తాయి.
- వీటి వల్ల జుట్టు రంగు నెరవడం, రాలడం తగ్గడం, కుదుళ్ళు బలంగా మారడానికి హెల్ప్ చేస్తాయి.
- కొంతమందికి జీర్ణ సమస్యలు, డయేరియా, పేగు మంట వంటి సమస్యలు ఉంటాయి. అలాంటివారు వాడొద్దు.

అనంత జనశక్తి
సోమవారం | అనంతపురం
03.08.2026



## అలాంటి పోలికలతో.. యువతని తప్పుదోవ పట్టించొద్దు



నటి, రాజకీయ నాయకురాలు కంగనా రనౌత్ ఇటీవల జెన్‌జీపై చేసిన వ్యాఖ్యలకుగానూ సామాజిక మాధ్యమాల్లో ఆమెపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెలువెత్తిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే ట్రోలర్స్ తెరపై ఆమె పోషించిన పాత్రలను.. ప్రస్తుత టీనేజర్ల పరిస్థితులతో పోల్చుతూ కొన్ని వీడియోలు వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో కంగనా ట్రోలర్స్‌పై మండిపడుతూ ఇన్‌స్టా స్టోరీలో ఘాటుగా స్పందించారు. నటిగా కెరీర్‌లో విభిన్నమైన పాత్రలు పోషించానని, ఒక పాత్రకు అనుగుణంగా మారడం తన వృత్తికి అవసరమని.. దానిని అంగీకరించడంలో తాను సిగ్గుపడాల్సిందేమి లేదని ఆమె వ్యాఖ్యానించారు. "నేను నటించడానికి రూ. కోట్ల పారితోషికం తీసుకుని ఆయా చిత్రాల్లో పాత్రలు పోషించాను. పెద్ద పెద్ద ఈవెంట్లలో పాల్గొన్నప్పుడు నా చుట్టూ భారీ భద్రత ఉంటుంది. అలాంటి వాటిని ఉదాహరణగా చూపిస్తూ.. రోడ్లమీద, ఫంక్షన్‌లలో కూడా టీనేజర్లు అలాగే ప్రవర్తించవచ్చా? ఈ రెండూ ఒకటేనా? నటిగా నా వృత్తికి తగ్గట్లుగా పాత్రలు పోషిస్తాను. ఈ విషయంలో నేను సిగ్గుపడాల్సింది ఏమీ లేదు. దయచేసి అలాంటి పోలికలతో యువతని తప్పుదోవ పట్టించకండి. ఇవాళ ఇతరుల పిల్లలను మీరు తప్పుదోవ పట్టిస్తే.. రేపు ఆ పరిస్థితి మీ పిల్లలకు రావచ్చు" అని పోస్ట్‌లో పేర్కొన్నారు. కంగనా ప్రస్తుతం 'క్వీన్ 2'తో పాటు పలు చిత్రాల్లో నటిస్తున్నారు.

## ఈ ప్రయాణమంతా నా బిడ్డతోనే..
# దీపికా ఆసక్తికర పోస్ట్



బాలీవుడ్ అగ్రకథానాయిక దీపికా పదుకొణె మరోసారి తల్లి కాబోతున్న సంగతి తెలిసిందే. ఆమె తన రెండో సంతానం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా తన ప్రెగ్నెన్సీకి సంబంధించిన ఓ వీడియోను ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ వేదికగా అభిమానులతో పంచుకున్నారు.

సాధారణంగా గర్భంతో ఉన్నప్పుడు ఎక్కువ బరువు ఎత్తకూడదని చెబుతుంటారు. కానీ, గర్భవతులుగా ఉన్నప్పటికీ తల్లులు తమ మొదటి బిడ్డను ఎత్తుకుంటూ ఉంటారు. సరిగ్గా ఈ విషయాన్నే చెబుతూ ఉన్న ఓ రీల్‌ను దీపిక పంచుకున్నారు. "నా ప్రెగ్నెన్సీ ప్రయాణం అంతా ఇలాగే సాగుతోంది" అని దానికి క్యాప్షన్ ఇచ్చారు. ఈ వీడియో నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటోంది. తన వ్యక్తిగత విషయాలను దీపిక ఎక్కువగా బయటకు వెల్లడించరు. కానీ, అప్పుడప్పుడూ ఇలాంటి పోస్ట్‌లు చేస్తూ అభిమానులను అలరిస్తుంటారు. ప్రస్తుతం ఆమె తన మొదటి బిడ్డతో సమయం గడుపుతూనే, రెండో బిడ్డకు స్వాగతం పలికేందుకు సిద్ధమవుతున్నారు. పూర్తి సమయాన్ని కుటుంబానికే కేటాయిస్తున్నారు.

మరోవైపు వృత్తిపరంగానూ దీపికా వార్తల్లో నిలుస్తున్నారు. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న 'స్పిరిట్', 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ నుంచి ఆమె తప్పుకొన్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రెగ్నెన్సీ కారణంగా తాను రోజుకు కేవలం 8 గంటలు మాత్రమే పనిచేస్తానని షరతు విధించడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. 'కల్కి' తొలి భాగంలో పని చేసినప్పటికీ, ఇప్పుడు కొన్ని కారణాల వల్ల సీక్వెల్‌లో ఆమె నటించడం లేదని నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ కూడా ఇటీవల వెల్లడించింది.

## 'ఎల్లమ్మ'లో పర్షిగా దేవిశ్రీ ప్రసాద్.. ఫస్ట్‌లుక్ చూశారా?




సంగీత దర్శకుడిగా చిత్ర పరిశ్రమలో తనదైన ముద్ర వేశారు దేవిశ్రీ ప్రసాద్ . ఇప్పుడాయన వెండితెరపై అలరించబోతున్న సంగతి తెలిసిందే. 'బలగం' వేణు యెల్దండి దర్శకత్వంలో దేవిశ్రీ ప్రసాద్ నటిస్తున్న తాజా చిత్రం 'ఎల్లమ్మ' . ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. ఆగస్టు 2న దేవి పుట్టినరోజు సందర్భంగా ఈ మూవీలోని ఆయన లుక్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. చేతిలో కిరీటం పట్టుకుని రెట్రోలుక్‌లో ఆయన కనిపించారు.'ఎల్లమ్మ... నుంచి పర్షిని పరిచయం చేస్తున్నాం. మట్టి నుంచి పుట్టిన ఈ పాత్రను మీరెప్పటికీ గుర్తుంచుకుంటారు. ఈ ప్రయాణాన్ని కూడా మీరెప్పటికీ మర్చిపోలేరు. ఆయన సంగీతాన్ని మనం సెలబ్రేట్ చేసుకున్నాం. దాంతో పాటు, ఈసారి వెండితెరపై ఆయన నటనను కూడా వేడుకగా జరుపుకొందాం. రాక్‌స్టార్ డీఎస్‌పీకి పుట్టినరోజు శుభాకాంక్షలు. రాబోయే అద్భుతాలను ఈ ప్రపంచం అస్సలు ఊహించలేదు" ఈ చిత్రంలో దేవిశ్రీ ప్రసాద్ డప్పు కళాకారుడిగా కనిపించనున్నట్లు ఇప్పటికే విడుదల చేసిన గ్లింప్స్ చూస్తే అర్థమవుతోంది. అంతకుమించిన సరికొత్త కథాంశంతో వేణు దీనిని రూపొందిస్తున్నారు. వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై శిరీష్ నిర్మిస్తున్నారు. తెలుగుతోపాటు, తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. నాగార్జున 100వ చిత్రానికి సంగీత దర్శకుడిగా.. అగ్ర కథానాయకుడు నాగార్జున 100వ చిత్రం పట్టాలెక్కేందుకు సిద్ధమైంది. రా.కార్తిక్ దర్శకత్వంలో నాగార్జున నటిస్తున్న ఈ మూవీకి సంగీత దర్శకుడిగా దేవిశ్రీ ప్రసాద్ పనిచేయనున్నారు. చిత్ర నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్ ఈ విషయాన్ని ప్రకటించింది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో 'మన్మథుడు', 'మాస్', 'కింగ్', 'ఢమరుకం', 'కుబేర' చిత్రాలు వచ్చిన సంగతి తెలిసిందే.

## ఓటీటీలోకి 'కాక్‌టెయిల్ 2'.. స్ట్రీమింగ్ ఎక్కడంటే?



షాహిద్ కపూర్ హీరోగా కృతిసనన్ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'కాక్‌టెయిల్ 2' (Cocktail 2). హోమీ అదజానియా దర్శకత్వం వహించా రు. ఈ ట్రయాంగిల్ లవ్‌స్టోరీ జూన్ 19న విడుదలై బాక్సాఫీస్ వద్ద మం చి టాక్ సొంతం చేసుకుంది. తాజాగా ఈ మూవీ ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ సంస్థ 'నెట్‌ఫ్లిక్స్' వేదిక గా ఆగస్టు 14 నుంచి స్ట్రీమింగ్ కానుంది. 2026లో విడుదలై తొలి వీకెం డ్‌లో రూ.50 కోట్లు దాటిన హిందీ సినిమాల్లో 'కాక్‌టైల్ 2' ఒకటిగా నిలిచింది.

## జెర్సీ వివాదం పక్కనపెట్టి..
# 50 ఏళ్ల పతకం కరవు తీర్చండి



### - దిగ్గజ గోల్‌కీపర్

పురుషుల హాకీ ప్రపంచ కప్ ఆగస్టు 15 నుంచి 30 వరకు జరగనుంది. ఈ టోర్నీకి బెల్జియం, నెదర్లాండ్స్ సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి. ఈ క్రమంలోనే వరల్డ్ కప్‌నకు ముందు భారత పురుషుల, మహిళల జాతీయ జట్ల జెర్సీని నీలం నుంచి కాషాయం రంగులోకి మార్చడం వివాదాస్పదమైంది. ఈ నేపథ్యంలో భారత జట్టుకు దిగ్గజ గోల్‌కీపర్ పీ ఆర్ శ్రీజేశ్ కీలక సూచన చేశాడు. అనవసరమైన జెర్సీ వివాదాన్ని పక్కనపెట్టి ప్రపంచ కప్ పతకం కోసం భారత్ 50 ఏళ్ల నిరీక్షణకు తెరదించేలా ప్రదర్శన చేయడంపై దృష్టిసారించాలన్నాడు. ఈ టోర్నీలో భారత జట్టు ఒక్కసారి మాత్రమే ఛాంపియన్‌గా నిలిచింది. 1975లో పాక్‌ను ఓడించి విజేతగా అవతరించింది. తర్వాత ఒక్క పతకం కూడా సాధించలేదు.

"నిజం చెప్పాలంటే, అసలు సమస్య ఏమిటో నాకు మొదట్లో అర్థం కాలేదు. ఎందుకంటే 2014, 2018 ప్రపంచ కప్‌ల సమయంలో కూడా జెర్సీ రంగు మారింది. మా శిక్షణ జెర్సీ నారింజ రంగులోనే ఉండేది. మరి ఈసారి ప్రపంచ కప్‌నకు ముందు దీనిపై ఇంత చర్చ ఎందుకు జరుగుతోంది? అది కాషాయ రంగు అయినందుకా? లేక కేవలం రంగు మారినందువల్లా? సమస్య జెర్సీ రంగుతోనే అయితే గతంలోనూ దీని గురించి చర్చ జరగాల్సింది. జెర్సీ రంగు మార్చడంతో నాకు ఎలాంటి ఇబ్బంది లేదు. కానీ, చెబుతున్న కారణం వింతగా ఉంది. బ్లూ సింథటిక్ మైదానంలో ఆటగాళ్లు బాగా కనిపించేందుకే జెర్సీ రంగును మార్చినట్లయితే మళ్లీ బ్లూ జెర్సీని ఎప్పుడూ ధరించకూడదు.

క్రీడలను రాజకీయాలకు దూరంగా ఉంచాలి. భారత జట్టు ఇప్పుడు యూరప్‌లో ఉంది. వారు ఈ విషయాలన్నింటిని పక్కనపెట్టి టోర్నమెంట్‌పై దృష్టిపెట్టాలి. పతకం కోసం 50 ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం. ఇప్పుడు సువర్ణావకాశం వచ్చింది. మన పూల్‌లో ఇంగ్లాండ్ మాత్రమే బలమైన జట్టు. సునాయసంగా సెమీ ఫైనల్స్‌కు వెళ్లే అవకాశముంది. ఇలాంటి ఛాన్స్ మళ్లీ రాదు. ఆటగాళ్లు అత్యుత్తమ ప్రదర్శన చేసి 50 ఏళ్ల పతక నిరీక్షణకు ముగింపు పలకాలి" అని శ్రీజేశ్ పేర్కొన్నాడు. ఈ వరల్డ్ కప్‌లో పూల్ డిలో ఉన్న భారత్ ఆగస్టు 15న వేల్స్‌తో తొలి మ్యాచ్ ఆడనుంది. 17న ఇంగ్లాండ్‌తో, 19న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడనుంది. చివరగా 2023లో జరిగిన వరల్డ్ కప్‌లో భారత్ తొమ్మిదో స్థానంలో నిలిచింది.

## నెక్ట్స్ టార్గెట్ ఆసియా క్రీడల పతకమే: మీరాబాయి చాను



కామన్వెల్త్ క్రీడల్లో వరుసగా మూడో స్వర్ణం సాధించిన భారత వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను స్వదేశానికి చేరుకుంది. దిల్లీ విమానాశ్రయంలో ఆమెకు అభిమా నులు ఘన స్వాగతం పలికారు. అనంతరం చాను మాట్లాడారు. సెప్టెం బరులో మొదలయ్యే ఆసియా క్రీడల్లో పతకం సాధించడమే తన లక్ష్యమని పేర్కొంది. "పతకం సాధించడం చాలా సంతోషాన్నిస్తుంది. కానీ అది చాలా కష్టమైనది కూడా. ఒత్తిడి, బాధ్యత మరింత పెరుగుతుంది. రాబోయే పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాల్సి ఉంటుంది. ఆసియా క్రీడల్లో పతకం సాధించడం నాకు చాలా ముఖ్యం. ఇంతకుముందెన్నడూ ఆసియా గేమ్స్‌లో నేను పతకం గెలవలేదు. కాబట్టి.. అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడానికి ప్రయత్నిస్తా. అక్కడ పతకం సాధించడమే నా నెక్ట్స్ టార్గెట్. కొంతమంది అథ్లెట్లు పతకం గెలిచినప్పుడు చాలా సంతోషిస్తారు. కానీ నాకు పతకం గెలవడం బలాన్ని ఇస్తుంది. తదుపరి మెడల్ గెలవడానికి మరింత కష్టపడాలని అనుకుంటున్నాను. ఆసియా క్రీడల సమయానికి గాయాల బారిన పడకుండా ఉండటమే కీలకం. ఈ టోర్నమెంట్ కోసం ప్రత్యేక శిక్షణ ఏమీ అవసరం లేదు. సాధారణ శిక్షణ సరిపోతుంది" అని 31 ఏళ్ల మీరాబాయి చాను తెలిపింది. ఈ కామన్వెల్త్ క్రీడల్లో భారత్‌కు తొలి స్వర్ణం అందించింది మీరాబాయి చానునే. మహిళల వెయిట్ లిఫ్టింగ్ 48 కేజీల విభాగంలో 190 కేజీల బరువు ఎత్తి పసిడి పతకం గెల్చుకుంది. 2018 (గోల్డ్ కోస్ట్), 2022 (బర్మింగ్‌హామ్) కామన్వెల్త్ క్రీడల్లోనూ ఈ మణిపూర్ ఉక్కుమహిళ బంగారు పతకం సాధించింది.

## ఇప్పటికే భారత్ తరఫున ఆడాను..
# కొత్తగా సాధించాల్సిందేమీ లేదు



సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్‌కు మళ్లీ జాతీయ జట్టులో అవకాశం ఇవ్వాలనే చర్చ నడుస్తోంది. ఈ వెటరన్ బౌలర్ మాత్రం తనకు అలాంటి ఆలోచనలు ఏమీ లేవని స్పష్టం చేశాడు. ప్రస్తుతం తన జీవితం సాఫీగానే ఉందని వెల్లడించాడు. భువనేశ్వర్ చివరిసారిగా 2022లో భారత్ తరపున ఆడాడు. ప్రస్తుతం ఐపీఎల్‌తోపాటు దేశవాళీలోనే ఆడుతున్నాడు. ఇటీవల ముగిసిన సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వరుసగా రెండోసారి విజేతగా నిలవడంలో భువీ కీలక పాత్రే పోషించాడు.

"నేను ఇప్పటికే భారత్ జట్టుకు ఆడాను. ఇంక ప్రత్యేకంగా సాధించాల్సిందేమీ లేదు. మళ్లీ అవకాశం వస్తే గొప్పగా భావిస్తా. కానీ, ఆ అనుభవం ఇప్పటికే ఉంది. ఆటపై ఉన్న ప్రేమే నన్ను నడిపిస్తుంది. క్రమశిక్షణతో ఎలా ఉండాలో నాకు తెలుసు. ఐపీఎల్‌లో ఆడుతున్నా. అలాగే దేశవాళీలోనూ బరిలోకి దిగుతున్నా. గతంలో యూపీ టీ20 లీగ్ ఆడా. ఇప్పుడు నేను చాలా ప్రశాంతంగా ఉన్నా. అందుకు నా ఫ్యామిలీకి క్రెడిట్ ఇవ్వాలి. ఇంట్లో క్రికెట్ గురించి మాట్లాడుకోం. మళ్లీ జాతీయ జట్టుకు వెళ్తే పరిస్థితి ఏంటని ఇప్పటి వరకు చర్చించుకోలేదు. ఎందుకు సెలక్ట్ కాలేదు. నేనేం పొరపాటు చేశాననే విషయాలపై మాట్లాడుకోలేదు. నాకెలాంటి విచారమూ లేదు" అని భువీ తెలిపాడు.

**వారిద్దరితోనే..**

"దేశంలోని యువ బౌలర్లు, బ్యాటర్లకు ఐపీఎల్ (IPL) మంచి అవకాశాలను కల్పిస్తోంది. వారిని గుర్తించి.. పరిణతి సాధించే వరకూ అండగా నిలుస్తోంది. చాలా మంది నైపుణ్యం ఉన్న పేసర్లను వెలుగులోకి తీసుకొచ్చింది. భారత్‌లోని పిచ్‌లు స్పిన్‌కు సహకరిస్తుండటం ఎప్పట్నుంచో వస్తోంది. ఓవర్సీస్ పిచ్‌లు పేస్‌కు అనుకూలం. విదేశాల్లో భారత్ మెరుగైన ప్రదర్శన చేయడం వెనుక విరాట్ కోహ్లీ, రవిశాస్త్రి పాత్ర కీలకం. టెస్టుల్లో గొప్ప విజయాలను నమోదు చేశాం" అని భువి గుర్తు చేశాడు.

**ప్రవీణ్ కుమార్ ప్రభావం..**

"మాజీ క్రికెటర్ ప్రవీణ్ కుమార్, నేను ఒకే అకాడమీ నుంచి వచ్చాం. నేను అక్కడ జాయిన్ అయ్యేటప్పటికే ప్రవీణ్ స్టేట్ స్థాయి క్రికెట్ ఆడుతున్నాడు. నేను రాష్ట్రస్థాయికి వచ్చేటప్పటికి అతడు టీమ్‌ఇండియాలో సభ్యుడయ్యాడు. మా ఇద్దరి బౌలింగ్ శైలి దాదాపు ఒకేలా ఉంటుంది. అకాడమీలో ప్రవీణ్‌ను ప్రశ్నలు అడగాలంటే కాస్త సిగ్గుపడేవాడిని. అందుకే అతడి బౌలింగ్‌ను ఎక్కువగా అబ్జర్వ్ చేసేవాడిని. ఇప్పుడు అదంతా గుర్తు చేసుకుంటుంటే నేను చాలా లక్కీ అనిపిస్తుంది. యువ క్రికెటర్లకు ఆటపట్ల ప్రేమ ఉండాలి. అప్పుడే సక్సెస్ సాధించేందుకు ఎక్కువ అవకాశం ఉంటుంది" అని భువనేశ్వర్ తెలిపాడు.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314